# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

మంగళవారం, జనవరి 28, 2025 | సంపుటి - 21 | సంచిక 131 | వెల - 7 | పేజీలు -12 + 8

Published from Vijayawada Circulated from Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Anantapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam


## గుల్లెయిన్ బారే సిండ్రోమ్‌తో తొలిమరణం

- 101కు చేరిన పుణేలో జీబీఎస్ సోకిన వారి సంఖ్య
- 16 మంది రోగుల పరిస్థితి విషమం



**ముంబై,**
గుల్లెయిన్ బారే సిండ్రోమ్‌తో మహారాష్ట్రలో తొలి మరణం నమోదైనట్లుగా తెలుస్తున్నది. సోలాపూర్‌లో ఓ వ్యక్తి మరణించగా.. మరణానికి జీబీఎస్ కారణంగా మరణించినట్లుగా ఆరోగ్యశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలో సిండ్రోమ్ బారినపడుతున్న రోగుల సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉన్నది.



## జాతీయ ప్రధాన కార్యదర్శిగా తప్పుకుంటా

### పార్టీలో కొత్తవారికి ఎక్కువ అవకాశాలు ఇస్తాం

- దావోస్‌లో పెట్టుబడుల కోసం కృషి చేశాం
- రెడ్‌బుక్ ప్రకారం చర్యలు తప్పవన్న లోకేశ్

**విశాఖపట్టణం,**
హా[illegible]తీసుకోనని, పార్టీకోసం పనిచేస్తానని మంత్రి లోకేశ్ అన్నారు. తనతో పాటు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కూడా పదవి తీసుకోరని అన్నారు. పార్టీలో కొత్తవారికి అవకాశం కల్పించాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. సాక్షిపై పరువు నష్టం కేసులో విశాఖ కోర్టుకు ఆయన హాజరయ్యారు. కేసు విచారణ ఫిబ్రవరి 28కి వాయిదా పడిరది. కోర్టుకు

డారు. 2019లో సాక్షి పత్రిక తనపై అసత్య ఆరోపణలు చేసిందని మంత్రి నారా లోకేశ్తెలిపారు. అప్పుడే వారికి లీగల్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. గత ఐదు సంవత్సరాలుగా న్యాయ పోరాటం చేస్తున్నాను.. ఇది నాలుగో వాయిదా. నిజం నా వైపు ఉంది.. ఎన్ని సార్లయినా వస్తాను.

## వైసిపి హయాంలో మంత్రులంతా డమ్మీ



- పార్లమెంటులో తనను అవమానించిన వైసిపి
- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

వివరాలు 2లో..

## తెచ్చిన అప్పులన్నీ ఏం చేశారో తెలియదు

# సంపద సృష్టించాలి



గత ప్రభుత్వం.. ప్రభుత్వ కార్యాలయాలను తాకట్టు పెట్టింది

- రూ.67 వేల కోట్లు అప్పులతో దివాళా తీయించారు
- అప్పులు చేసి దుబారా చేసిన జగన్ ప్రభుత్వం
- అప్పులకు వడ్డీకట్టలేని దుస్థితిలో ఆర్థిక పరిస్థితి
- ఆర్థిక పరిస్థితి బాగోలేకపోతే పన్నుల భారం తప్పదు
- నీతి ఆయోగ్ నివేదికపై మీడియా సమావేశంలో చంద్రబాబు

2లో..

గత ప్రభుత్వం చేసిన అప్పులపై వడ్డీలు కట్టలేని దుస్థితిలో ప్రస్తుతం రాష్ట్రం ఉందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోతే ప్రజలపై పన్నుల భారం పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అభివృద్ధి పనుల వల్లే సంపద పెరుగుతుంది. అలాగని అప్పులు చేసి.. పనులు చేస్తే ఇబ్బందులు పెరుగుతాయి. అప్పులు తిరిగి తీర్చే శక్తి మనకు ఉందో లేదో చూడాలి. అప్పులు చేసి తిరిగి చెల్లించే శక్తి మన రాష్టానికి లేదు. అందుకే గత ప్రభుత్వం.. ప్రభుత్వ కార్యాలయాలను తాకట్టు పెట్టింది. గత ఐదేళ్లలో వచ్చిన డబ్బును ఏం చేశారో తెలియడం లేదు. తెచ్చిన అప్పులను ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెడితే ఆదాయం పెరగదు. గతంలో చేసిన అప్పులకు వడ్డీ కట్టడం కూడా ప్రస్తుతం కష్టంగా ఉందని చంద్రబాబు అన్నారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించలేని పరిస్థితి ఎదురవుతుం దన్నారు. 2022-2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నీతి ఆయోగ్ ఇచ్చిన రిపోర్టుపై సీఎం మీడియా సమావేశం నిర్వహించారు.

**అమరావతి,**
స్టేట్ ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్-2025 నివేదికపైనా సీఎం ప్రజెంటేషన్ ఇచ్చారు. నీతి ఆయోగ్ ఇచ్చిన నివేదికను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. '202223 ఆర్థిక సంవత్సరంలో రూ.67 వేల కోట్లు అప్పులు తెచ్చారు. కానీ, ఆ రుణాలను కనీస స్థాయిలో కూడా అభివృద్ధి ప్రాజెక్టులకు వినియోగించలేదు. వచ్చిన డబ్బులతో వైకాపా ప్రభుత్వం దుబారా ఖర్చులు చేసింది. రాష్ట్ర ఆదాయం కూడా 17.1 శాతం నుంచి 9.8 శాతానికి తగ్గిపోయింది. అప్పులు 16.5 శాతం మేర పెరిగాయి. వడ్డీ కట్టే మొత్తం కూడా 15 శాతం పెరిగింది. ఇవి కాకుండా ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ కూడా పెద్ద మొత్తంలో జరిగాయి. వైకాపా హయాంలో ఎక్కువ వడ్డీకి అప్పులు తేవడం, మూల ధన వ్యయం లేకపోవడం, పన్నులు పెంచడం లాంటి వివిధ అంశాల వల్ల ఏపీ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని వివరించారు. 'ఆరోగ్యంపై మనం ఎప్పుడూ దృష్టి పెడతాం. ఆరోగ్యం బాగుంటేనే ఏదైనా చేయగలం. అనారోగ్యంతో ఉంటే ఇంట్లో అందరికీ ఇబ్బందులు వస్తాయి. ఆర్థిక పరిస్థితి బాగా లేకుంటే అభివృద్ధి పనులు సరిగా చేయలేం. ఇదే కొనసాగితే చివరికి బాధపడేది ప్రజలే. రాష్ట్ర, దేశ భవిష్యత్ కోసం అందరూ ఆలోచించాలి. అభివృద్ధి పనులపై నిధులు ఎక్కువ ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోతే ప్రజలపై పన్నుల భారం పడుతుందని అభివృద్ధి పనులకు నిధులు కేటాయించలేని పరిస్థితి ఎదురవుతుందన్నారు. గతంలో చేసిన అప్పులకు వడ్డీ కట్టడం కూడా ప్రస్తుతం కష్టంగా ఉంది' అని చంద్రబాబు అన్నారు. 2022-23లో రూ.7,244 కోట్లు మూల ధన వ్యయం చేశారు. ఒక్క జలవనరు ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదు. 2014-19తో పోలిస్తే గత ఐదేళ్లలో మూల ధన వ్యయం 60శాతం మేర తగ్గిపోయింది. ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్‌లో ఏపీ 18వ ర్యాంకులో ఉంది. వృద్ధి రేటు లేకపోవడం వల్ల రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల మేర నష్టపోయింది. ఏటా రూ.76 వేల కోట్ల ఆదాయం

## ప్రపంచాభివృద్ధిలో భారతదేశ యువత కీలక భూమిక

- వీరి భాగస్వామ్యం లేకుండా అభివృద్ధిని ఊహించలేం
- ఎన్‌సిసి ర్యాలీలో ప్రధాని మోడీ ఉద్ఘాటన



2

**న్యూఢిల్లీ,**
ప్రపంచాభివృద్ధిలో భారత దేశ యువత కీలక భూమిక వహిస్తోందని, వీరి భాగస్వామ్యం లేకుండా ప్రపంచాభివృద్ధిని ఊహించలేమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దశాబ్దాలుగా దేశ యువత ఎదుర్కొంటున్న సమస్యలను తొలగించేందుకు తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు.

## సుప్రీంకోర్టులో జగన్‌కు ఊరట

- బెయిల్ రద్దు పటిషన్ తిరస్కరించిన ధర్మాసనం
- కేసును బదిలీ చేయాల్సిన అవసర లేదని వ్యాఖ్య
- సుప్రీం తీర్పుతో రఘురామ పిటిషన్ ఉపసంహరణ

**న్యూఢిల్లీ, (నినాదం):**
సుప్రీం కోర్టులో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి భారీ ఊరట లభించింది.. వైఎస్ జగన్ బెయిల్‌ను రద్దు చేయాలంటూ.. మరోవైపు జగన్ పై ఉన్న కేసులను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్



2



## వైసీపీ నుంచి జనసేనలోకి వలసల జోరు

- జనసేనలోకి వైసిపి నుంచి భారీగా చేరికలు
- చిత్తూరు నుంచి ప్రధాన అనుచరుల చేరిక
- నాగబాబు సమక్షంలో కండువా కప్పుకున్న నేతలు

**అమరావతి,**
అధికార కూటమిలోని పార్టీల్లోకి వైసీపీ నుంచి వలసల జోరు పెరిగింది. ముఖ్యంగా వైసీపీలో అగ్రనేతలకు చెందిన నియోజకవర్గాల్లోని కీలక నేతలు, వారి ప్రధాన అనుచరులు పార్టీలు మారుతోన్నారు. సోమవారం దాదాపు

▸▸తరువాయి 2లో

## టూరిజంపై నిర్లక్ష్యం చేశారు

- అభిశృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి
- స్పీకర్ అయ్యన్న పాత్రుడు వెల్లడి



2

## రెడ్‌బుక్ నుంచి విజయసాయి తప్పించుకోలేరు

- చేసిన తప్పులకు శిక్షలు అనుభవించాల్సిందే
- టిడిపి నేతల ఘాటు వ్యాఖ్యలు

**విశాఖపట్నం, (నినాదం):**
రాజీనామా చేసినా, రెడ్‌బుక్ నుంచి తప్పించుకోలేరని మాజీ ఎంపీ విజయసారెడ్డికి టీడీపీ నేతలు స్ట్రాంగ్ వార్నింగ్ ఇస్తున్నారు. నారా లోకేష్ రెడ్‌బుక్‌లో వైసీపీ హయాంలో తప్పుచేసిన నేతలు, అధికారులను వదిలిపెట్టబోమని టీడీపీ నేతలు వార్నింగ్ ఇచ్చారు. తాజాగా విజయసారెడ్డిపై తెలుగుదేశం పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రెడ్ బుక్ ఇంకా ఓపెన్ చేయకుండానే విజయసారెడ్డి రాజీనామా చేశారని విమర్శించారు. రాజీనామా చేసినా విజయసాయిని వదిలిపెట్టబోమని.. రెడ్‌బుక్ పని ఆగదని పల్లా శ్రీనివాస్ హెచ్చరించారు.

వివరాలు 2లో..

## డిజిపి ఎంపికలో నిబంధనలు పాటించాలి

### హైకోర్టులో పిటిషన్ దాఖలు





**అమరావతి,**
ఆంధ్రప్రదేశ్ డీజీపీ ఎంపికను సవాల్ చేస్తూ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలైంది.. డీజీపీ ఎంపికలో సుప్రీంకోర్టు గైడ్ లైన్స్, యూపీఎస్సీ నిబంధనలు పాటించలేదని పిల్ వేశారు.. నిబంధనల ప్రకారం డీజీపీ పోస్ట్ కి అర్హత కలిగిన సీనియర్ ఐపీఎస్ అధికారుల

వివరాలు 2లో..

## రుణాల లక్ష్య సాదనకు బ్యాకర్లు కృషి చేయాలి

- పీఎం సూర్యఘర్ ద్వారా 1లక్ష 10 వేల మందికి రుణాలు
- రుణాల మంజూరులో వెండర్లు, బ్యాంకర్లకు మధ్య సమన్వయం అవసరం
- ఇంధన రంగంలో స్వయం సమృద్ధిలో బ్యాకర్ల భాగస్వామ్యం అవసరం
- సమష్టి భాగస్వామ్యంతో సౌరశక్తి వినియోగంలో అగ్రగామిగా నిలుపుదాం
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ,**
పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ ప్యానెల్ కనెక్షలను ఏర్పాటు చేసేందుకు 1 లక్ష 10 వేల మంది లబ్దిదారులకు రుణాలను మంజూరు చేయాలన్న లక్ష్యాలను పూర్తి చేసేందుకు బ్యాకర్లు కృషి చేయాలని, రుణాల మంజూరులో వెండర్స్ బ్యాంకర్స్ మధ్య సమన్వయం అవసరమని, సమిష్టి కృషితో లక్ష్యాలను సాధించి ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించడంలో బ్యాకర్ల భాగస్వామ్యులు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. సూర్యఘర్ పథకం కింద లబ్దిదారులకు రుణాలు మంజూరు పై సోమవారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మంది రంలో బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ



2

# జాతీయ ప్రధాన కార్యదర్శిగా తప్పుకుంటా

ఆలస్యమైనా నిజం గెలుస్తుంది. ఈరోజు కూడా మంత్రి హోదాలో నేను వచ్చినప్పుడు పార్టీ ఆఫీసులో బస్సులో పడుకొని సొంత భోజనం తిన్నాను. ప్రభుత్వం నుంచి ఒక్క వాటర్ బాటిల్ కూడా తీసుకోలేదు. వచ్చిన వాహనం కూడా నాదే. సొంత డబ్బుతో డీజిల్ కొట్టించుకున్నా. ఎక్కడా ప్రభుత్వంపై ఆధారపడకూడదని నా తల్లి భువనేశ్వరి చిన్నప్పటి నుంచి నేర్పించారు. సీఎం చంద్రబాబు నాకు ఏ బాధ్యత ఇచ్చినా అహర్నిశలు కష్టపడతా. నావల్ల పార్టీకి ఏనాడూ చెడ్డపేరు రాకుం డా చూసుకుంటా. 'యువగళం' పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునేందుకు చర్యలు తీసుకుంటాం. తల్లి, చెల్లినే నమ్మని జగన్.. ఎవరినీ నమ్మరు. డబ్బు కోసం ఆయన పార్టీనే అమ్మేసే రకం. ఇవన్నీ చూసే ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. మా పార్టీని, కార్యకర్తలను విజయసాయిరెడ్డి ఇబ్బంది పెట్టారు. అలాంటి వ్యక్తి తెదేపాలోకి వస్తానంటే ఎందుకు తీసుకుంటాం?విశాఖలో విజయసాయి చేసిన అక్రమాలపై విచారణ జరుగుతోంది. రెడ్‌బుక్ గురించి నేను చెప్పిన విషయం చాలా స్పష్టం. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు ఉంటాయి' అని లోకేశ్ అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ టీమ్ దావోస్ పర్యటనపై వైసీపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్న వేళ.. మంత్రి నారా లోకేష్ కీలక వ్యాఖ్యలు చేశారు.. ఏడు నెలలలో ఆరు లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు తీసుకొచ్చామని స్పష్టం చేశారు.. ఇక, 2019లో బ్లూ మీడియా నాపై అసత్య కథనం ప్రచురించింది. తప్పుడు కథనంపై సమాధానం చెప్పాలని అప్పుడే నేను లీగల్ నోటీసు జారీ చేశాను అన్నారు.. మరోవైపు.. తన పాదయాత్రకు రెండేళ్లు అయిన సందర్భంగా.. రాజకీయాలలో పాదయాత్ర ఎంబీఏ లాంటిది అని పేర్కొన్నారు.. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటు వస్తున్నాము. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు పై విచారణ జరుగుతుంది. విశాఖలో జరిగిన అక్రమాలపై కూడా విచారణ సాగుతోంది.. అన్ని వ్యవహారాలపై విచారణ ఒకేసారి జరిగితే ఉన్న పోలీసులు సరిపోరు. క్రమంగా అన్నింటిపై విచారణ జరుగుతుందన్నారు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1997 నుంచి దావోస్ కి వెళ్తున్నారని గుర్తుచేసిన ఆయన.. గత ప్రభుత్వంలో ఒప్పందాలు జరిగితే ఎందుకు పరిశ్రమలు స్థాపించలేకపోయారని నిలదీశారు.. మహారాష్ట్రకు ఎక్కువ పెట్టుబడుల రావడానికి కారణం ఒకే ప్రభుత్వం కొనసాగడంగా పేర్కొన్న ఆయన.. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పెట్టుబడులు పెట్టిన సంస్థల ప్రతినిధులను గతంలో జగన్మోహన్ రెడ్డి కలవలేదని దుయ్యబట్టారు.. గుజరాత్ లో 5వ సారి బీజేపీ ప్రభుత్వం రావడం వలన అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు..మన రాష్ట్రంలో 2014 నుంచి 2019 వరకు అభివృద్ధిని పరుగులు పెట్టించాం.. రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమి గెలవాల్సి ఉందన్నారు. చంద్రబాబు పై మాకు నమ్మకం ఉంది.. కానీ, రానున్న ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి గెలవలేరు అని హామీ ఇవ్వగలరా? అని దావోస్ ప్రతినిధులు అడుగుతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు.. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలి. పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి తీసుకురావడానికి చాలా కష్టపడుతున్నాం అన్నారు.. మరోవైపు.. రోజాపై సెటైర్లు వేసిన లోకేష్.. అసలు రోజా కు దావోస్ కు జ్యూరిచ్ కు తేడా తెలియదు అని ఎద్దేవా చేశారు.. రెడ్ బుక్ కోసం ఎందుకు వైసీపీ నాయకులు భయపడుతున్నారని ప్రశ్నించారు.. ఇక, విశాఖలో 90 రోజులలో టీసీఎస్ ను ఏర్పాటు చేస్తామని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు..

## రుణాల లక్ష్య సాదనకు బ్యాకర్లు కృషి చేయాలి

సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలో 2 లక్షల ఇళ్ళకు సోలార్ విద్యుత్ ప్యానెల్‌ను అమర్చి జిల్లాను అగ్ర గామిగా నిలపాలనే లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఇందులో 1లక్ష 10 వేల మంది లబ్దిదారులకు బ్యాంకుల నుండి రుణాలను మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్థారించామన్నారు. ఇప్పటివరకు 787 మంది లబ్దిదారులు రుణాల కొరకు ధరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. 651 మంది లబ్దిదారులు 10 శాతం బాగస్వామ్యాన్ని చెల్లించడం జరిగిందన్నారు. లబ్దిదారులు ఇంటి కప్పుపై ప్రభుత్వ రాయితీతో పాటు అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకొని ఉచితంగా విద్యుత్‌ను వినియోగించుకుని ప్రజలకు కరెంట్ బిల్లుల భారాన్ని తగ్గించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సూర్యఘర్ పథకం అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టిపెట్టాయన్నారు. లబ్దిదారులు రూ. 2 లక్షల విలువైన 3 కేడబ్ల్యూ సోలార్ ప్యానెల్‌ను రూ. 78 వేల ప్రభుత్వ రాయితీతో ఇంటి కప్పుపై ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసుకోవలసి ఉంటుందన్నారు. ప్రభుత్వ రాయితీ మినహా మిగిలిన సొమ్మును బ్యాంకర్లు రుణంగా మంజూరు చేయవలసి ఉంటుందన్నారు. కేటాయించిన లక్ష్యాల సాదనలో వెండర్లకు బ్యాంకర్లకు మధ్య సమన్వయం అవసరమన్నారు. బ్యాంకర్లు కాలయాపన చేయకుండా స్వీకరించిన ధరఖాస్తులను పరిశీలించి తక్షణమే రుణాలను మంజూరు చేయాలన్నారు. లబ్దిదారులకు రుణాలు మంజూరు చేసిన నివేధికల వివరాలను ప్రతి రోజు సమర్పించాలని ఆయన అన్నారు. పథకం ద్వారా జిల్లాలో రెండు లక్షల కనెక్షన్లను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని ఇప్పటివరకు దాదాపు 65 వేల మంది లబ్దిదారులు ప్యానెల్‌ను పొందేందుకు పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. స్వయం సహాయక సంఘ మహిళలు కూడా పెద్దఎత్తున రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారన్నారు. సౌర శక్తి ద్వారా కాలుష్యం లేని పర్యావరణ హిత ఇంధనాన్ని పొందొవచ్చునని, ధరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు అవసరమైన రుణాలను తక్షణమే మంజూరు చేసి పథకం అమల్లో జిల్లాను అగ్రగామిగా నిలపడంలో బ్యాంకర్లు భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో ఎల్‌డియం కె. ప్రియాంక, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, కెడిసిసి బ్యాంక్ ఎజియం వాసవి కుమారి, బ్యాంక్ ఆప్ బరోడ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, కెనర బ్యాంక్, ఇండియన్ ఒవర్ సీస్ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకుల అధికారులు, సెవెన్ రేస్ నెట్ మ్యాటరింగ్, విజేత సోలార్ మార్కెటింగ్ ఎజెన్సీ, సూర్య పవర్ ట్రీ, ఆల్ఫా సోలార్ ఇంజనీర్స్, ధక్షిణ్ సోలార్ పవర్, శ్రీ లక్ష్మీ మారుతి ఇంజనీరింగ్, తదితర సోలార్ ప్యానెల్ పంపిణీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గుల్లెయిన్ బారే సిండ్రోమ్‌తో తొలిమరణం

పుణేలోనే వంద మందికిపైగా రోగులున్నారు. మృతుడిని సోలాపూర్ నివాసిగా గుర్తించారు. సదరు వ్యక్తి కొద్దిరోజుల కిందట పుణేకు వచ్చాడని.. ఆ సమయంలోనే సిండ్రోమ్ సోకినట్లుగా భావిస్తున్నారు. ఇమ్యునోలాజికల్ నరాల వ్యాధి గుల్లెయిన్ బారే సిండ్రోమ్ వ్యాప్తి పుణేలో ఎక్కువగా కనిపిస్తున్నది. ఆదివారం నాటికి సంఖ్య వందకుపైగా దాటింది. పుణేలో జీబీఎస్ సోకిన వారి సంఖ్య 101కి పెరిగింది. ఇందులో 68 మంది పురుషులు, మరో 33 మంది మహిళలు ఉన్నారు. ఇందులో 16 మంది రోగుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వారికి వెంటిలేటర్ సహాయంతో చికిత్స అందిస్తున్నారు. పుణే మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన రాపిడ్ రెస్పాన్స్ టీం, ఆరోగ్యశాఖ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. ముఖ్యంగా పూణేలోని సింఘాడ్ రోడ్డులో గరిష్ఠ సంఖ్యలో రోగులను గుర్తించారు. ప్రస్తుతం ప్రత్యేకంగా నిఘా వేశారు. ఇప్పటివరకు, రాష్ట్రంలో 25,578 ఇళ్లను సర్వే చేశారు. ఇందులో 15,761 ఇండ్లు పుణే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. మరో 3,719 నివాసాలు చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. 6,098 ఇండ్లు రూరల్ ప్రాంతానికి వస్తాయి. గుల్లెయిన్ బారే సిండ్రోమ్.. జీబీఎస్ అనేది రోగనిరోధక నాడీ వ్యాధి. వ్యాధి సోకితే చేతులు, కాళ్లు అకస్మాత్తుగా తిమ్మిరి వస్తాయి. కండరాలు బలహీనంగా మారుతాయి. వ్యాధి లక్షణాల్లో బలహీనత.. విరేచనాలు ఉంటాయి. సాధారణంగా జీబీఎస్ సమస్య బాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్ రోగనిరోధక శక్తిని కూడా బలహీనంగా మారుస్తుంది. పిల్లలు, యువత ఎక్కువగా ఈ వ్యాధి బానిపడుతున్నారు. వ్యాధి బారినపడ్డ వారంతా కోలుకుంటుండడం విశేషం. తాగునీటిని శుభ్రంగా ఉంచుకోవాలని, మరిగించి చల్లార్చిన నీటినే తాగాలని ప్రభుత్వం ప్రజలకు సూచించింది. ఆహారం సైతం శుభ్రంగా ఉంచుకోవాలని.. కూరగాయాలను శుభ్రంగా కడుక్కోవాలని.. బాగా ఉడికించి తినాలని వైద్యశాఖ అధికారులు సూచించారు.

## సంపద సృష్టించాలి

పోయింది. అందుకే రాష్ట్రానికి వృద్ధి రేటు అనేది చాలా ముఖ్యమని మా ప్రభుత్వం పదే పదే ప్రస్తావిస్తోంది. తలసరి ఆదాయంలో కూడా పొరుగు రాష్ట్రాలతో పోల్చుకోలేని పరిస్థితి ఏర్పడిరది. ప్రజల కొనుగోలు స్థితి కూడా తగ్గిందని అన్నారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక సామాజిక విధ్వంసంపై 7 శ్వేతపత్రాలు కూడా విడుదల చేశాం. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల్లో భాగంగా 15శాతం వృద్ధి రేటు కోసం ప్రణాళికలు వేస్తున్నాం. తద్వారా 2047 నాటికి తలసరి ఆదాయం రూ.58,14,916 కు చేరుతుంది. సూపర్ సిక్స్‌లో ఎన్టీఆర్ భరోసాలో భాగంగా 64 లక్షల మందికి పెన్షన్ ఇస్తున్నాం. దీపం 2.0 పథకంలో ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్నా క్యాంటీన్లు, మెగా డీఎస్సీ, ఇసుక, మద్యం, క్లీన్ ఎనర్జీ, ఎమ్ఎస్ఎమ్ఈ లాంటి కొత్త విధానాలు తీసుకువచ్చాం. రూ.8,258 కోట్ల మేర బిల్లులు క్లియర్ చేశాం. రూ.9015 కోట్ల మేర కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంట్ కూడా ఇచ్చి 76 పథకాలు రివైవ్ చేశాం అని అన్నారు. ఇప్పటి వరకు రూ.6,33,568 కోట్ల మేర పెట్టుబడులు వస్తున్నాయి. తద్వారా 4.10 లక్షల ఉద్యోగాలు వస్తాయి. మేం ఊహించిన దానికంటే ఎక్కువ విధ్వంసం జరిగింది. రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగింది. మేము చెప్పిందే ఇప్పుడు నీతి ఆయోగ్ ధృవీకరించింది. వృద్ధి రేటు సాధిస్తే ఆదాయం పెరిగి, అప్పులు తగ్గించుకునే పరిస్థితి వస్తుంది. ఎక్కువ వడ్డీకి అప్పులు తీసుకొచ్చారు. అందుకే డెబ్ట్ రీ షెడ్యూల్‌కి వెళ్తున్నాం. ఆర్థిక రంగంలో సుస్థిరత వస్తేనే రాష్ట్రం గాడిన పడుతుంది. వైకాపా హయాంలో తలసరి ఆదాయం పెరగలేదు. కానీ, తలసరి అప్పు పెరిగింది. గాడిన పెట్టడానికి కొంచెం ఆలస్యం అవుతోంది. ప్రజలు అర్థం చేసుకోవాలి. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడంతోపాటు మెరుగైన పాలన అందిస్తాం' అని చంద్రబాబు అన్నారు.

## రెడ్‌బుక్ నుంచి విజయసాయి తప్పించుకోలేరు

వైసీపీ హయాంలో అందరిని ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. పారిశ్రామికవేత్తలు ఇతర రాష్ట్రాలకు పారిపోయేలా చేశారని ఆరోపించారు. కమిషన్ల కోసం కక్కుర్తి పడి ఏపీకి అన్యాయం చేశారని విమర్శలు చేశారు. పబ్లిక్ సెక్టార్‌లను ముంచేయాలని జగన్ చూశారని పల్లా శ్రీనివాస్‌రావు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా చంద్రబాబు కృషి చేస్తున్నారని పల్లా శ్రీనివాస్‌రావు అన్నారు. చంద్రబాబు అంటే ఓ బ్రాండ్ అని ఉద్ఘాటించారు. దావోస్‌లో అగ్రిమెంట్లు అవ్వవు, అది చర్చా వేదిక అని చెప్పారు. రాష్ట్రాన్ని ప్రమోట్ చేయడానికి దావోస్ చాలా ఉపయోగపడుతుందని వివరించారు. పారిశ్రామికవేత్తలు పెట్టుబడి పెట్టేలా చంద్రబాబు కృషి చేశారని పల్లా శ్రీనివాస్‌రావు అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సీఎం ఎవ్వరికీ అందుబాటులో ఉండేవారు కాదని.. ఇప్పుడు సీఎం చంద్రబాబు పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉన్నారని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. దావోస్‌లో చంద్రబాబు పెద్దన్న పాత్ర పోషించారని ఉద్ఘాటించారు. సీఎం చంద్రబాబు రాష్ట్రానికే కాకుండా దేశం గురుంచి మాట్లాడటం సంతోషించదగ్గ విషయమని చెప్పారు. దావోస్ ఫలాలు తప్పనిసరిగా ఏపీకి అందుతాయని తెలిపారు. యువగళం ద్వారా మంత్రి నారా లోకేష్ ప్రజల్లోకి వెళ్లారని చెప్పారు. ప్రజా సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన తెచ్చుకున్నారని అన్నారు. మంగళగిరిలో ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు లోకేష్ మరింత చేరువయ్యారని చెప్పుకొచ్చారు. తాము కూడా లోకేష్‌ను స్పూర్తిగా తీసుకుని ప్రజా దర్బార్ నిర్వహిస్తామని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. నాటి యువ గళం అడుగులే, నేడు ప్రజాగళంగా మారి ప్రత్యర్థుల గుండెల్లో పిడుగులై పడ్డాయని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ తెలిపారు. యువ నేత నారా లోకేష్ పాదయాత్ర వైసీపీ పాలిట దండయాత్రగా మారి 11 సీట్లకు పరిమితం చేశాయని విమర్శించారు. యువగళం

## సుప్రీంకోర్టులో జగన్‌కు ఊరట

రఘురామ కృష్ణం రాజు గతంలో వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది.. రఘురామ కృష్ణంరాజు పిటిషన్ పై జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మల ధర్మాసనం విచారణ జరిపింది.. చివరకు ఆ పిటిషన్‌ను డిస్మస్ చేస్తున్నట్టు వెల్లడిరచింది.. ఇక, జగన్ బెయిల్‌ను రద్దు చేయాలంటూ వేసిన పిటిషన్ ను ఉపసనీహరించుకున్నారు పిటిషనర్.. ఈ పరిణామాలతో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించినట్టు అయ్యింది..అయితే కేసులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. జగన్‌ను కేసులను రోజు వారీ విచారణ చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించింది. జగన్ కేసుల బదిలీకి నిరాకరించిన సుప్రీంకోర్టు, తెలంగాణ హైకోర్టులో జగన్ అక్రమాస్తుల కేసు పర్యవేక్షణ నేపథ్యంలో వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. అలాగే జగన్ బెయిల్‌ను రద్దు చేయాలన్న పిటిషన్‌పై కూడా ప్రత్యేకంగా విచారణ అవసరం లేదని చెప్పింది. గతంలో సుప్రీంకోర్టు ఎమ్మెల్యే, ఎంపీల కేసుల విషయంలో ఇచ్చిన తీర్పు ఈ కేసుకు కూడా వర్తిస్తుందని సుప్రీం ధర్మాసనం తేల్చిచెప్పింది. ట్రయల్ కోర్టు... రోజు వారీ విచారణకు తీసుకోవాలని, హైకోర్టు కూడా పర్యవేక్షణ చేయాలని అందువల్ల మరో రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర మిశ్రా ధర్మాసనం తేల్చిచెప్పింది. దీంతో పిటిషన్‌ను వెనక్కి తీసుకుంటామని రఘురామ తరఫు న్యాయవాది బాలాజీ సుబ్రహ్మణ్యం కోర్టుకు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్ బెయిల్ రద్దు, కేసుల ట్రయల్ విచారణ ధర్మాసనం మార్పు చేయాలని రఘురామ కృష్ణరాజు సుప్రీం కోర్టులో ఓ పిటిషన్ వేశారు. గతంలో ఈ పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం విచారించగా..

ఆ తర్వాత జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మ ధర్మాసనం ముందుకు వెళ్లింది. గత 12 ఏళ్లుగా ట్రయల్ ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదని.. ఒక్క డిశ్చార్జ్ అప్లికేషన్ కూడా డిస్పోజ్ చేయలేదని రఘురామ తరఫు న్యాయవాది బాలాజీ సుబ్రహ్మణ్యం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. బదిలీ సాధ్యం కాదని సుప్రీంకోర్టు గత విచారణలోనే చెప్పిందని.. తాము ఇప్పుడు కేసు మానిటరింగ్ పూర్తి స్థాయిలో జరగాలని కోరుతున్నామని తెలిపారు. అయితే.. సీబీఐ కేసుల వివరాలు, ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ సీబీఐ అఫిడవిట్ దాఖలు చేసిందని దర్యాప్తు సంస్థ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. మరోవైపు.. ఈ కేసును హైకోర్టు మానిటర్ చేస్తోందని.. ఇంకా కేసు అక్కడ పెండిరగ్‌లో ఉందని జగన్ తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గీ తెలిపారు. అన్నివైపులా వాదనలు విన్న ద్విసభ్య ధర్మాసనం.. చివరకు రఘురామ పిటిషన్‌ను డిస్మస్ చేస్తూ ద్విసభ్య ధర్మాసనం ఇవాళ తీర్పు ఇచ్చింది.

## వైసీపీ నుంచి జనసేనలోకి వలసల జోరు

38 మంది వైసీపీ నాయకులు, వారి ప్రధాన అనుచరులు జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు సమక్షంలో వారంతా కుండువాలు కప్పుకున్నారు. వీరంతా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, చంద్రగిరి, పీలేరుతోపాటు ఉమ్మడి కృష్ణాజిల్లాలోని నందిగామ నియోజక వర్గాలకు చెందిన వారు. గతంలో వైసీపీలో వీరు కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. పుంగనూరు అంటేనే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చంద్రగిరి అంటేనే చెవిరెడ్డి భాస్కరరెడ్డి. వీరిద్దరు గత వైసీపీ ప్రభుత్వంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన సంగతి అందరికి తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం కొలువు తీరి ఏడాది కూడా పూర్తి చేసుకోలేదు. అంతలోనే వైసీపీలోని పలువురు అగ్రనేతలు ఆ పార్టీకి వరుసగా గుడ్ బై చెప్పేస్తున్నారు. తాజాగా వైసీపీలో రెండో స్థానంలో అంటే.. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ తర్వాత స్థానంలో ఉన్న విజయసాయిరెడ్డి సైతం ఆ పార్టీకే కాదు.. తన రాజకీయ జీవితానికి సైతం గుడ్ బై చెప్పేశారు. ఇక 2024, సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికలకు ముందు పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు వైసీపీని వీడారు. అలాగే ఎన్నికల్లో కూటమిలోని పార్టీలకు ఓటరు పట్టం కట్టాడు. దీంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. దాంతో వైసీపీ నుంచి ఆ పార్టీ నేతలు వరుసగా రాజీనామాలు చేసి బయటకు వస్తున్నారు. మోపిదేవి వెంకటరమణ, బీదా మస్తాన్ రావు, ఆర్ కృష్ణయ్యలు సైతం తన రాజ్య సభ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. అనంతరం మోపిదేవి, బీదా మస్తాన్ రావులు టీడీపీలో చేరగా.. ఆర్ కృష్ణయ్య బీజేపీలో చేరారు. ఆ క్రమంలో టీడీపీ నుంచి బీదా, బీజేపీ నుంచి ఆర్ కృష్ణయ్యలు పెద్దల సభలో మళ్లీ అడుగు పెట్టారు. ఇక విజయసాయిరెడ్డి రాజీనామాతో.. వైసీపీ భవిష్యత్తు ఏమిటనే ఓ చర్చ అయితే ఆ పార్టీ కేడర్‌లో నడుస్తోంది. ఎందుకంటే ప్రతిపక్షానికి పరిమితమైన పార్టీని అధికారంలోకి తీసుకు రావడంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ పాదయాత్ర ద్వారా ఎంతో కష్ట పడ్డారు. అలాగే విజయసాయిరెడ్డి సైతం తెర వెనుక అంతే కష్టపడ్డారనే ఓ చర్చ అయితే పార్టీ కేడర్‌లో నేటికి బలంగా ఉంది. అలాంటి విజయసాయిరెడ్డి లేని పార్టీని ఊహించలేని పరిస్థితి నెలకొందని చర్చ నడుస్తోంది. క పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి కానీ, చెవిరెడ్డి భాస్కరరెడ్డి కానీ.. జిల్లాలకే పరిమితమని మహా అయితే రాష్ట్రానికి మాత్రమే పరిమితమని అంటున్నారు. కానీ విజయసాయి రెడ్డి మాత్రం ఢల్లీలో వైసీపీ తరఫున చక్రం తిప్పారని.. అందుకు గతంలో చోటు చేసుకొన్న ఘటనలను సైతం ఈ సందర్భంగా సోదాహరణగా వివరిస్తున్నారు. అలాంటి విజయసాయిరెడ్డి రాజకీయాల నుంచి తప్పుకొంటే.. ఇక పెద్దిరెడ్డి, చెవిరెడ్డిల సంగతి ఏమో కానీ.. పార్టీ అధినేత వైఎస్ జగన్ పరిస్థితి ఏమిటనే ఓ చర్చ సైతం ఆ పార్టీ శ్రేణుల్లో చాలా బలంగా నడుస్తోంది. ఏదీ ఏమైనా.. వైసీపీ నుంచి మరిన్ని వలసలు భవిష్యత్తులో పెరిగే అవకాశముందని వాదన ఆ పార్టీలోనే వినిపిస్తోంది.

### ప్రపంచాభివృద్ధిలో భారతదేశ
## యువత కీలక భూమిక

ఢిల్లీ లోని కరియప్ప గ్రౌండ్స్‌లో సోమవారంనాడు జరిగిన నేషనల్ క్యాడెట్ కార్ప్స్ ర్యాలీలో ప్రధాని పాల్గొన్నారు. ఎన్‌సీసీ డవలప్‌మెంట్‌కు గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పనితీరు తనకు చాలా సంతృప్తిని ఇచ్చిందని మోదీ అన్నారు. 170 సరిహద్దు ప్రాంతాలు, సుమారు 100 తీరప్రాంత సరిహద్దులకు ఎన్‌సీసీ క్యాడెట్లు విస్తరించారని, తద్వారా ఆయా ప్రాంతాల్లో నివసించే వారికి ఎంతో ప్రయోజనం చేకూరిందని చెప్పారు. 'ఒకే దేశం ఒకే ఎన్నికలు'పై డిబేట్‌ను ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు కొనసాగిం చాలని, దేశ యువత భవిష్యత్తుకు ఏకకాలంలో ఎన్నికలు కీలకమని అన్నారు. ప్రతి నెలలోనూ ఎన్నికలు జరుగుతూ పోతుంటే కాలేజీలు, విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు సమయం ఎక్కడ దొరుకుతుందని ప్రశ్నించారు. వికసిత్ భారత్' ఉద్దేశాలపై ఎన్‌సీసీ క్యాడెట్లతో సహా దేశ యవత దృష్టిసారించాలని మోదీ కోరారు. దేశ వికాశంతోనే భారత్ అంతర్జాతీయంగా ఉన్నత స్థాయికి చేరుకుంటుందన్నారు. 2014లో 14 లక్షల మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 20 లక్షలకు చేరుకుందని, వీరిలో 8 లక్షల మందికి పైగా మహిళలే ఉండటం గర్వకారణమని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద యూనిఫార్మ్‌డ్ యూత్ ఆర్గనైజేషన్‌గా ఎన్‌సీసీ నిలవడం, డిజాస్టర్ మేనేజిమెంట్‌తో సహా అన్ని రంగాలకు ఎన్‌సీసీ సేవలు విస్తరిస్తుండటం ముదావహమని చెప్పారు.

## డిజిపి ఎంపికలో నిబంధనలు పాటించాలి

జాబితాను ప్రభుత్వం యూపీఎస్సీ కి పంపాలని పిల్ లో పేర్కొన్నారు పిటిషనర్.. ఈ జాబితాలో ముగ్గురు అధికారుల లిస్ట్ ను యూపీఎస్సీ.. ప్రభుత్వానికి పంపగా ఒకరిని డీజీపీగా నిర్ణయించటం అనే రూల్స్ ని ప్రభుత్వం పక్కన పెడుతోందని పిల్‌లో పేర్కొన్నారు.. 3 నెలల ముందు పంపాల్సిన సీనియర్ ఐపీఎస్ జాబితాను ఇంకా పంపలేదని కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు పిటిషనర్.. ఇక, ఈ నెల 31వ తేదీన ప్రస్తుత డీజీపీ పదవీ విరమణ చేస్తున్నారని.. ఈ నేపథ్యంలో పిల్‌పై వెంటనే విచారణ జరపాలని హైకోర్టును కోరారు పిటిషనర్..కాగా, ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త పోలీస్ బాస్‌ను నియమించారు.. ఆయనే డీజీపీ ద్వారకా తిరుమల రావు.. అయితే, ఆయన పదవీ విరమణ చేయనుండటంతో, ఈ పదవికి ఎవరు వస్తారన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతోన్న సమయంలో.. రాష్ట్ర కొత్త డీజీపీగా హరీష్ కుమార్ గుప్తాను నియమించనున్నట్లు తెలుస్తోంది. 1992 బ్యాచ్‌కు చెందిన హరీష్ కుమార్ గుప్తా ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్నారు. ఏపీ డీజీపీగా పని చేసిన అనుభవం కూడా ఆయనకు ఉంది.. సార్వత్రిక ఎన్నికల సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం హరీష్‌ను డీజీపీగా నియ

### త్రివేణి సంగమంలో స్నానం చేసిన
## కేంద్ర మంత్రి అమిత్‌షా

ప్రయాగ్‌రాజ్ : ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక మేళాగా ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న 'మహాకుంభ్'లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సోమవారం పాల్గొన్నారు. గంగా, యుమునా, సరస్వతీ నదులు సంగమించే త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం ఆచరించారు. దీనికి ముందు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్న అమిత్‌షాకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, రాష్ట్ర మంత్రులు సాదర స్వాగతం పలికారు.అమిత్‌షా షెడ్యూల్ ప్రకారం, బడే హనుమాన్ జీ ఆలయాన్ని సందర్శిస్తారు. జునా అఖారాను సందర్శించి అఖారా మహరాజ్, ఇతర అఖారా సాధువులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తారు. గురు శరణానంద్ జీ ఆశ్రమాన్ని సందర్శించి గురు శరణానంద్, గోవింద్ గిరి జీ మహరాజ్‌ను కలుసుకుంటారు. అనంతరం శృంగేరి, పూరి, ద్వాకరా శంకరాచార్యులను కలుసుకోవడంతో ఆయన పర్యటన ముగుస్తుంది. సాయంత్రం ప్రయాగ్‌రాజ్ నుంచి బయలుదేరి తిరిగి ఢల్లీకి చేరుకుంటారు. మహాకుంభ కీలక రోజులు కావడంతో మహాకుంభ్ ఏరియాలో 'నో వెహికల్ జోన్' ప్రకటించారు. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకూ వెహికల్ పాస్‌లు చెల్లవని మహాకుంభ్ మీడియా సెంటర్ ప్రకటించింది. సమీపంలోని పార్కింగ్ ప్రాంతాల్లో మాత్రమే వాహన యజమానులు పార్కింగ్ చేసుకోవాలని సూచించింది. మహాకుంభ్ భద్రతా ఏర్పాట్ల కోసం 10,000కు పైగా స్థానిక పోలీసులు, పారామిలటరీ బలగాలను మోహరించారు. జనవరి 29న మౌని అమావాస్య (రెండవ సాహి స్నాన్), ఫిబ్రవరి 3 వసంత పంచమి (మూడవ సాహి స్నాన్), ఫిబ్రవరి 12న మాఘ పౌర్ణమి, ఫిబ్రవరి 26న మహాశివరాత్రి భక్తులు విశేషంగా హాజరుకానున్నారు. 45 రోజుల పాటు జరిగే మహాకుంభ్ మేళాకు 45 కోట్ల మంది భక్తులు హాజరవుతారని యూపీ ప్రభుత్వం అంచనా వేసింది.

## టూరిజంపై నిర్లక్ష్యం చేశారు

**విశాఖపట్నం, (నినాదం):**
ఎపిలో టూరిజానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని.. కానీ ఎందుకో ఎక్కువ అభివృద్ధి జరగలేదని ఎక్కడో లోపం ఉందని ఏపీ స్పీకర్ అయ్యన్న పాత్రుడుఅన్నారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు అభివృద్ధికి అవకాశం ఉందన్నారు. సోమవారం నాడు వైజాగ్ రీజినల్ ఇన్వెస్టర్స్ మీట్‌లో ఏపీ స్పీకర్ మాట్లాడుతూ.. విశాఖ బెస్ట్ సిటి అని అయినా ఎందుకో అనుకున్నంత అభివృద్ధి జరగలేదన్నారు. నర్సీపట్నం 14 కిలోమీటర్ల దూరంలో లంబసింగి ఉందని.. అక్కడ సరైన వసతి లేదన్నారు. బాత్రూంలు లేవని. టూరిస్టులు ఎలా వస్తారని ప్రశ్నించారు. రాత్రికి నర్సీపట్నంలో ఉండి.. ఉదయం లంబసింగి కి వెళ్ళవల్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని టూరిజం మంత్రిని కోరుతున్నామన్నారు. లంబసింగికి వచ్చిన వారు అల్లూరి స్మారక చిహ్నం దగ్గరకు వెళ్తారని తెలిపారు. లంబసింగి, అల్లూరి పార్క్ , బొజ్జన కొండని పర్యాక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. లంబసింగి నుంచి భద్రాచలం శ్రీరాముడు దేవాలయానికి వెళ్లే ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. అరకు కాఫీ ఎంతో రుచిగా ఉంటుందని తెలిపారు. రాజమండ్రి ఎయిర్ పోర్ట్ నుంచి విజయనగరం కలెక్టర్ ఆఫీస్ వరకు నాలుగు లైన్లు రోడ్డు మంజూరు అయిందని.. ఈ మార్గమధ్యలో పర్యాటక అభివృద్ధి చేయాలని తెలిపారు. గాజువాకలో యారాడ బీచ్ చాలా అందమైన బీచ్ ఉందన్నారు. ఇన్వెస్ట్‌మెంట్స్ పెట్టడానికి వచ్చిన వారికి పర్మిషన్లు ఇవ్వడానికి ఎందుకు ఎక్కువ సమయం పడుతుందని ప్రశ్నించారు. అనుమతులు ఇవ్వడానికి వన్ ఇయర్ కావాలా అని స్పీకర్ అడిగారు. వన్ వీక్‌లో ఎస్ ఆర్ నో చెప్పాలని అప్పుడే టూరిజం అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. టెంపుల్ టూరిజం డెవలప్ మెంట్ చేయాలన్నారు. నెగిటివ్ మైండ్ వదని పాజిటివ్ మైండ్‌తో విశాఖను అభివృద్ధి చేయాలని ఆయన అన్నారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు అందమైన బీచ్ ఉందని.. మధ్య మధ్యలో హాట్స్ వేసి పర్యాటకులను ఆకర్షించాలన్నారు. విశాఖ బీచ్‌కు ఎవరైనా టీ తాగడానికి వస్తారా అని ప్రశ్నించారు. గోవాకు ఎందుకు వెళ్తున్నారో అందరికీ తెలుసన్నారు. 'మనకు కొన్ని రూల్స్ ఉన్నాయి.. బీచ్‌లకు వైన్ తాగడానికి కాకుండా.. టీ తాగడానికి పర్యాటకులు వస్తారా ? బీచ్ వాలీ బాల్, బీచ్ కబడ్డీ పెట్టండి.. స్పోర్ట్స్ లవర్స్ ఆస్వాదిస్తారు. ట్రైబల్ ఏరియాలో కొన్ని నిబంధనలు సవరిస్తే బాగుంటుందనుకుంటున్నాను. ట్రైబల్స్ ఏరియాలో ట్రైబల్స్ ఎక్కువగా పెట్టుబడులు పెట్టగలరా? నాన్ ట్రైబల్స్ పెట్టుబడులు పెడితే తమ పెట్టుబడికి భద్రత ఉండదు ఏమో భయపడుతున్నారు. దీనికి ఏమైనా రెమిడి ఉందా? అధికారులు స్టడి చేయలి. నేను స్పీకర్ గా మాట్లాడడం లేదు...ఒక పౌరుడిగా మాట్లాడుతున్నాను' అని ఏపీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు.

### వైసిపి హయాంలో
## మంత్రులంతా డమ్మీ

**గుంటూరు, (నినాదం):**
వైసీపీ హయాంలో మంత్రులకు ఎలాంటి అధికారం లేదని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు విమర్శించారు. బీసీల ధైర్యాన్ని చూపించి పార్లమెంటులో తాను గట్టిగా నిలబడ్డానని తెలిపారు. తనను గతంలో పార్లమెంటులో అవమానించేలా వైసీపీ సభ్యులు మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రన్నాయుడు వారసుడిగా వచ్చిన తనను 3సార్లు ఎంపీగా గెలిపించారని గుర్తుచేశారు. వయసులో చిన్నవాడినైనా తనకు కేంద్రమంత్రిగా చంద్రబాబు అవకాశం కల్పించారని చెప్పారు. బీసీలంటే చంద్రబాబుకు ఎంత ప్రేమో చెప్పేందుకు తానే నిదర్శనమన్నారు. బీసీలంతా ఐకమత్యంతో పనిచేసి సమస్యల పరిష్కారం కోసం పని చేద్దామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఇవాళ(సోమవారం) గుంటూరు జిల్లాలో రామ్మోహన్ నాయుడు పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో రామ్మోహన్ నాయుడు పాల్గొని మీడియాతో మాట్లాడారు. ఏపీలో బీసీల నాయకత్వానికి స్వర్గీయ ఎన్టీఆర్ పునాదులు వేశారని తెలిపారు. నేటి తరానికి ఈ విషయాలన్నీ తెలియజెప్పాల్సిన అవసరముందని అన్నారు. పంచాయతీ మెట్లు ఎక్కలేని బీసీలను పార్లమెంటు మెట్లు ఎక్కేలా తెలుగుదేశం పార్టీ అవకాశం ఇచ్చిందని అన్నారు. ఎన్టీఆర్ వేసిన పునాదులను పటిష్టం చేసేలా చంద్రబాబు పని చేస్తున్నారని అన్నారు. బీసీలకు ఏదైనా కొత్త పథకం ప్రారంభమైందంటే అది కేవలం టీడీపీ హయాంలోనే అని తెలిపారు. చంద్రబాబు ఏర్పాటు చేసిన ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలతో బీసీలు బాగా చదువుకునే అవకాశం వచ్చిందని అన్నారు. బీసీ బిడ్డలు నేడు వైద్యులుగా, ఇంజనీర్లుగా దేశవిదేశాల్లో స్థిరపడేందుకు చంద్రబాబు కృషి చేశారని అన్నారు. సమాజంలో మార్పు రావాలంటే ఒక్కరితో సాధ్యం కాదు... అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ప్రపంచాన్ని ఏలే తరంలో మన బీసీలు కూడా ఉండాలని అన్నారు. రాష్ట్రంలోని బీసీలంతా అండగా నిలిచారు కాబట్టే టీడీపీ అభ్యర్థులకు రికార్డు మెజార్టీలు దక్కాయని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.



## పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా

# స్థాయితో పాటు మరింత బాధ్యత

### - రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితోపాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 10 మంది హెడ్ కానిస్టేబుల్స్‌కు ఎఎస్ఐలుగా, ఇద్దరు ఎఆర్ హెడ్ కానిస్టేబుల్స్‌కు ఎఆర్ఎస్ఐలుగా పదోన్నతి పొందిన అధికారులకు రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ వారి కార్యాలయంలో సోమవారం అభినందించి వారి ర్యాంక్ పదోన్నతి చిహ్నంను అలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ పదోన్నతులతోనే పోలీసులకు గుర్తింపు, ఉత్సాహం వస్తుందని, ఎలాంటి రిమార్క్ లేకుండా మిగిలిన సర్వీసును పూర్తి చేసి విధుల్లో మంచి పనితీరు కనబరిచి మరిన్ని పదోన్నతులు పొందాలని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, కష్టపడి పని చేస్తే ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని, ఇప్పటివరకు ఎలాంటి క్రమశిక్షణతో విధులు నిర్వహించారో... అదేవిధంగా మిగతా సర్వీస్ పూర్తి చేసి మరిన్ని పదోన్నతులు పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటామని, మానసికంగా శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని, మనం ఆరోగ్యంగా



ఉంటే ఏద్కైనా సాధించవచ్చని ఈ సందర్భంగా సిపి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్ర రావు, గోదావరిఖని ఎసిపి ఎం.రమేష్ , ఎఆర్ ఎసిపి ప్రతాప్, ఆర్ఐ మల్లేశం, రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచలింగం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### - సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

### - జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మధ్యాహ్న భోజన కార్మికుల అపరిస్కృత సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం,మధ్యాహ్న భోజన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసల రమేష్ లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గత పది సంవత్సరాలుగా మార్కెట్లో కోడిగుడ్ల రేటు సీజన్ బుల్ గా 6 నుండి 7 రూపాయలుగా ఉంటుంది కానీ ప్రభుత్వం 5మాత్రమే చెల్లిస్తుందని, అనేకసార్లు అధికారులకు ప్రభుత్వానికి పాఠశాలలకు సరఫరా చేయాలని విన్నవించు కున్నప్పటికీ పట్టించుకున్న దాఖలు లేవని, సత్యసాయి ట్రస్ట్ రాగి జావా పౌడర్ని పాఠశాలలకు అందిస్తున్న వారికి రవాణా చార్జి కింద దాదాపుగా ఒక రూపాయి 50 పైసలు ప్రభుత్వం చెల్లిస్తుంది కానీ ఈ జావా చేయుటకు మధ్యాహ్న భోజన కార్మికులకు ఎలాంటి పారితోషికం కానీ వంట పాత్ర గాని గ్యాస్ కానీ ఇవ్వకుండా ఉచితంగా చేయమని వేధింపులు చేస్తున్నారని, 3000 గౌరవ వేతనం కార్మికులపై ముప్పెట దాడి ధనిక రాష్ట్రంలో బంగారు తెలంగాణలో అగ్రగామి దేశంలో 3000 రూపాయల గౌరవ వేతనం



చెప్పుకోవడానికి ఇబ్బందిగా ఉందని, కోడి గుడ్లను ప్రభుత్వం సరఫరా చేసే వరకు ఈరోజు నుండి కోడిగుడ్లను నిలిపివేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ గారికి జిల్లా విద్యాశాఖ అధికారికి సోమవారం వినతి పత్రాలు అందజేశామని, ఇది గమనించి ప్రభుత్వం నిత్యవసర సరుకులు మొత్తం అంగన్వాడికి లాగా సరఫరా చేసి కనీసం 10,000 రూపాయల గౌరవ వేతనం చెల్లించాలని లేని పక్షంలో సమరశీల పోరాటాలకు సైతం మధ్యాహ్న భోజన కార్మికుల సిద్ధంగా ఉన్నారని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన



కార్మికులు గొల్లపల్లి రజిత,పాటుకుల కళావతి, నూనేటి రాధమ్మ, సుల్తాన్పూర్ రేణుక, రాజ్ కుమార్, గుమ్మడి వరలక్ష్మి, జంగం లక్ష్మి, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

**ధర్మపురి, జనవరి 27, (ది క్రైమ్ న్యూస్):** క్రికెట్ విజేతలకు నగదుతో పాటు బహుమతులను ప్రదానం చేసినట్లుస్నేహమిత్ర యూత్ వ్యవస్థాపకులు న్యాయవాది జాజాల రమేష్ తెలిపారు. సోమవారం నెరేళ్ల గ్రామంలో నిర్వహించిన ఈ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ధర్మపురి ఏ ఎస్ ఐ సూర్యనారాయణ రాజు చేతుల మీదగా క్రీడలో గెలిచిన విన్నర్స్ టిం మడ్డి రంజిత్ టిమ్ కు 5000 రూపాయల నగదు, రన్నర్స్ జుంజురు నవీన్ టిమ్ 2500 రూపాయల నగదు తో పాటు బహుమతులు అందజేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల పట్ల యువకులు ఆసక్తి పెంచుకోవాలని పట్టుదల ఉంటే యువత ఏదైనా సాధించవచ్చని, కొంత



మంది యువత గంజాయి డ్రగ్స్ ఇతర చెడు అలవాట్లకు వ్యసనాలకు బానసలై వారి శారీరక దృఢత్వాన్ని మానసిక ఉల్లాసానికి ఇబ్బందులకు గురవుతున్నారాని, క్రిమినల్ కేసుల పాలై యువకులు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. క్రికెట్ టోర్నమెంట్ కోసం, బైరి గణేష్ 5000 రూపాయలు ,కాశెట్టి మల్లేశం 2500 రూపాయలు ఆర్థిక సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇంద్రాల మల్లేశం, తాజా మాజీ ఉపసర్పంచ్ జాజాల శేంకర్ ,గోవిందుపల్లె కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురంశేట్టి మల్లేశం, శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ జంగిలి తిరుపతి, గోవిందుపల్లె మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు పురంశెట్టి సుధాకర్, తెరాస సీనియర్ నాయకులు పలిగిరి లచ్చన్న బీజేపీ సీనియర్ నాయకులు కోల రామన్న శ్యామల మధుకర్ నాయకులు పాల సురేష్, రాజరపు నాగేందర్, కోల రాయమల్లు, మడిశెట్టి లక్ష్మణ్, పాల సత్యం, కొదురుపాక మల్లేశం, మంద బాబు క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్స్ సామల ప్రశాంత్, జంజూరు నవీన్, దాస గణేష్, తీగల నవీన్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


## రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రామగుండం నగర కార్పొరేషన్ పాలకవర్గం కాలపరిమితి జనవరి 26, 2025న ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ పెద్దపల్లి ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్లో రామగుండం నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా రామగుండం ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ, రామగుండం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్ కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.

## బాలవికాసకు లక్ష రూపాయల వితరణ

### - ఔదార్యం చాటుకున్న నిరుపేద వృద్ధురాలు



**ఓదెల జనవరి 27 (ది క్రైమ్ న్యూస్) :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గూడెం గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధురాలు తన భర్త కీర్తిశేషులు శ్రీ బండారి మల్లేశం గారి జ్ఞాపకార్థం గ్రామ మాజీ సర్పంచ్ శ్రీ ఉసికమల్ల. చంద్రమౌళి గారి చేతుల మీదుగా గ్రామంలోని బాల వికాస నీటి శుద్ధీకరణ ప్లాంటు చైర్మన్ ఉప్పుల శ్రీనివాస్ గారికి లక్ష రూపాయల నగదును అందజేయడం జరిగింది. రానున్నఎండా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజలకు చల్లని తాగునీటిని తన భర్త జ్ఞాపకార్థం అందించడం తనకు భగవంతుడు ఇచ్చిన వరమని వృద్ధురాలు శ్రీమతి బండారి ప్రమీల చెప్పారు. ఈ కార్యక్రమంలో వాటర్ ప్లాంట్ ఆపరేటర్ రేగుల సంపత్, కర్ర శ్రీధర్, బండారి రాములు తదితరులు పాల్గొన్నారు.

## మండల అధ్యక్షుడిని సన్మానించిన రంగపేట బిజెపి నాయకులు...



**కరీంనగర్ టౌన్, జనవరి27(ది క్రైమ్ న్యూస్):** ఇటీవల నూతనంగా మానకొండూర్ బిజెపి మండల పార్టీ అధ్యక్షులుగా నియమితులైన కంది రాజీ రెడ్డి ని రంగపేట బిజెపి నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి మర్రి అంజి, మండల ఓబీసీ మోర్చ మండల కార్యవర్గ సభ్యులు మారం సంపత్ ,పోలింగ్ బూత్ అధ్యక్షులు కట్కూరి రాజిరెడ్డి, పోలవేణి అనిల్, రాజు, శ్రీధర్, అశోక్ ,శ్యామ్, నవీన్, అభిలాష్, పాల్గొన్నారు.

## ధర్మారం ఎంపీడీవోకు ప్రశంసా పత్రం

### - ఉత్తమ ఉద్యోగిగా ప్రవీణ్ కుమార్



**ధర్మారం, జనవరి, 27 (ది క్రైమ్ న్యూస్):** ధర్మారం మండలం ఎంపీడీవో ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. జనవరి 26 న భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రం అందుకున్న ధర్మారం ఎంపీడీవో ఐనాల ప్రవీణ్ కుమార్, మండలంలో తమదైన శైలిలో తోటి ఉద్యోగస్తులతోని అభిమానాన్ని పొందారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



# మావోయిస్టులకు కాలం చెల్లిందా ?

మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇటీవలి ఎన్‌కౌంటర్లలో వరుసబెట్టి నేతలు నేలకు ఒరిగారు. కేంద్రం కూడా మావోల అణచివేతకు పకడ్బందీ వ్యూహంతో అడుగులు వేస్తోంది. ప్రజల్లో వారికి స్థానం లేకపోవడం కూడా అణచివేతకు వ్యతిరేకత రావడం లేదు. ఎన్‌కౌంటర్లు జరిగినా పెద్దగా స్పందన రావడం లేదు. ఇకపోతేగతంలో తెలంగాణ, ఎపిల్లో వారి పట్టుబాగా ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఈ రెండు రాష్ట్రాల్లో పూర్తిగా తుడిచిపెట్టుకు పోయాయి. కేవలం ఛత్తీస్‌ఘడ్‌లో మాత్రమే కొంత ప్రభావం చూపుతున్నారు. అదికూడా అడవులకే పరిమితం కావడం, అడపాదడపా చిన్నాచితకగా కార్యక్రమాలు చేపట్టడం వంటివి చేస్తున్నారు. అడవిచుట్టూ ఉన్న గిరిజనులు కూడా తుపాకులకు భయపడి వారికి సలాం కొడుతున్నారు. అయితే ఎన్‌కౌంటర్లలో అందరూ నేలకు ఒరిగినా ఒక్క గిరిజనులు లేదా గిరిజన ప్రజలు కన్నీరు కార్చడం లేదు. కారణమేమంటే మావోలు ప్రజలతో సంబంధాలను వదులుకున్నారు. ప్రజలకు దూరంగా ఉంటున్నారు. ప్రజా ఉద్యమాలు ఆగిపయాయి. ప్రజల పక్షాన కొట్లాడడం లేదు. అందుకే మావోయిస్టు పార్టీ చివరి శ్వాస తీసుకుంటున్నది.నక్సలైట్ విముక్త భారత్ కోసం సాయుధ బలగాలు అత్యంత ధైర్యసాహసాలతో వందలాదిమంది మావోయిస్టులను నేల కూల్చారు. చత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ల్లోని అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షా తక్షణ స్పందన ఇది. మావోయిస్టు లకు ఇక స్థానం లేదని, నక్సలిజం అంతరించిందని అన్నారు. తుపాకీతో రాజ్యం సాధించడం కల్ల అని తేలిపోయింది. భారత సైన్యం పెద్ద ఎత్తున విరుచుకుపడుతున్న నేపథ్యంలో మావోయిస్టులు భారీ మూల్యం చెల్లించుకోక తప్పడం లేదు. దేశ సైనిక సంపత్తి,టెక్నాలజీ, ఇతర వనరులతో పోల్చితే మావోయిస్టు పార్టీకి ఉన్న బలం చాలా తక్కువని చెప్పక తప్పదు. అలాగే బయట దేశాల నుంచి అందే సహాయం కూడా బాగా తగ్గిపోయింది. రిక్రూట్‌మెంట్ కూడా ఆగిపోయింది. యువత ఉద్యోగాన్వేషణలో పడిరది. చచ్చ ఇసాధించేకన్నా బతికుండగానే సాధించుకోవాలన్న పట్టుదలతో యువత కెరీర్‌పై దృష్టి పెట్టింది. నాటి పీపుల్స్ వార్... మావోయిస్టు పార్టీగా మారాక 'సైనికీకరణ'కు ప్రాధాన్యం పెరిగింది. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ ఏర్పాటు, కంపెనీలు, బెటాలియన్లు, ప్లాటూన్లు పెరిగాయి. దట్టమైన అడవుల్లో, సురక్షిత, దుర్భేద్యమైన ప్రాంతాల్లో మాత్రమే మావోయిస్టు గెరిల్లా ఆర్మీ సంచారం సాధ్యం. అందుకే మావోయిస్టులు ఛత్తీస్ గఢ్‌లోని అబూజ్‌మడ్‌ను బేస్ క్యాంపుగా మార్చుకొని సాయుధ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అబూజ్ మడ్ అడవుల్లోకి ప్రభుత్వం వరుస ఎన్‌కౌంటర్లతో ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతం అట్టుడుకుతోంది. ఛత్తీస్‌గఢ్‌ఒడిశా సరిహద్దుల్లో ఇటీవల జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో కనీసం 27మంది మావోయిస్టులు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లాలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి ఉన్నారు. ఆయన తలపై కోటి రూపాయల నజరానా ఉంది. నిఘా వర్గాల పక్కా సమాచారంతో ఛత్తీస్‌గఢ్‌ఒడిశాకు చెందిన సంయుక్త బలగాలు గరియాబంద్ జిల్లా పరిధిలోని కులహాదీ ఘాట్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఛత్తీస్‌గఢ్‌ఒడిశా సంయుక్త బృందాలు ఈ 30, సిఆర్‌పిఎఫ్, కోబ్రా 25 బెటాలియన్‌కు చెందిన జవాన్లు, సిఆర్‌పిఎఫ్ 65, 201 బెటాలియన్‌తో పాటు ఎస్‌ఓజి నువ్వా పాడ బృందం సెర్చింగ్ ఆపరేషన్ చేపట్టాయి. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య అడపదడపా కాల్పులు కొనసాగుతున్నాయి. ఆపరేషన్ సమయంలో ఎస్‌ఎల్‌ఆర్ రైఫిల్‌తో పాటు పెద్ద ఎత్తున ఆటోమేటిక్ ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఒడిశా మావోయిస్టు సంస్థ అధిపతి, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గుడ్డు కూడా ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున సెర్చింగ్ ఆపరేషన్ కొనసాగింది. ఈ ఎన్‌కౌంటర్‌తో నక్సలిజానికి మరో గట్టి దెబ్బ తగిలిందని, నక్సల్స్ రహిత భారత్ నిర్మాణంలో భద్రతా బలగాలు పెద్ద విజయాన్ని సాధించాయని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. సిఆర్‌పిఎఫ్, ఎస్‌ఒజి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఒడిశా – ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో సంయుక్త ఆపరేషన్‌లో 27 మంది నక్సలైట్లను మట్టుబెట్టారని అన్నారు. నక్సల్స్ రహిత భారతదేశం కోసం మన సంకల్పం, మన భద్రతా దళాల ఉమ్మడి ప్రయత్నాలతో నక్సలిజం తుదిశ్వాస విడిచిందంటూ తన వ్యాఖ్యానించారు. 2026 మార్చికల్లా ఛత్తీస్‌గఢ్ నక్సల్స్ రహిత రాష్ట్రం కాగలదని రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ అన్నారు. పోలీసులు, సీఆర్ పీఎఫ్ జవాన్ల సాహసం వల్లనే ఇది సాధ్యమవుతోందని చెబుతూ వారికి శాల్యూల్ అన్నారు. నిరుడు వివిధ ఎన్ కౌంటర్లలో దాదాపు 219 మంది నక్సల్స్ హతమయ్యారు. ఇకపోతే ఇండియాలో మావోయిస్టు పార్టీ 'నూతన ప్రజాస్వామిక విప్లవ' లక్ష్యాన్ని చేరుకోగలదన్న ఆశలు ఎప్పుడో అడుగంటాయి. అందుకు తగిన వాతావరణం కూడా లేకుండా పోయింది. ప్రజలంతా సొంతంగా భూమికోసం, భుక్తి కోసం పోరాడుతున్నారు. వారికి అండగా మావోయిస్టులు ఎక్కడా కానరావడం లేదు. తాజా పరిస్థితుల్లో ఉనికి అన్నది మావోయిస్టులకు ఒక సవాల్ అని చెప్పక తప్పదు. తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం వస్తుందన్న నినాదానికి కాలం చెల్లింది. విప్లవ యుద్ధం అనేది ప్రజలను సమీకరించడం ద్వారా, వారిపై ఆధారపడటం ద్వారా మాత్రమే సాధించగలం. అయితే ఈ దేశంలో మావోయిస్టు పార్టీ చేస్తున్న పోరాటాల్లో ప్రజల భాగస్వామ్యం లేకుండా పోయింది. ప్రజలతో సంబంధం లేకుండా చేస్తున్న పోరాటాలకు కాలం లేదన్న విషయం బలపడిపోయింది. చెల్లదని కూడా తేలిపోయింది. మావోయిస్టులు బాగా బలపడ్డ సందర్భాల్లో ప్రభుత్వాలు ఇంత శక్తిమంతంగా లేవు. అలాగే ప్రజలు కూడా బలంగా మావోయిస్టుల వెంట నడిచారు. మేధావులు, పత్రికలు కూడా అండగా నిలిచాయి. ఏ విప్లవమైనా ప్రారంభించే ముందు పరిస్థితులను సంపూర్ణంగా అధ్యయనం చేసి అంచనా వేయాలని కూడా మార్క్స్, ఎంగెల్స్ చెప్పారు. అలాంటి అంచనాల్లోనూ మావోయిస్టు పార్టీ విఫలమైందన్న భావన కలుగుతోంది. ప్రపంచంలో సోషలిస్టు శిబిరాలు కూలిపోయాక, పెట్టుబడిదారీ వ్యవస్థ, స్వేచ్ఛా వాణిజ్యం వర్ధిల్లుతున్నవి. ఈ దశలో భారతదేశంలో విప్లవం విజయవంతం కావడంపై అనుమానాలు సహజం. విప్లవ పతాక స్థాయికి చేరడానికి భారత్ చాలా దూరంలో ఉన్నది. విప్లవకారులు అత్యుత్సాహంతో కేవలం సాయుధ పోరాటాన్ని మాత్రమే ఆశ్రయించారన్న విమర్శలున్నవి. ప్రజలకు దూరంగా చేసే పోరాటం ఎప్పటికీ నిలబడదు. ప్రజాస్వామ్యంలో ప్రజలను దూరం పెట్టిన రాజకీయ పార్టీలే మట్టి కరుస్తున్నాయి.

## ప్రయాగ్ రాజ్‌లో అమిత్‌షాకు ఘన స్వాగతం

**స్వాగతం పలికిన సిఎం యోగి తదితరులు**

**కుంభమేళాలలో స్నానమాచరించిన అమిత్ షా**

ప్రయాగ్‌రాజ్ :

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా కు భారీగా భక్తులు క్యూ కడుతున్నారు. సాధారణ ప్రజలతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు కూడా త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. తాజాగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈ కుంభమేళాలో పాల్గొన్నారు. గంగ, యమున, సరస్వతి నదీ సంగమం వద్ద పుణ్యస్నానం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, యోగా గురు బాబారామ్‌దేవ్ కూడా పుణ్యస్నానమాచరించారు. పుణ్యస్నానం కోసం ప్రత్యేక విమానంలో ప్రయాగ్‌రాజ్ చేరుకున్న అమిత్ షాకు సిఎంయోగి ఆదిత్యనాథ్, ఆయన మంత్రివర్గ సహచరులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక బిజెపి నేతలు కూడా అమిత్ షాను స్వాగతించారు. మరోవైపు జనవరి 13న ప్రారంభమైన మహా కుంభమేళా వైభవోపేతంగా కొనసాగుతోంది. ఫిబ్రవరి 26 వరకు మొత్తంగా 45 రోజుల పాటు జరగనుంది. విదేశాల నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో పోటెత్తున్నారు.

# మావోయిస్టుల నిర్మూలనలో కేంద్రం పైచేయి

**పూర్తిగా తుడిచిపెట్టే లక్ష్యంతా పనిచేస్తున్న బలగాలు**

**ప్రజల్లో ఆదరణ కోల్పోవడంతో మావోలకు తప్పని తిప్పలు**

న్యూఢిల్లీ :

**దేశంలో అశాంతికి కారణమని చెబుతున్న మావోయిస్టుల అంశాన్ని పరిష్కరించడం అంటే వాళ్ళను నిర్మూలించడమేనని ప్రధాని మోడీ, అమిత్ షా చాలా కాలంగా భావిస్తున్నారు. అందుకే నక్సల్స్ నిర్మూలనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. అడువులను జల్లెడ పట్టిస్తున్నారు. అర్బన్ నక్సలైట్లుగా గుర్తించిన వారిని సైతం అంతమొందిస్తున్నారు. కేసులతో వేధిస్తున్నారు. నక్సల్స్‌కు ప్రజాదరణ లేకుండా చేయడం, వారిని మట్టుపెట్టడం అన్న లక్ష్యంతో కేంద్రం ముందుకు సాగుతోంది. సమస్యఎంతటి తీవ్రమైనదైనా, దాన్ని సరిగా అర్థం చేసుకోకపోతే అది మరింత జటిలం కావచ్చు.**

సాయుధ దళాలు అడవుల్లోకి బాగా లోపలికి చొచ్చుకుపోగలుగుతున్నవి. ప్రభుత్వ సాయుధ బలగాలకు నక్సలైట్లకు మధ్య దూరం నానాటికీ తగ్గిపోతోంది. మావోయిస్టుల ప్రధాన స్థావరాలకు సమీపంలో బలగాలు చేరిపోతున్నాయి. అందుకు ప్రజల మద్దతు కూడా దక్కుతోంది. కారణమేమంటే ఇన్‌ఫార్మర్ల పేరుతో మావోయస్టులు అమాయక గిరిజనలను అంతమొందిస్తున్నారు. ఇది వారికి మింగుడు పడడం లేదు. ఇంతకాలం దుర్భేద్యమనుకున్న ప్రాంతాలన్నీ సైనిక బలగాలు స్వాధీనపరచుకుంటున్నాయి. అమిత్ షా అన్నట్లుగా మావోస్ట్ పార్టీ కావచ్చు..వారి ఉద్యమం కావచ్చు...'అంతిమ ఘడియల్లో' ఉన్నట్టు చెప్పుకోక తప్పదు. బీహార్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఆదివాసులు, పేదప్రజలు, దళితులే మావోయిస్టులకు సానుభూతిపరులుగా ఉన్నారు. చాలా సందర్భాలలో ఆయా సానుభూతిపరులు సైతం ఎన్‌కౌంటర్లలో బలవుతున్నారు. మావోయిస్టుల ఏరివేత పేరిట భద్రతా దళాల అణచివేత చర్యలపై పౌర సమాజంలో పెద్దగా ఆందోళన వ్యక్తం కావడం లేదు. నిజానికి ప్రజల సమస్యలను ఎత్తుకున్న సమయంలో పీపుల్స వార్‌కు ప్రజల అండదండలు లభించాయి. రిక్రూట్‌మెంట్ దక్కింది. వారి పోరాటలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలు అండగా నిలిచారు. కాలక్రమంలో వారు దూరం కావడంతో మావోయిస్టుల ఉనికి కూడా కోల్పోతూ వస్తున్నారు. అందుకే దండకారణ్యంలో రక్తపుటేరులు పారుతున్నాయి. కాల్పుల మోతలతో బస్తర్ అడవులు మార్మోగుతున్నాయి. అబూజ్ మఢ్ కేంద్రంగా రెండు దశాబ్దాలుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మావోయిస్టులను భద్రతా బలగాలు వరుస ఎన్‌కౌంటర్లలో చావుదెబ్బ తీస్తున్నాయి. గత ఏడాదిగా జరుగుతున్న ఎదురుకాల్పుల ఘటనల్లో ఇప్పటివరకు మూడు వందలకు పైగా మావోయిస్టులు హతమైనట్లు పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. ఈ ఏడాది ఆరంభంనుంచీ గత ఇరవై రోజుల్లోనే మూడు ఎన్‌కౌంటర్లలో 44 మందికి పైగా మావోయిస్టులు అసువులు బాశారంటే పోలీసులు ఎంతలా పైచేయి సాధించారో అర్థం చేసుకోవచ్చు. దండకారణ్యాన్ని చుట్టుముట్టి కాల్పులకు పాల్పడుతున్న సాయుధ బలగాలకు వెరచి గత ఏడాది కాలంలో సుమారు 850 మంది మావోయిస్టులు లొంగిపోగా, పోలీసులు మరో 400 మందికి పైగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, సిఆర్‌పిఎఫ్, కోబ్రా బలగాలు సంయుక్తంగా 'ఆపరేషన్ కగార్' పేరిట సాగిస్తున్న ముప్పేట దాడికి సాంకేతిక పరిజ్ఞానమూ తన వంతు సహకారం అందిస్తూండటంతో మావోయిస్టులు మూల్యం చెల్లించుకోక తప్పడం లేదు. కాకులు దూరని కారడవిలో 650కి పైగా బేస్ క్యాంపులు ఏర్పాటు చేసుకుని, భద్రతా బలగాలు గాలింపు జరుపుతున్నాయి. మావోయిస్టుల జాడ తెలియగానే విరుచుకుపడి మట్టుబెడుతున్నాయి. అబూజ్ మఢ్ అడవుల్లో మావోయిస్టుల జాడ పసిగట్టడంలో జిల్లా రిజర్వ్ గ్రూపు (డిఆర్‌జి)లదే కీలకపాత్ర. ముల్లును ముల్లుతోనే వెలికి తీయాలన్న ఉద్దేశంతో.. లొంగిపోయిన నక్సలైట్లను ఉపయోగించుకుని, మావోయిస్టుల జాడ కనిపెట్టేందుకు ఏర్పాటు చేసిందే ఈ డిఆర్‌జి. దట్టమైన అడవిలో ఏది ఎక్కడుందో డిఆర్‌జిలకు కొట్టినపిండి కావడంతో గాలింపు చర్యలలో వారినే ముందుభాగంలో ఉంచుతున్నారు. ఇప్పటివరకూ జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో డిఆర్‌జిల సహకారం వల్లనే పోలీసులు పైచేయి సాధించారంటే అతిశయోక్తి కాదు. ఒకప్పుడు నక్సలిజం అనేక రాష్ట్రాల్లో ఊడలూనుకుని, ప్రభుత్వాలను గడగడలాడిరచిన మాట వాస్తవం. నక్సలైట్లు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ, పోలీసులపైన, ఇన్ఫార్మర్లపైన మెరుపుదాడులు జరిపి మట్టుబెడుతూ పాలకులకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. నక్సలైట్ల తుపాకులకు ఎందరో ప్రజాప్రతినిధులు బలైన సంఘటనలు కోకొల్లలు. ఒకప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సైతం సాయుధ పోరాట దాడులతో విలవిల్లాడిరది. కారణాలేమైతేనేం, ఉభయ తెలుగురాష్ట్రాల్లో నక్సలైట్ల జోరు తగ్గి, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్ వంటి రాష్ట్రాలకు విస్తరించింది. అడపాదడపా భద్రతాదళాలపై గెరిల్లా దాడులు చేస్తూ, మావోయిస్టులు ఉనికిని చాటుకుంటున్నారు. కేంద్రంలో మూడో దఫా అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం మావోయిస్టులను తుడిచిపెట్టేందుకు కంకణం కట్టుకున్నట్లు చత్తీస్‌గఢ్ అడవుల్లో చోటు చేసుకుంటున్న వరుస ఎన్‌కౌంటర్లను బట్టి తెలుస్తోంది. వచ్చే ఏడాది మార్చి నెలలోగా మావోయిస్టులనుంచి చత్తీస్‌గఢ్‌కు విముక్తి కల్పిస్తామంటూ కేంద్ర హోం మంత్రి చేస్తున్న ప్రకటనలను కూడా ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవాలి. తెలంగాణతో సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో కమ్యూనిస్టులు గతంలో సాయుధ పోరాటం చేశారు. వారు ప్రజల్లో ఉంటూ పోరాడారు. కాలక్రమంలో రాజకీయం మారింది. కమ్యూనిస్టులు కూడా మెల్లగా అంతమవుతున్నారు. సరళీకరణ ఆర్థిక విధానాల కారణంగా ప్రజలు బతుకుదెరువు కోసం దేశాన్ని దాటేస్తున్నారు.


## 78 స్వాతంత్ర్య భారతంలో ఇంకా కనీస వసతులు కరువు

**మారుమూల గ్రామాల్లో తాగునీటికి అవస్థలు**

న్యూఢిల్లీ :

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి సుమారుగా 78 ఏళ్ళు పూర్తయ్యింది. ఈ ఎనిమిది దశాబ్దాల్లో దేశంలో ఎంతో అభివృద్ధి జరిగింది. దాదాపు అన్ని రంగాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. అయితే వివిధ రాష్ట్రాల్లోని కొన్ని మారుమూల గ్రామాలకు మాత్రం ఇంకా అన్ని రకాల అభివృద్ధి ఫలాలు అందలేదు. ఇప్పటికీ సరైన రవాణా సౌకర్యం, తాగునీటి వసతి లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన చిల్కపల్లి గ్రామం కూడా ఆ కోవకు చెందినదే. చిల్కపల్లి గ్రామానికి రవాణా, తాగునీటి సంగతి దేవుడెరుగు.. ఇప్పటిదాకా కనీసం విద్యుత్ సౌకర్యం కూడా లేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 78 ఏళ్ల తర్వాత ఇప్పుడు ఆ గ్రామం విద్యుత్ వెలుగులకు నోచుకున్నది. బీజాపూర్ జిల్లా కలెక్టర్ సంబిట్ మిశ్రా ఈ నెల 23న చిల్కపల్లి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించారు. దాంతో చిల్కపల్లి గ్రామ ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. చాన్నాళ్ల తర్వాత తమ ఇళ్లలో విద్యుత్ వెలుగులను చూసుకుని సరికొత్త అనుభూతి చెందుతున్నారు. జనవరి 23 నుంచి చిల్కపల్లి గ్రామానికి విద్యుత్ వెలుగులు మొదలయ్యాయని సంబిట్ మిశ్రా చెప్పారు. నియాద్ నెల్నార్ పథకం కింద ఆ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ పథకం కింద విద్యుత్ సౌకర్యం పొందిన ఆరో గ్రామం చిల్కపల్లి అని మిశ్రా వెల్లడించారు.

# 'పంజాబ్ కేసరి' లాలా లాజపతిరాయ్



**జనవరి 28 లాలా లాజపతిరాయ్ జయంతి :**

**ఈ రోజు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యానికి కారణం స్వాతంత్ర్య ఉద్యమంలో ఎందరో మహానుభావుల ప్రాణత్యాగం. ఈ పోరాటంలో అతివాదుల పాత్ర చెప్పనలవికానిది. అతివాదుల ఉద్యమానికి ఊపిరిపోయడానికి వారి ప్రాణాలనే బలి పెట్టిన వారిలో "లాల్ బాల్ పాల్" త్రయం పాత్ర కీలకం. వీరిలో లాలా లజపతి రాయ్ జన్మదినం జనవరి 28. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలు స్మరించుకోవడమే ఆయనకు మన మిచ్చే ఘననివాళి !**

తూటాల్లాంటి ఆయన సందేశం:

" మీ మీద మీ సామర్థ్యం మీద నమ్మకం ఉంచండి. సమాజంలో మార్పు తెచ్చే సత్తా మీలో ఉంది . అన్యాయాన్ని నిర్భయంగా ప్రశ్నించండి. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సమాజ సంక్షేమం కోసం పాటుపడండి. " "నాపై గురిపెట్టిన ప్రతి దెబ్బ బ్రిటీష్ సామ్రాజ్యవాద శవపేటికలో మేకు. నేను అలాగే ఉంటానో లేదో నాకు తెలియదు, కానీ మీరు చింతించకండి. నా తర్వాత నా ఆత్మ స్వేచ్ఛ కోసం మరిన్ని త్యాగాలు చేయమని మిమ్మల్ని ప్రోత్సహిస్తూనే ఉంటుంది". అని పోరాటాల్లో పాల్గొన్న వారికి ఆయనిచ్చే సందేశం ఎందరినో ప్రేరేపించి పోరాటంలో పాల్గొనేలా చేసింది. ఆయన ఆదర్శం భారతీయ జాతీయవాదం. దీని కోసం పనిచేశారు, బాధపడ్డారు, చివరికి తన జీవితాన్ని అర్పించారు. జాతీయవాద భావానికి తనదైన ముద్రను, కొత్త అర్థాన్ని, జాతీయోద్యమానికి కొత్త మలుపు ఇచ్చారు. "దేశభక్తి" అంటే స్వేచ్ఛ, న్యాయం పట్ల అపారమైన ప్రేమ, ఆత్మగౌరవం కలిగి ఉండడమే అని

చెప్పారు.

పాఠశాల స్థాయిలోనే నాయకుడు:

లాలా లజపతిరాయ్ పంజాబ్ లోని 'ధుడికే' గ్రామంలో రాధా కిషన్, గులాబ్ దేవి దంపతులకు 1865 జనవరి 28న జన్మించారు. తండ్రి నుండి కర్తవ్యం, బాధ్యత, నిర్మోహమాటత, నిజాయితీ, త్యాగాలు, స్వాతంత్ర్య స్ఫూర్తి తన తల్లి నుండి దానం, విశాల హృదయం, సున్నితత్వం, భక్తి వంటి సుగుణాలను వారసత్వంగా పొందారు.1880 ప్రారంభంలో లుధియానాలోని మిషన్ చదువుతున్నప్పుడు ఆరోగ్యం సహకరించ పోయినప్పటికీ పాఠశాల స్థాయి నుంచే చదవడం, రాయడం, మాట్లాడటంపై మక్కువ పెంచుకోవడమే గాక ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ పై ఆసక్తి చూపిస్తూ నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకున్నారు.

గొప్ప వాగ్ధాటి కలిగిన వారు:

1886లో హిసార్‌కు వెళ్లి న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. చురామణితో కలిసి హిసార్ బార్ కౌన్సిల్ వ్యవస్థాపక సభ్యుడు అయ్యారు. ఆర్యసమాజ్ హిసార్ జిల్లా శాఖను కూడా స్థాపించారు స్వాతంత్ర్యం పొందడానికి భారతదేశ రాజకీయ విధానాన్ని రూపొందించడానికి జర్నలిజంను అభ్యసించారు. ది ట్రిబ్యూన్‌తో సహా అనేక వార్తాపత్రికలకు రెగ్యులర్ కంట్రిబ్యూటర్. 1886లో లాహోర్‌లోని జాతీయవాద దయానంద ఆంగ్లో–వేద పాఠశాలను స్థాపించడానికి మహాత్మా హంసరాజ్‌కి సహాయం చేశారు. 1905 లో భారత జాతీయ కాంగ్రెస్ కమిటీ దేశంపై ఆయనలో ఉన్న అంకితమైన చిత్తశుద్ధి, నిస్వార్ధ కార్యకర్తను గుర్తించి, భారత ప్రజల రాజకీయ సమస్యలను బ్రిటిష్ ప్రజల ముందు ఉంచే ఉద్దేశ్యంతో ప్రతినిధులలో ఒకరిగా ఎంపిక చేసింది. గోపాల కృష్ణ గోఖలేతో కలిసి ఇంగ్లాండులోని వివిధ ప్రాంతాలలో రాజకీయ ప్రచారాన్ని నిర్వహించి భారతదేశం శ్రమిస్తున్న సహనం లేని బ్యూరోక్రాటిక్ ప్రభుత్వ దురాచారాలను బ్రిటిషర్ల దృష్టికి తీసుకువచ్చారు. గొప్ప వాక్చాతుర్యంతో వాస్తవాలు, గణాంకాలతో 'సగం ఆకలితో అలమటిస్తున్న, సగం చనిపోతున్న భారత ప్రజల' లక్ష్యాన్ని సమర్థించారు. ఆయన మాటలు 'ఆంగ్లేయుల'పై విపరీతమైన ముద్ర వేశాయి. ఆ తర్వాత అమెరికాకు కూడా వెళ్లి అక్కడ అనేక విద్యా సంస్థల పనితీరును స్వయంగా చూశారు.

పంజాబ్ కేసరి:

స్వదేశీ ఉద్యమం ఊపందుకోవడంతో రాయ్ తన హృదయాన్ని, ఆత్మను అందులో ఉంచి స్వదేశీ సందేశాన్ని బోధించారు. పంజాబ్ ప్రజలలో బాగా ప్రాచుర్యం పొందారు. ఇది అప్పటి బ్యూరోక్రసీకి కోపం తెప్పించింది. బ్రిటిష్, ఆంగ్లో ఇండియన్ ప్రెస్ చేత 'విప్లవకారుడు'గా పరిగణించబడ్డారు. పంజాబ్ వలస చట్టం, నీటిపారుదల రేట్లు పెంపుదలని వ్యతిరేకించాడు. ప్రభుత్వ దుర్మార్గాలను బయటపెట్టిన వార్తాపత్రిక 'పంజాబీ' పై విచారణ, పంజాబీల మనోభావాలను రేకెత్తించింది. ప్రభుత్వం ఎంతగానో భయపడి 1907 మే 9న లాలా లజపతిరాయ్‌ని అరెస్టు చేసి మాండలే కోటలో ఉంచింది.

విదేశీ యానం:

బ్రిటీష్ ప్రభుత్వం విదేశాలలో మన జాతీయవాద ఉద్యమానికి వ్యతిరేకంగా తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు చేస్తున్నందున, ఏప్రిల్ 1914లో దేశ స్వాతంత్ర్యం కోసం తనను తాను అంకితం చేసుకోవడానికి న్యాయవాద వృత్తిని విడిచిపెట్టి ఇంగ్లండ్‌కు వెళ్లారు. అమెరికాలో కూడా చురుగ్గా ఉన్న బ్రిటీష్ ఏజెంట్లు చేపట్టిన ప్రచారాన్ని అతను ప్రతిఘటించడం ప్రారంభించారు.

సర్వెంట్స్ ఆఫ్ పీపుల్ సొసైటీ:

1920 కలకత్తా ప్రత్యేక సెషన్‌లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1921లో లాభాపేక్షలేని సర్వెంట్స్ ఆఫ్ పీపుల్ సొసైటీ అనే సంక్షేమ సంస్థను స్థాపించారు. కుల వ్యవస్థ, స్త్రీల స్థానం, అంటరానితనంతో హిందూ సమాజం తన స్వంత పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కులం లేదా లింగంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ వేదాలను చదవడానికి, నేర్చుకోవడానికి అనుమతించాలని విశ్వసించారు.

1920 సెప్టెంబరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ ప్రత్యేక సమావేశంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నుకుంది. జలియన్ వాలాబాగ్ దుర్ఘటన తర్వాత బ్రిటిష్ ప్రభుత్వంతో సహాయ నిరాకరణ తీర్మానాన్ని ఆయన నాయకత్వంలోనే కాంగ్రెస్ ఆమోదించింది. 1921లో అరెస్టయి ఏడాది జైలు శిక్ష అనుభవించారు. 1926 జనవరిలో పండిట్ మోతీలాల్ నెహ్రూ ప్రోద్బలంతో లాలా లజపతిరాయ్ స్వరాజ్ పార్టీలో చేరి దాని ఉపనేతగా ఎన్నికయ్యారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి:

లాల్ బహుముఖ ప్రజ్ఞాశాలి, రాజకీయవేత్త, సామాజిక కార్యకర్త, రచయిత, పాత్రికేయుడు, వక్త. శక్తివంతమైన సంఘ సేవకుడు. చాలా ఉదారమైన పరోపకారి. ప్రజల ప్రయోజనాల కోసం పోరాడే వ్యక్తి. 1896, 1899-1900, 1907-08 లో కరువులు,1905లో కాంగ్రాలో సంభవించిన భూకంపం సమయంలో ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను విముక్తం చేయడంలో దేశ ప్రజలకు సేవ చేయడంలో ఏ మాత్రం వెనుకడుగు వేయకుండా అలుపెరగని సేవచేసారు. లాలాజీ సెంట్రల్ హోమ్, సెంట్రల్ స్కూల్ నిర్మాణం కోసం లాహోర్ లో పెద్ద స్థలాన్ని కొనుగోలు చేశారు. 1908లో లాలాజీ సమీకరించిన కరువు నిధిలో కొంత భాగాన్ని అణగారిన వర్గాల అభ్యున్నతికి ఉపయోగించారు. కొన్ని ప్రాథమిక పాఠశాలలను కూడా ఈ నిధి నుండి వారి ప్రయోజనం కోసం నిర్వహించారు. ఒక సామాజిక కార్యకర్తగా అస్పృశ్యత, స్త్రీల అభ్యున్నతికి సంబంధించి గొప్ప సామాజిక, ఆర్థిక సిద్ధాంతకర్త. కరవు సహాయక నిర్వాహకుడిగా, కార్మికుడిగా ఆయన పోరాట పటిమ దాదాపు ప్రతి కార్యకలాపంలోనూ తన ప్రభావాన్ని చూపింది. నిరుపేద పిల్లల కోసం అనాథాశ్రమాలు ఏర్పాటు చేసిన ఆయన పథకం అధికారుల నుంచి కూడా ప్రశంసలు, గుర్తింపు పొందింది. ఈ విషయంలో లాలాజీ తన సమకాలీకులందరి కంటే సంఘ సంస్కర్తగా ఉన్నత పీఠంపై నిలబడ్డారు.

సంఘసంస్కర్త:

ఒక సంఘసంస్కర్తగా ఆయన అంటరానితనం నిర్మూలనకు కృషి చేసే దశలో ఆర్యసమాజ్ ప్రారంభించిన ఉద్యమానికి బలమైన మద్దతు ఇచ్చారు. మహాత్మాగాంధీ హరిజన సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఈ రంగంలో తన పనిని ప్రారంభించినప్పుడు, సమస్యను మరింత మెరుగ్గా ఎత్తిచూపడంతో ఆయన ఈ సంస్థలో పనిచేయడం ప్రారంభించారు. ప్రపంచంలోని ఇతర ముఖ్యమైన ఉద్యమాల మాదిరిగానే ఈ సంఘసంస్కరణ కూడా జాతీయ ఆమోదం పొందడానికి గొప్ప పోరాటం చేయాల్సి ఉందని ఆయన ప్రకటించారు.

రచయితగా:

రచయితగా కలం పట్టి విభిన్న అంశాలపై రచనలు చేసి.తన సమకాలీనులలో గొప్ప ముద్రను సృష్టించారు.1895 నుండి 1900 కాలంలో మజ్జినీ, గరీబాల్డి, శివాజీ, స్వామి దయానంద్ జీవిత చరిత్ర పుస్తకాలు రాశారు.

మరణం:

సైమన్ కమిషన్ 30 అక్టోబర్, 1928న లాహోర్‌ను సందర్శించినప్పుడు, దానికి వ్యతిరేకంగా నిరసనగా లజపత్ రాయ్ అహింసాయుతమైన మార్చ్‌కి నాయకత్వం వహించారు. పోలీసు సూపరింటెండెంట్ జేమ్స్ స్కాట్ నిరసనకారులపై లాఠీ ఛార్జ్ చేయించడమే కాకుండా రాయ్‌పై వ్యక్తిగతంగా దాడి చేశాడు. తన గాయాల నుండి పూర్తిగా కోలుకోలేక 17 నవంబర్ 1928 న మరణించారు.

**- జనక మోహన రావు దుంగ**
**ఫోన్ : 8247045230**

# ఎన్టీపీసీ పట్టణ బంద్‌ను విజయవంతం చేయండీ

## - ఎన్టీపీసీ యాజమాన్యం భూనిర్వాసితులు జీవితాలను చికటిమయం చేసింది

## - రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్



**గోదావరిఖని (ది క్రైమ్ న్యూస్):** ఎన్టీపీసీ విస్తరణకు భూములను త్యాగం చేసిన భూ నిర్వాసితులకు న్యాయం చేసిన తర్వాతనే ఎన్టీపీసీ యాజమాన్యం అభిప్రాయ సేకరణ చేపట్టాలని 28న ఎన్ టీ పి సీ బందు ప్రజలందరికీ విజయవంతం చేయాలని రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ ప్రజలను కోరారు. భూ నిర్వసీతులు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే అభిప్రాయ సేజరణ చేపట్టాలని డిమాండ్ చేసారు. ఎన్టీపీసీ లో ముఖ్య భూమిక పోషించిన కాంట్రాక్టు కార్మికులను ఎన్టీపీసీ యాజమాన్యం విస్మరించిందని కార్మికుల పిల్లలకు మేరుగైనా విద్య వైద్యం సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రామ గుండంలోని ఎన్టీ పీసీ విద్యుత్ ప్రాజెక్ట్ దేశానికి వెలుగులు అంది స్తున్నా.. నిర్వాసి తుల కుటుంబాలు చీకట్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, తెలంగాణ స్టేజ్-2లో చేపట్టే 2,400 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టుతో ఈ ప్రాంతం కాలుష్యంగా మారుతుందన్నారు. విలువైన భూములు అందిస్తున్న నిర్వాసితులకు ప్రాజెక్టులో ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభావిత, పునరావాస ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించి, మౌలిక వస తులు కల్పించాలన్నారు. కాంట్రాక్టు కార్మికుల పిల్లలకు కార్పొ రేట్ స్థాయిలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించి ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. యాష్పాండ్ నిర్మాణం కోసం 600 ఎకరాలను సేకరించేందుకు ఈనెల 28న ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతోందని, అంతకుముందుగానే నిర్వాసితులకు కల్పించే ప్రయోజనాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కుందనపల్లి, మల్యాలపల్లె, అక్బర్నగర్, బద్రిపల్లె, మొఘల్పహాడ్, మాతంగి కాలనీవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. లేకుంటే ప్రజాభిప్రాయ సేకరణను బీఆర్ఎ స్ ఆధ్వర్యంలో అడ్డుకుం టామని హెచ్చరించారు.

# కేంద్రమంత్రి కట్టర్ ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేసిన కోతి రాంపూర్ ప్రజలు..

## - బిజెపి నేత మాసం గణేష్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రులు కట్టర్, బండి సంజయ్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం..



**కరీంనగర్ టౌన్, జనవరి27, (ది క్రైమ్ న్యూస్):** కోతి రాంపూర్ ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిన డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరిస్తామని కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ హామీ ఇవ్వడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలను ఇబ్బంది పెడుతూ, వేధిస్తున్న డంపింగ్ యార్డ్ కు సమస్యకు పరిష్కారం లభించేలా కృషి చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కి, ఎంత ఖర్చయినా కేంద్రమే భరిస్తుందని ఇటీవల కరీంనగర్ బహిరంగ సభ వేదికగా హామీ ఇచ్చిన కేంద్రమంత్రి కట్టర్‌కి కృతజ్ఞతలు తెలుపుతూ సోమవారం రోజున కోతి రాంపూర్ బిజెపి నేత మాసం గణేష్ ఆధ్వర్యంలో స్థానికగాంధీ విగ్రహం వద్ద సంబరాలు చేపట్టి, కేంద్ర మంత్రులు కట్టర్, బండి సంజయ్ కుమార్ ల చిత్రపటాలకు పాలాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నేతలు కళ్లెం వాసుదేవ రెడ్డి, మాసం గణేష్ లు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా డంపింగ్ యార్డ్ వల్ల కోతి రాంపూర్ ప్రజలను అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డారని , ముఖ్యంగా అనారోగ్యాల బారిన పాడిన ప్రజలు ఎంతోమంది ఉన్నారని తెలిపారు. డంపింగ్ యార్డ్ తో కోతి రాంపూర్ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ఈ సమస్యపై అనేకసార్లు పోరాటాలు, విజ్ఞప్తులు చేసిన ఏ ఒక్కరూ పట్టించుకోలేదన్నారు. ఇటీవల కరీంనగర్ పట్టణంలో జరిగిన బహిరంగ సభ వేదికగా కేంద్రమంత్రి కట్టర్ డంపింగ్ యార్డ్ సమస్యపై ప్రకటన చేసిన నేపథ్యంలో కోతి రాంపూర్ ప్రజలంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ డంపింగ్ యార్డ్ సమస్యను కేంద్రమంత్రి కట్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేసినందుకు కోతి రాంపూర్ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఇట్టి కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, సౌత్ జోన్ కన్వీనర్ గాయత్రి, జిల్లా వాణిజ్య సెల్ కన్వీనర్ శివానందం, మోహన్, కిరణ్, రమేష్ ,సాగర్ సాయిరాం ,లింగమూర్తి ,సందీప్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# అనార్ధుల అకలి తీర్చడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలి

## - సేవకు ప్రతి రూపం శ్రీ ధర్మశాస్త్ర వ్యవస్థాపకులు కౌటం బాబు

## - రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్



**గోదావరిఖని (ది క్రైమ్ న్యూస్):** సేవకు ప్రతి రూపం శ్రీ ధర్మశాస్త్ర వ్యవస్థాపకులు కౌటం బాబు, అనార్ధుల అకలి తీర్చడం ప్రతి ఒక్కరు బాధ్యత గా తీసుకోవాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం గోదావరిఖని పట్టణం పోచమ్మ దేవాలయం ఆవరణలో ఉచిత ఇడ్లీ సాంబర్ పంపిణీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా అనార్ధుల అకలి తీరిస్తు మధ్యాహ్నం భోజనం అందిస్తున్న ధర్మశాస్త్ర నిత్య అన్నదాన వేదిక ఉదయం పూట పేద వారు అకలితో బాధపడవద్దని ఉచిత ఇడ్లీ సాంబారు అందించడం గొప్ప విషయం అన్నారు. పేదవారికి అండగా నిలుస్తున్న శ్రీ ధర్మశాస్త్ర నిత్య అన్నదాన వేదిక వ్యవస్థాపకులు కౌటం బాబును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రామగుండం నియోజకవర్గం లో పేదవారికి సేవ చేయడం తమ విధిగా భావించాన్నారు. తాము ఎమ్మెల్యే గా 5 ఎళ్లు కాలంలో పేద వారికి అనాధలకు అన్ని విధాలుగా అండగా నిలిచామని విజయమ్మ ఫౌండేషన్ ద్వారా సేవ కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేసారు. ఈ కార్యక్రమం లో తాజా మజీ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు శ్రీ ధర్మశాస్త్ర నిత్యఅన్నదాన వెదక వ్యవస్థాపకులు కౌటం బాబు నాయకులు చల్లా రవీందర్ రెడ్డి నారాయణదాసు మారుతి సురేష్ నీరటి శ్రీనివాస్ ఇరుగురాళ్ల శ్రావన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి పటిష్ఠ బందోబస్తు

## - రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్





**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్ట్ రెండవ దశ పనుల కోసం నేడు ఎన్టీపీసీ జ్యోతినగర్ జడ్పిహెచ్ఎస్‌లో జరిగే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని రామగుండం సిపి ఎం.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కాజిపల్లిలోని ఓ పంక్షన్ హాల్‌లో ప్రజాభిప్రాయ సేకరణ బందోబస్తుకు వచ్చిన పోలీస్ అధికారులకు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సిపి భద్రతారమైన సూచనలు ఇచ్చారు. మొత్తం 785 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఏసీపీలు 05, సీఐలు 25, ఎస్ఐలు 48, మహిళా ఎస్సైలు 13, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్స్ 58, కానిస్టేబుళ్లు 393, మహిళా కానిస్టేబుళ్లు 145, హోంగార్డ్స్ 62, మహిళా హోంగార్లు 35 మందితో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని సిపి తెలిపారు. సమావేశం ప్రాంతం, డయాస్, పార్కింగ్ ప్రాంతాల వద్ద ఉండే పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండి అక్కడ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు భద్రతాపరమైన సూచనలు ఇచ్చారు. పోలీసు బందోబస్తును సెక్టార్లుగా విభజించి డీఎస్పీ, ఏసీపీలు ఇన్‌ఛార్జిలుగా భారీ బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి చేతన, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, రామగుండం పోలీస్ కమిషనరేట్ఎసిపిలు,సీఐలు,ఎస్ఐలుబందోబస్త్ హాజరైన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమమైన, సక్రమమైన డబ్బులు ఇస్తే దస్తావేజులు రెడీ

## - ఒకే భూమికి రెండుసార్లు రిజిస్ట్రేషన్లు

## - అవినీతి అక్రమాలకు నిలయంగా పెద్దపల్లి సబ్ రిజిస్టర్ కార్యాలయం

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లు అక్రమమైన సక్రమమైన డబ్బులు ముట్ట చెపితే దస్తావేజులు రెడీ అన్నట్లుగా పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతి అక్రమాలకు నిలయంగా మారిందని,అక్రమార్కుల కనుసన్నల్లోనే రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో అవినీతికి పాల్పడిన సబ్ రిజిస్టర్ కార్యాలయ అధికారులు ఏసీబీ అధికారులకు పట్టుబడిన అధికారులలో మాత్రం భయం లేకుండా పోయిందని నిర్భయంగా లంచాలు పుచ్చుకుంటూ తప్పుడు డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా రియాల్టర్ల మధ్య నెలకొన్న వివాదంతో అసలు విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అవినీతి సొమ్ముకు ఆశపడి ఇదివరకే రిజిస్ట్రేషన్ అయ్యి నాలా కన్వర్షన్ చేసిన భూమిలో కొంత భాగాన్ని తప్పుడు డాక్యుమెంట్లతో రెండవసారి ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారని ఒకే భూమికి రెండుసార్లు రిజిస్ట్రేషన్లు ఎలా చేస్తారని ఓ రియాల్టర్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలోని డాక్యుమెంట్ రైటర్ పై దాడి చేశారు. ఈ తప్పుడు రిజిస్ట్రేషన్ల వెనుక సబ్ రిజిస్ట్రార్ లంచం తీసుకొని రెండవసారి రిజిస్ట్రేషన్ చేసినట్టు ఆరోపిస్తూ, అక్రమ రిజిస్ట్రేషన్ లో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ హస్తమున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ తతంగంపై ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి అవినీతి అధికారులపై తగు చర్యలు తీసుకోవాలనిప్రజలు కోరుతున్నారు.

# కొత్తగట్టు దేవస్థానం కళ్యాణ మండప ప్రారంభం...

## - బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**కరీంనగర్ టౌన్, జనవరి27(ది క్రైమ్ న్యూస్):** శంకరపట్నం మండలం కొత్తగట్టులో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం మత్స్యరీంద్ర స్వామి ఆలయాన్ని మానకొండూర్ శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే, ఫిబ్రవరి నెలలో జరగనున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ ఈ ప్రాంతానికి ఆధ్యాత్మికంగా ప్రాధాన్యత కలిగిన శ్రీ మత్స్యగిరింద్ర స్వామి ఆలయం అభివృద్ధికి నా వంతు సహాయాన్ని అందిస్తాను, అని హామీ ఇచ్చారు. భక్తులు బ్రహ్మోత్సవాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగట్టు దేవస్థానం చైర్మన్ ఉప్పుగల మల్లారెడ్డి, మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, శంకరపట్నం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, హుజురాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, దేవస్థానం ఈవో సుధాకర్, డైరెక్టర్లు గరిగె ప్రభాకర్, ఐలయ్య, శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు అజయ్ తోపాటు ఆలయ అర్చకులు, గ్రామస్థులు, పార్టీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ ఆధ్వర్యంలో

# అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు

## - విగ్రహాన్ని ఆవిష్కరించిన మేయర్ సునీల్ రావు..

**కరీంనగర్ టౌన్, జనవరి27(ది క్రైమ్ న్యూస్):** ఒకటో డివిజన్ తీగల గుట్టపల్లి కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తీగల గుట్టపల్లి లో ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని మేయర్ సునీల్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ అభ్యున్నతి కోసం ఆలోచన చేసిన మహనీయుల్లో అంబేద్కర్ ఒకరన్నారు. దేశానికి అంబేద్కర్ చూపిన మార్గం, రాజ్యాంగం నేడు దిక్సూచిలా మారిందన్నారు. అంటరానితనం, కుల వివక్ష , స్వేచ్ఛ, సమానత్వం పై అంబేద్కర్ అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు. విగ్రవిష్కరణ కార్యక్రమ సందర్భంగా కార్పొరేటర్ శ్రీనివాస్ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు రాపర్తి విజయ, బండ సుమా రమణారెడ్డి, సతీష్, దురిశెట్టి అనుప్, కాసర్ల ఆనంద్ బిజెపి మీడియా కన్వీనర్ కటకం లోకేష్, కైలాస నవీన్, తెలంగాణ అంబేద్కర్ సంఘం తీగలగుట్టపల్లి నాయకులు జంగపెల్లి వినోద్ కుమార్,



జకినపల్లి రాజు, నెరవట్ల మధు, నీరుకుల్ల మహేందర్, కన్నం నవీన్, కొంకటి ప్రవీణ్, నీరుకుల్ల కళ్యాణ్, జంగం వినయ్, ఆరెపల్లి సిద్ధార్థ్ లతోపాటు మాజీ సర్పంచ్ జంగపల్లి మల్లయ్య, కవంపల్లి రవీందర్, నీరుకుల్ల అనిల్ కుమార్అంబేద్కర్ సంఘం నాయకులు రాష్ట్ర నాయకులు సుద్దాల లక్ష్మణ్ సముద్రాల అజయ్, జిల్లా అధ్యక్షులు గొష్కి శంకర్, రాష్ట్ర కార్యదర్శి గజ్జల ఆనందరావు రాష్ట్ర ప్రణాళిక టి ఏ వై ఎస్ సంఘం అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

# 400ఇండ్లైనా ఇస్తే ఎమ్మెల్యేగా పోటీ చేయను

## - మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశానికి మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరై మాట్లాడుతూ.....కాంగ్రెస్ మాయమాటలతో అధికారంలోకి వచ్చి సరిగ్గా 415 రోజులు గడుస్తున్నా ఇచ్చిన పథకాల కోసం వారం రోజుల క్రితం గ్రామసభల పేరిట కార్యక్రమం నిర్వహిస్తే నియోజకవర్గం మొత్తంలో 39,000 ఇండ్ల దరఖాస్తులే వచ్చాయనీ, రేషన్ కార్డుల దరఖాస్తులు 16200 రాగా, జాబితాలో పేర్లు రానివాళ్ళు మళ్ళీ దరఖాస్తు చేసుకోవాలని భూమిలేని రైతుకూలీలు12000 పొందేందుకు ఉపాది హామీలో 20రోజులు తప్పకుండా పనిచేయాలన్న ఆంక్షలతో పేదప్రజలను అయోమయానికి గురి చేస్తుందని ఆవేదన చెందారు. దరఖాస్తు చేసుకున్న వాళ్ళకే పథకాలు రాక ఆందోళన చెందుతుండగా ప్రజల నుండి మళ్ళీమళ్ళీ దరఖాస్తులు తీసుకుంటూ రేవంత్ రెడ్డి ప్రజలను మభ్యపెడున్నాడని, నియోజకవర్గంలో కాంగ్రెస్ 400 ఇండ్లైనా ఇస్తే తాను ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయనని రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. నాలుగు పథకాల అమలుకు శ్రీకారం పేరుతో ముంజంపల్లిలో కార్యక్రమాన్ని కాంగ్రెస్



ఎందుకు నిర్వహించిందో అర్థంకావడం లేదని మండలానికి ఒక గ్రామాన్ని ఎంచుకోగా ఆయా మండలాల కాంగ్రెస్ మండలాధ్యక్షులు వారి సొంత గ్రామాల్లో మెప్పుకోసం కార్యక్రమాన్ని నిర్వహించేందుకే ఎమ్మెల్యే వద్ద పైరోకులు నిర్వహించారని ఆరోపించారు. అసలు ఇవ్వడానికి ప్రభుత్వ స్థలం,ఇండ్లు నిర్మించడానికి ఖాజానే లేదన్న కాంగ్రెస్ అందరికీ ఇళ్ళు ఇస్తామంటు నిరంతర దరఖాస్తుల ప్రక్రియ పేరుతో ప్రజలను నిరంతరం మోసం చేసేందుకు పూనుకున్నదని ఇప్పటికే ఏడాది పాటు ఏ పథకం రాక నిరుపేదలు విసుగెత్తిపోయారని, ముఖ్యమంత్రి వ్యవహారం కొత్త బిచ్చగాడు పొద్దెరు గడన్నట్టున్నది రేవంత్ రెడ్డి పాలనపై మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు పేద ప్రజలు ప్రతీ ఒక్కరికీ అందేవరకు ప్రజల పక్షాన పోరాడుతూ అవసరమైతే ప్రభుత్వ వైఖరిపై ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్నీ హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావ పార్టీ మండలాధ్యక్షుడు తాళ్ళపెల్లి శేఖర్ గౌడ్,కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి,గంట మహిపాల్, నియోజకవర్గ అధికార ప్రతినిధి వంతడుపుల సంపత్,నాయకులు శాతరాజు యాదగిరి, మల్లా రెడ్డి, పాశం అశోక్ రెడ్డి, రామంచ గోపాల్ రెడ్డి, పిట్టల మధు, శ్రీధర్ రెడ్డి, గుర్రం కిరణ్ గౌడ్, ఎరుకల శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మాకు న్యాయం చేయండి

## - దళితుడిని దూషించలేదు - అన్యాయంగా అట్రాసిటీతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు

## - తప్పు చేస్తే ఏ శిక్షకైనా సిద్ధమే - ప్రెస్ మీట్‌లో ఆవేదన వ్యక్తం చేసిన మల్లేష్

**లక్షేట్టిపేట, జనవరి 27 (ది క్రైమ్ న్యూస్):** భూమి విషయంలో మాకు తగిన న్యాయం చేయాలని, అన్యాయంగా తనపై అట్రాసిటీ కేసును అవునూరి రాజయ్య పెట్టడం ఎంత వరకు న్యాయమని మిల్కూరి మల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం, తాను ఏడాది క్రితం పల్లికొండ రమేష్ వద్ద సర్వే నంబర్ 75/1 లో 2 ఎకరాల 30 గుంటలు కొనుగోలు చేశానన్నారు. నా భూమి పక్కన సర్వే నెంబర్ 76 లో మామిండ్ల సత్తయ్య అనే వ్యక్తికి భూమి ఉండగా, అతను సర్వే నెంబర్ 75 లోకి వచ్చి ఈ భూమి నాది అంటూ గొడవలకు కారణం అవుతున్నాడన్నారు. ఇప్పటికే సర్వేయర్ కొలతలు చేసి హద్దులు నిర్ణయించినట్లు తెలిపారు. అంతేకాకుండా భూమికి సంబంధించిన కోర్టు అనుమతి పత్రాలు కూడా తన వద్ద ఉన్నాయన్నారు. కానీ అవునూరి రాజయ్య అనే వ్యక్తి అనవసరంగా తన భూమి అక్కడ లేకపోయినప్పటికీ అక్కడికి తాను వచ్చినట్లు చెబుతూ, రాజయ్యను కులం పేరుతో దూషించినట్లు అట్రాసిటీ కేసు పెట్టడం అన్యాయమన్నారు. అంతేకాకుండా తన ట్రాక్టర్ ను గుంజుకుని, తన అనుచరుల మీద




దాడి చేసినట్లు తెలిపారు. తన డ్రైవర్ ను గోండు వ్యక్తి అని దూషించినట్లు వీడియోలు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. కక్ష పూరితంగా అట్రాసిటీ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయవద్దని, పోలీస్ అధికారుల విచారణలో నిజాలు బయట పడుతాయన్నారు. తప్పు చేసినట్లు రుజువు చేస్తే ఏ శిక్షకైనా సిద్ధమన్నారు. తనకు న్యాయం జరుగుతుందన్నారు. అన్నదమ్ములుగా ఉన్నవారిని కులం పేరుతో విడదీయవద్దని విజ్ఞప్తి చేశారు. అనంతరం పల్లికొండ రమేష్ మాట్లాడుతూ ఆ భూమిని 30 ఏళ్ల క్రితం కేతిరెడ్డి రాజిరెడ్డి దగ్గర తాము కొనుగోలు చేశామని, ఏడాది క్రితం ఆ భూమిని మిల్కూరి మల్లేష్ కు విక్రయించినట్లు తెలిపారు. గొడవ జరిగిన ప్రాంతంలో అసలు అవునూరి రాజయ్య అనే వ్యక్తి లేరని, అన్యాయంగా కేసులతో ఇబ్బందులు పెడుతున్నట్లు ఆరోపించారు. ఈ పాత్రికేయుల సమావేశంలో పల్లికొండ రంగమ్మ, సుధాకర్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా హజ్రత్ తాజొద్దీన్ బాబా జన్మదిన వేడుకలు



**గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** ఘనంగా 164 వ హజ్రత్ తాజోద్దీన్ బాబా జన్మదిన వేడుకలను 32 సంవత్సరాలుగా నిర్వహించిన మా తండ్రి కీర్తిశేషులు ఎన్ సురేందర్రావు మా తండ్రి ఆశీస్సులతో అదే పరంపరను కొనసాగిస్తూ గోదావరిఖని పట్టణంలోని హజ్రత్ తాజోద్దీన్ బాబా జన్మదిన వేడుకలు కాకతీయ నగర్ దర్బార్ నిర్వాహకులు నారదాసు సతీష్ రావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరిఖని చౌరస్తా వద్ద నిర్వాహకులు భక్తులతో కలిసి ప్రార్ధనలు చేసి చందల్ ఊరేగింపు చేశారు. పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులు మహిళల నృత్యాలతో లక్ష్మీ నగర్, అశోక్ నగర్, కాకతీయ నగర్ దర్బార్ వరకు ఊరేగింపు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం భక్తులకు అన్నదానం చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వేడుకలను మూడు రోజులపాటు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా మంగళవారం రోజు దర్బార్లో (కూల్) పుణ్య వచనం, భగవద్గీత పారాయణ, భజన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు నారదాసు సతీష్ రావు తెలిపారు.

# మున్సిపల్ పాలక వర్గానికి సన్మానం



**లక్షెట్టిపేట, జనవరి 27 (ది క్రైమ్ న్యూస్):** మున్సిపాలిటీ పాలకవర్గం చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల, కో- ఆప్షన్ సభ్యుల పదవీ కాలం పూర్తి అయిన సందర్భంగా సోమవారం ఆర్యవైశ్య భవనంలో పాలకవర్గ వీడ్కోలు అభినందన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పాల్గొని శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు మాట్లాడుతూ.. మున్సిపల్ పాలకవర్గం చేసిన అభివృద్ధి సేవలను కొనియాడారు. ఈ అభినందన సభలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్, వైస్ చైర్మన్, డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, గురువయ్య, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా వంతడుపుల సంపత్



**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెంకు చెందిన బిఆర్ఎస్ నాయకుడు వంతడుపుల సంపత్‌ను బిఆర్ఎస్ మానకొండూరు నియోజకవర్గ అధికార ప్రతినిధిగా నియమిస్తూ పార్టీ నేతలు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు సంపత్‌కు సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన తిమ్మాపూర్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు రావుల రమేష్, మాజీ ఎంపీపీ కేతిరెడ్డీ వనిత - దేవేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఇనుకొండ శైలజ జితేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఉల్లెంగుల ఏకనందం, పాశం అశోక్ రెడ్డిలకు వంతడుపుల సంపత్ కృతజ్ఞతలు తెలిపారు.

# లద్నాపూర్ గ్రామ భూనిర్వాసితులు వెంటనే ఖాళీ చేయాలి

## - రామగుండం-త్రీ ఏరియా ఎస్టేట్స్ విభాగాధిపతి కె.ఐలయ్య

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 27:** సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్-టు ప్రాజెక్ట్ విస్తరణ కొరకు రామగిరి మండలం లద్నాపూర్ గ్రామంలో 104 ఎకరాల భూసేకరణ పూర్తి కాగా, దీనికి సంబంధించి 2015 సంవత్సరంలో ఇచ్చిన అవార్డు ప్రకారం సంబంధిత భూ సేకరణ అధికారి ద్వారా భూనిర్వాసితులకు చెల్లించిన 90 కోట్ల రూపాయల పరిహారంతో పాటు, 2020 సంవత్సరంలో ఆర్ అండ్ ఆర్ చట్ట ప్రకారం రావాల్సిన 55 కోట్ల రూపాయలు, గృహ నిర్మాణయోగ్యమైన ప్లాట్లను కూడా వారికి కేటాయించడం జరిగిందని రామగుండం-త్రీ ఏరియా ఎస్టేట్స్ విభాగాధిపతి కె.ఐలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ప్రాజెక్ట్ విస్తరణ ప్రక్రియలో భాగంగా



చేపడుతున్న బ్లాస్టింగ్, తదితర పనుల వలన సమీపంలో ఉన్న గృహాలకు ప్రమాదం పొంచి ఉన్నందున, అంతేకాకుండా గత కొద్ది రోజుల క్రితం సంభవించిన భూప్రకంపనల వలన ఏర్పడిన పగుళ్లతో కూడా ప్రమాదం పొంచి ఉన్నందున సంబంధిత భూనిర్వాసితులు వెంటనే ఖాళీ చేయాల్సిందిగా వారు కోరారు.

# గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రవేశపెట్టింది

## - ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**గన్నేరువరం (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం పారువెల్లలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 10 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం శంకుస్థాపన చేశారు.అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా అన్నివర్గాల అభ్యున్నతికి వివిధ సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రవేశపెట్టిందని పథకాల ప్రయోజనాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యమై ప్రజలు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకై ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నదని గ్రామంలో చేపట్టిన రోడ్డు నిర్మాణం పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాల్సినద బాధ్యత సంబంధిత అధికారులదేనని ఎమ్మెల్యే కవ్వంపల్లి స్పష్టం చేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అల్లూరి



శ్రీనాథ్ రెడ్డి, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ డైరెక్టర్ అలువాల కోటి, పార్టీ నాయకులు చెక్కిల్ల తిరుపతి,మాతంగి అనిల్, సంగు దేవయ్య, రాంరెడ్డి, మాంకాలి మల్లికార్జున్, శ్రీకాంత్, ఈగ రాజయ్య, సంగు వేణు, బోడ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మంద కృష్ణ సేవలకు పద్మశ్రీ అవార్డు..!

## - మంద కృష్ణ చిత్ర పటానికి పాలాభిషేకం

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 27:** ఎం.ఆర్.పి. ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ సమాజ హితం కోసం చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేయడం హర్షణీయమని వక్తలు కొనియాడారు. కమాన్ పూర్ మండల కేంద్రంలో ఎం. ఆర్. పీ. ఎస్ మండల శాఖ అధ్యక్షులు కుక్క రవీందర్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద రాజ్యాంగ నిర్మాత డా, బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్బంగా వక్తలు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ తాను నమ్మిన సిద్దంతం కోసం ఎ. బీ. సీ. డీ వర్గీకరణ కోసం ఎం. ఆర్. పీ. ఎస్ ను ఏర్పాటు చేసి అలుపెరగని పోరాటం చేశారన్నారు. అలాగే సామాజిక అంశాల పైన, చిన్న పిల్లల గుండె ఆఫరేషన్, వికలాంగుల, వృద్దుల, వితంతుల పింఛన్ పెంపుదల కోసం పోరాటం చేశారన్నారు. సమాజ హితం కోసం మంద కృష్ణ చేసిన



పోరాటం ఫలితాంగానే కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేసిందన్నారు. పద్మ శ్రీ అవార్డు కు మంద కృష్ణ మాదిగ అన్ని విదాల అర్హుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కుక్క రవీందర్ ఆధ్వర్యంలో మాజీ ఎంపిపి మల్యాల రామచంద్ర గౌడ్, గడప కృష్ణమూర్తి, మచ్చగిరి రాము, మల్యాల తిరుపతి, బొమ్మగాని అనిల్ గౌడ్, నల్ల వెల్లి శంకర్, పిన్ రెడ్డి కిషన్ రెడ్డి, భూంపెల్లి రాజయ్య, పోతుల కుమార్, చిప్పకుర్తి శివ లింగం, మల్లారపు అరుణ్ కుమార్, జంగపెల్లి అజయ్, చాట్ల రాయామల్లు, కుక్క సతీష్, డబ్బేట సంతోష్, మట్ట నర్సయ్య, సయ్యద్ ఎక్బాల్, ఆకుల బాపు, చిప్పకుర్తి సతీష్, సుంచు శ్రీనివాస్, జంగపెల్లి శ్రీనివాస్, కుక్క మహేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల సమస్యల పరిష్కరించడానికి మీ ముందుకు వస్తున్న ఆశీర్వదించడి

## - ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు

**కరీంనగర్ టౌన్, జనవరి27(ది క్రైమ్ న్యూస్):** ఎమ్మెల్సీ ప్రచారంలో భాగంగా కరీంనగర్ లో వివిధ పాఠశాలలను తిరుగుతూ ఉపాధ్యాయులను కలసి తనను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మద్దతు ఇవ్వవలసిందిగ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు కోరారు. పట్టభద్రుల సమస్యలు తెలిసిన వాడిగా 22 సంవత్సరాలుగ ప్రజాసేవలో ఉన్నవాడిని ఒక్కసారి ఆలోచించి ఓటు వేయాలని కోరారు ఎమ్మెల్సీ ఎలక్షన్ వచ్చాయని ఇప్పుడు ఎంతో మంది వందల కోట్లు డబ్బులు ఖర్చుపెట్టి పెట్టి ముందుకు వస్తున్నారని అన్నారు నేను ఎప్పుడు ప్రజల్లో వుండే వాడినని ప్రజాసమస్యలపై పట్టభద్రుల సమస్యలపై పోరాడే దమ్ము ఉన్నవాడినని నాకు మీ మొదటి ప్రాధాన్యత ఓటువేసి అధికామెజారిటీతో గెలిపించాలని కోరారు.




# ప్రత్యేక అధికారిగా అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి...

**జమ్మికుంట జనవరి 27 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సోమవారం భాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా ముందడుగులో ఉన్న జమ్మికుంట మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుండే విధంగా తీర్చిదిద్దుతానని ఆయన అన్నారు. మున్సిపాలిటీ ఉన్న ప్రధాన సమస్యలపై దృష్టి సరిస్తామని ఆయన అన్నారు. ముందుగా ప్రత్యేక అధికారి ప్రాపుల్ దేశాయ్‌ని మున్సిపాలిటీ కమిషనర్ మహమ్మద్ అయాజ్ పుష్ప గుచ్చలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి రాజిరెడ్డి, ఎం ఏ ఈ నరేష్, టీపీఓ శ్రీధర్, భాస్కర్, వాణి తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



# నిరుపేద కుటుంబానికి సాయం



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 25:** రామగిరి మండలం బేగంపేటలోని కలువల శంకరయ్య కుటుంబానికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు దాసరి శివ ఇరవై ఐదు కేజీల బియ్యం నిత్యవసర వస్తువులను అందజేశారు. ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలోని ఎస్సీ కాలనీని సందర్శించగా శంకరయ్య అనారోగ్య పరిస్థితిని కాలనీవాసులు వివరించడంతో వారికి నిత్యవసర వస్తువులను అందజేసినట్లు దాసరి శివ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందుల సంజీవ్, ఊదరి కుమార్, గర్రెపల్లి ప్రశాంత్, మాతంగి కుమార్, రాజు, సంజీవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు రాజ్యం అచ్చేదేప్పుడు షార్ట్ ఫిలింను రిలీజ్ చేసిన మహా ఐ కంపెనీ సీఈఓ, ఎన్నారై చింతం నరేందర్



**కరీంనగర్ టౌన్, జనవరి27(ది క్రైమ్ న్యూస్):** బిజెపి రాష్ట్ర నాయకులు, తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు సొల్లు అజయ్ వర్మ నటించి , స్వీయ నిర్మాణంలో , అక్కన భాస్కర్ దర్శకత్వంలో రూపొందించిన రైతు రాజ్యం ఆచ్చేదేప్పుడు షార్ట్ ఫిలింను సోమవారం రోజున తిమ్మాపూర్ మండలం మక్తపల్లిలో మహా ఐ కంపెనీ సీఈఓ, ఎన్నారై చింతం నరేందర్ రిలీజ్ చేశారు. రైతుల కష్టనష్టాలు, నకిలీ విత్తనాలు, వ్యవస్థ దళారి వ్యవస్థ, రైతుల కన్నీళ్ల ఇతివృతంగా షార్ట్ ఫిలిం రూపొందించడం జరిగిందని నటుడు నిర్మాత సొల్లు అజయ్ వర్మ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకుడు అందేసురేష్, పెంట చంద్రయ్య, దోనపాటి అనిల్ రెడ్డి, రాగుల రమణారెడ్డి, పెంటసాగర్ భామండ్ల, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల డ్రైనేజీ నాణ్యత పై ఫిర్యాదు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 27:** కమాన్ పూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో 2023-24 సంవత్సరంలో ఉపాధి హామీ నిధులనుండి నిర్మించిన రోడ్డులపై, డ్రైనేజీలపై పంచాయతీ రాజ్ శాఖ డి.ఈ క్యూసి అధికారులకు కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మంథని డివిజన్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి యూసుఫ్ (లల్లు) ఫిర్యాదు చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టిన రెండు నెలలకే పూర్తిగా పాడైపోయిందని దీంతో ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. నాణ్యతలేని పనిపై క్యూ సి అధికారులు, పంచాయతీ అధికారులు పరిశీలించి పనిచేసిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదుగా పేర్కొన్నారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఇటుకల బట్టిలలోని విద్యార్థులకు బుక్కుల పంపిణీ





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి మండలంలోని గౌరెడ్డిపేట గ్రామ శివారులో గల ఇటుకల బట్టిలలో పనిచేస్తున్న ఒరిస్సా కార్మికుల పిల్లలకు తన స్నేహితుడి పుట్టినరోజు పురస్కరించుకొని డిప్లమా విద్యార్థి అభినవ్ నోట్ బుక్కులు ప్రధానం చేశారు. ఒరిస్సా కార్మికులు రాత్రి పగలు తేడా లేకుండా ఇటుకల బట్టిలలో పనిచేస్తూ తమ పిల్లలైనా ఉన్నత చదువులు చదివించాలని, పని ప్రదేశాలలోనే ఏర్పాటుచేసిన విద్యాలయంలో పిల్లలను చదివిస్తున్నారని వారికి నోట్ బుక్కులు పెన్నులు అందించడం సంతోషకరంగా ఉందని, ఒరిస్సా కార్మికుల పిల్లలు ఇటుకల బట్టిలోనే బందీ కాకుండా ఉన్నత చదువులు చదివి మంచి ప్రయోజకులు కావాలని అభినవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## పట్టణాన్ని పరిశుభ్రంగా వుంచడంలో

# పారిశుద్ధ్య కార్మికులే కీలకం

## - ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ధర్మపురి, జనవరి 27, (ది క్రైమ్ న్యూస్):** పట్టణాన్ని పరిశుభ్రంగా వుంచడంలో పారిశుద్ధ్య కార్మికులే కీలకం అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం ధర్మపురి మున్సిపాలిటీలో పనిచేసే సిబ్బందికి మరియు పారిశుద్ధ్య కార్మికులకు కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్లు జక్కు పద్మ రవీందర్, సంఘనబట్ల సంతోషి దినేష్, వేముల నాగలక్ష్మి రాజేష్, గరిగే అరుణ రమేష్ గార్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది మరియు పారిశుద్ధ్య కార్మికులను శాలువాతో సన్మానించి వారికి బట్టలు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందికి, పారిశుద్ధ్య కార్మికులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొనడం చాల సంతోషంగా ఉందని, పట్టణాన్ని పరిశుభ్రంగా వుంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని, ధర్మపురి మున్సిపాలిటీలో ఇటీవల సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి టియుఎఫ్ఐడిసి గ్రాంట్ కింద 15 కోట్ల రూపాయలను మంజూరు చేసి వాటికి శంకుస్థాపనలు చెసుకోవడం జరిగిందని తెలిపారు. వీలైనంత త్వరగా అట్టి పనులను కూడా పూర్తి చేయాలనీ అధికారులను కూడా ఆదేశించడం జరిగిందని, వచ్చే వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని, గత ప్రభుత్వ పాలకుల అనాలోచిత నిర్ణయాల వల్ల ధర్మపురి తలాపున గోదావరి ఉన్న ఇక్కడి ప్రాంత ప్రజలు త్రాగు నీటి విషయంలో





ఎంతగానో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందనీ పేర్కొన్నారు. ఎస్డీఎఫ్ గ్రాంట్ కింద 10 కోట్ల రూపాయలు మంజూరు చేస్తే అందులో 6 కోట్ల రూపాయలను కేవలం బోర్ వెల్స్ కే కేటాయించడం జరిగిందని, సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాబోయే రోజుల్లో నియోజకవర్గానికి సంబంధించి మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అదే విధంగా ధర్మపురి మున్సిపల్ పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడల్లో కూడా రాణిస్తూ ఉన్నతంగా ఎదగాలి

## - చెన్నాడి శ్రీధర్ రెడ్డి

**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం కాంగ్రెస్ నాయకులు చెన్నాడి శ్రీధర్ రెడ్డి బహుమతులు అందించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.... క్రీడలు విద్యార్థుల్లో ఉల్లాసాన్ని, మానోధైర్యాన్ని నింపడమే కాకుండా విద్యార్థుల్లో ఐక్యతా భావాన్ని పెంపోందిస్తాయని, కాబట్టి విద్యార్థులు చిన్న వయసు నుండే చదువుతో పాటు ఆసక్తిగల క్రీడల్లో రాణిస్తూ ఉన్నతంగా ఎదిగి తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులకు గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




# పద్మశ్రీ రావడం మాదిగ జాతికి గర్వకారణం..

## - మంతెన చిరంజీవి మాదిగ

**భూపాలపల్లి, జనవరి - 27: (ది క్రైమ్ న్యూస్):** కేంద్ర అత్యున్నత పురస్కరమైన పద్మశ్రీ అవార్డు ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ గారికి వరించడం యావత్తు మాదిగ జాతికే గర్వకారణమని కాటారం ఎమ్మార్పిఎస్ మండల అధ్యక్షుడు మంతెన చిరంజీవి మాదిగ అన్నారు. సోమవారం కాటారం మండలకేంద్రం లో మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు దక్కడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ ఎమ్మార్పిఎస్ శ్రేణులు, మాదిగ సోదరులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్ వద్ద బాణాసంచా కాల్చి స్వీట్లు తినిపించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కులం పేరు చెబితేనే సిగ్గుగా భావించే పరిస్థితి నుండీ నేను మాదిగను అని



గర్వంగా చెప్పుకునేలా చేసిన ఘనత మంద కృష్ణ మాదిగ గారిదేనని కొనియాడారు. కేవలం ఎమ్మార్పిఎస్ ఉద్యమాలే మాత్రమే కాకుండా ఆరోగ్య శ్రీ, ఫింఛన్లు పథకాల అమలుకై పోరుబాట సాగించాడని గుర్తుచేశారు. అదేవిధంగా తెలంగాణలో ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయడమే ధ్యేయంగా ఫిబ్రవరి 7 వ తేదీనా నిర్వహించే వేయి గొంతులు లక్ష డప్పుల కార్యక్రమానికై మండలంలోని మాదిగ జాతి ప్రజానీకం తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ వర్కింగ్ గద్దల మహేష్, ఉపాధ్యక్షుడు చీపెల్లి చిన్ని, కడారి విక్రం, రామిళ్ల కిరణ్, కోటపర్తి శ్రీనివాస్, కొండయ్య, రాజేంద్ర ప్రసాద్, రామిళ్ల రాజు,సునీల్, సమ్మయ్య, స్వామి, బొడ్డు పోశయ్య,పొట్ట రమేష్, బాపు తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుని మరణం జీర్ణించుకోలేక ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** స్నేహితుని మరణాన్ని జీర్ణించుకోలేక తోటి స్నేహితుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గోదావరిఖని మేదరబస్తీకి చెందిన సుల్వ శ్రీనాదీశ్వర్ (18) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సచ్‌దేవా కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న శ్రీనాదీశ్వర్ నెల క్రితం తన స్నేహితుడు ముక్క రోహక్ మృతి చెందడంతో అప్పటి నుంచి దిగులుతో బాధ పడుతున్నాడు. తన స్నేహితుని నెల మాషికానికి వెళ్లి వచ్చిన శ్రీనాదీశ్వర్ స్నేహితుడి మరణాన్ని జీర్ణించుకోలేక గుర్తు చేసుకుంటూ మనస్థాపంతో ఇంట్లో సోమవారం రాత్రి 2గంటల ప్రాంతంలో వంట గదిలో ఇనుప పైపుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



# పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 27:** పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సోమవారం టి.ఆర్.టి.యు నాయకులు మండల తహసిల్దార్ ముస్త్యా ల వాసంతికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ రద్దుచేసి ఓ పి ఎస్ (పాత పెన్షన్) అమలు చేయాలని ఆ వినతి పత్రంలో కోరారు.కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఏకీకృత పెన్షన్ స్కీమ్ ఓ.పి.ఎస్ అమలు చేయాలని నిర్దేశించిన సందర్భంలో మన రాష్ట్ర ప్రభుత్వం యుపిఎస్ వైపు వెళ్లకుండా సిపిఎస్ ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు భద్రత కల్పించాలని కోరుతూ టి.ఎస్పి.ఆర్టి.యు కమాన్ పూర్ మండల శాఖ ఆధ్వర్యంలో కమాన్ పూర్ తహసిల్దార్ వాసంతి కి భోజన విరామ సమయంలో వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు టి ఎస్ కమాన్ పూర్ మండల అధ్యక్షులు గసిగంటి రమేష్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు మేరుగు రాజమౌళి, మండల అసోసియేట్ అధ్యక్షులు సూది రెడ్డి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి సతీష్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మంద సతీష్ పాల్గొన్నారు.

## రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్



**ధర్మపురి, జనవరి 27, (ది క్రైమ్ న్యూస్):** రామలింగేశ్వర స్వామి వారిని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనార్థం వచ్చిన సందర్భంలో ముందుగా దేవస్థానం పక్షాన సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం అనుబంధ దేవాలయం అయిన శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానములో రుద్రాభిషేకం ప్రత్యేక పూజలు చేసిన పిదప ప్రదాన దేవాలయంలోగల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని అలాగే అనుబంధ దేవాలయంలో గల స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.తదనంతరం దేవస్థానం వేదపండితులు అర్చకులుఆశీర్వచనం ఇచ్చిన తదుపరి దేవస్థానం పక్షాన శ్రీ స్వామివారి శేష వస్త్రం ప్రసాదం ఇచ్చి సన్మానించడం జరిగింది. ఈకార్యక్రమంలోదేవస్థానంకార్యనిర్వహణాధికారిసంకటాలశ్రీనివాస్,వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు నంబి నరసింహ మూర్తి, విశ్వనాథ శర్మ, సాయికుమార్ సిబ్బంది అర్చకులు పాల్గొన్నారు.

## పోనగంటి రాముకు ఘన సన్మానం



**జమ్మికుంట జనవరి 27 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ పోనగంటి రాము కు వార్డు ప్రజలు మాజీ ప్రజాప్రతినిధులు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి కాంసెట్టి మల్లయ్య మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు కౌన్సిలర్ గా సేవలందించి ప్రజల మననలు పొందారాని వార్డు అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నాడని కొనియాడారు. తన వార్డులో ప్రతి గల్లీలో సిసి రోడ్లు,డ్రైనేజీలు, నిర్మించి, త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటింటికి నల్ల కలెక్షన్ ఇచ్చి సౌకర్యం కల్పించారు. మోత్కూలగూడెం గ్రామానికి సంబంధించిన వైకుంఠధామం వెళ్లడానికి గతంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారని దాన్ని దృష్టిలో పెట్టుకొని సిసి రోడ్డు నిర్మాణం కోసం 35 లక్షల రూపాయలు మున్సిపాలి నుండి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేపించుకొని సీసీ రోడ్డు వేసి ప్రజల సౌకర్యార్థం కోసం తీసుకొచ్చారని అన్నారు. ఐదు సంవత్సరాలుగా వార్డు ప్రజలకు ఎంతో సేవ చేశారాని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమం లో పొనగంటి కొమరయ్య, పొనగంటి శ్రీధర్, జెమిని సురేష్, సతీష్, సురేష్, రాజు, రాము, విష్ణువర్ధన్, వార్డులోని యువకులు ప్రజలు పాల్గొన్నారు.

## స్వామి వారికి అత్యంత వైభవంగా మహా లింగార్చన



**ధర్మపురి, జనవరి 27, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానమునకు అనుబంధ దేవాలయం అయిన శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానములో మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం వేదికపై రుద్ర నమకం చమకం, మన్య సూక్తం, లక్ష్మీ సూక్తం పురుష సూక్తం తో మహా లింగార్చన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. అనంతరం హారతి మంత్రపుష్పం తీర్థం ప్రసాదం వితరణ చేయటం జరిగిందని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ , స్థానిక వేదపండితులు పణతుల వెంకటరమణ శర్మ, మధు రామ శర్మ, పెండ్యాల రాజేష్ శర్మ, కాసర్ల వెంకటరమణ శర్మ, అర్చకులు విశ్వనాథ శర్మ, బొజ్జ రాజగోపాల్ శర్మ, సాయికుమార్ మరియు సిబ్బంది అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

# మత్స్య గిరీంద్రుని ఆలయాభివృద్ధికి నా వంతు కృషి చేస్తా

## - ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**శంకరపట్నం (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టులోని మత్స్యగిరీంద్ర స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభం స్వాగతం పలికి ఆశీర్వదించి తీర్థప్రసాదాలు ఇచ్చారు. అనంతరం ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని ప్రారంభించి, ఫిబ్రవరి నెలలో నిర్వహించే స్వామివారి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ...... శ్రీమహ విష్ణువు మత్స్య అవతారంలో మత్స్యగిరీంద్రునిగా వెలసిన ఏకైక ఆలయం కొత్తగట్టులో ఉండడం ఎంతో విషేయమని, ఇంత గొప్ప విశిష్టత కలిగిన ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. రానున్న బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొత్తగట్టు దేవస్థానం చైర్మన్ ఉప్పుగల మల్లారెడ్డి, మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, హుజురాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, దేవస్థానం ఈవో సుధాకర్, డైరెక్టర్లు గరిగె ప్రభాకర్, ఐలయ్య, శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు అజయ్ ఆలయ అర్చకులు, గ్రామస్థులు, పార్టీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# యువకుడిపై కేసు నమోదు



**ముత్తారం.జనవరి.27.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలం ఖమ్మంపల్లిలోని ఎస్సీ కాలనిలో వృద్ధురాలుపై యువకుడు దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది.ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మంథని సమ్మక్క, తన తల్లి మంథని రాజక్కతో కలిసి ఖమ్మంపల్లిలోని ఎస్సీ కాలనీలో కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు.తమ బంధువు అయినా మంథని వంశీ(25) అనే యువకుడు ఆదివారం రాత్రి సమయంలో మద్యం తీసుకోని వెళ్ళగా అందరు కలిసి సమ్మక్క ఇంటికి వద్ద మద్యం సేవించారు.మద్యం మత్తులో రాజక్క,సమ్మక్కను వంశీ దూషించుతూ,కర్రలతో కొట్టి కిందకు నెట్టి వేయడంతో గాయాలు అయ్యాయని,తరచూ ఇంటికి వచ్చి గొడవ చేస్తున్నాడని బాధితురాలు సోమవారం ముత్తారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై గోపతి నరేష్ కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపాడు.

## ఎంఈఓ పై తగిన చర్యలు తీసుకోవాలి

**ముత్తారం.జనవరి.27.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జరిగిన వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వం పై వ్యతిరేకంగా మాట్లాడిన ఎంఈఓ ఇరుగురాల ఓదేలు పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య జిల్లా విద్యాశాఖ అధికారికి సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వంపై వ్యతిరేఖంగా మాట్లాడిన ఎంఈఓ, (ప్రధానోపాధ్యాయుడు) ఓదేలును విధుల నుండి తొలగించాలని ఈ ఫిర్యాదులో కోరాడు.



# బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్లకు ఘన సన్మానం

## - రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో - బీఆర్ఎస్ దే గెలుపు: కట్టా కృష్ణార్జున రావు

**ఖమ్మం ఉమ్మడి జిల్లా, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్): జనవరి 27:** వైరా మున్సిపాలిటీ పాలకవర్గం పదవి కాలం ముగియ డంతో సోమవారం వైరాలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి అధ్యక్షతన వైరా వాసవి కళ్యాణ మండపము నందు బిఆర్ఎస్ మాజీ కౌన్సిలర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మాజీ కోఆప్షన్ సభ్యులు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్లు ఎదునూరి పద్మజ ,మాదినేని సునీత, దారెల్లి పవిత్ర కుమారి ,వనమా విశ్వేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు ,చల్లగుండ్ల నాగేశ్వరరావు ,తడికమల్ల నాగేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులు నూకల అన్నపూర్ణ ,అప్పం సురేష్ లకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా సన్మానం నిర్వహించి శాలువాలు కప్పారు. మరో ఇద్దరు కౌన్సిలర్లు లగడపాటి లక్ష్మీరాజ్యం తిరుపతి కుటుంబ సభ్యులతో దర్శనానికి వెళ్లారు, మరో కౌన్సిలర్ ధనికులు వేణు పనులు పై బయటికి వెళ్లడంతో ఉండటంతో వాళ్ళిద్దరూ హాజరు కాలేకపోయారు. ఈ సన్మాన కార్యక్రమం అనంతరం దిశా కమిటీ మాజీ సభ్యులు, మాజీ ఎంపీపీ కట్ట కృష్ణార్జున రావు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు సుదీర్ఘంగా ప్రజలకు సేవలు అందించారని మరోసారి ప్రజలకు సేవలు అందించేందుకు మాజీ కౌన్సిలర్లు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు .బిఆర్ఎస్ పాలనలో మున్సిపాలిటీకి పెద్ద ఎత్తున నిధులు వచ్చాయని అన్నారు, సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలమైన పాలకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై మంత్రులు కేటీఆర్ హరీష్ రావులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ప్రజలు ప్రతిదీ గమనిస్తున్నారని , సంవత్సరకాలంలోనే ప్రజా సమస్యలను పరిష్కరించలేక ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం కెసిఆర్ ని కెసిఆర్ పాలనను తిడుతు ప్రజలని మోసం చేస్తున్నారని విమర్శించారు, ఇప్పటికే ప్రజలు తప్పు చేసినాము కేసీఆర్ పాలనే బాగుందని అంటున్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలు చెబుతున్నారని చెప్పిన విషయాన్ని యాది చేసుకోవాలని సూచించారు .రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు భారీ విజయాన్ని సాధించడం ఖాయం అని ఆయన చెప్పారు. ప్రతి కార్యకర్త ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. మండల పార్టీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి జరిగిందని, కేసీఆర్ ఇచ్చిన మాటను నెరవేర్చారని, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయలేక బిఆర్ఎస్ పార్టీపై నిందలు మోపుతున్నారని అందులో నిజమేమిటో ప్రజలకు తెలుసు అని అన్నారు, వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి మున్సిపల్ శాఖ మంత్రిగా అప్పట్లో ఉన్న కేటీఆర్ 30 కోట్ల రూపాయల నిధులు కేటాయించారని ఆ 30 కోట్ల రూపాయల నిధులతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయన్న విషయాన్ని గుర్తు చేశారు, ఎవరో ఏదో తిడితేనో మాటలంటేనే భయపడే నాయకుడు కాదు కేసీఆర్ అని అన్నారు, ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు సక్కుబాయి ,కొత్త వెంకటేశ్వరరావు ,డాక్టర్ పెరుమాల కృష్ణమూర్తి, మోటపోతుల సురేష్, మాదినేని ప్రసాద్,దోంతేబోయన వెంకటేశ్వర్లు ,షేక్ లాల్ మహమ్మద్ ,కామినేని శ్రీనివాసరావు ,ఏదునూరి శ్రీనివాసరావు ,నూకల ప్రసాద్ ,నందిగామ మనోహర్,ఆ దూరి ప్రేమ్ కుమార్ ,గుజ్జర్లపూడి దేవరాజ్, తోటకూర వీరబాబు ,వజినేన పల్లి చక్రవర్తి ,చింతలపూడి వెంకటేశ్వరరావు, మిట్టపల్లి కిరణ్ కుమార్, నూకల వాసు,నుకల ప్రసాద్, రంగా సత్యనారాయణ ,విలాసాగరం నరేష్ ,మడిపల్లి కృష్ణ ,నల్లగొండ నాని ,మాదినేని లక్ష్మణ్ , నల్లమోతు లక్ష్మీనారాయణ, కొల్లా రాంబాబు ,రేచర్ల సైదులు, బత్తుల లింగారావు ,ఏలూరు నరసింహారావు యండ్రాతి గోపాలరావు, సింగవరపు నరేష్ తదితరులు పాల్గొన్నారు







# ప్రత్యేక అధికారిగా ప్రఫుల్ దేశాయ్



**హుజురాబాద్ జనవరి 27 (ది క్రైమ్ న్యూస్):** హుజురాబాద్ పురపాలక సంఘం ప్రత్యేక అధికారిగా కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఐఏఎస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘం కమిషనర్ సమ్మయ్య మేనేజర్ భూపాల్ రెడ్డి ఇతర ఉద్యోగులు ప్రత్యేక అధికారికి పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు.

# విద్యార్థుల అందరికీ అపార్ కార్డు తప్పనిసరి

## - ధర్మారం ఎం.ఈ.ఓ పోతు ప్రభాకర్



**ధర్మారం, జనవరి 27 (ది క్రైమ్ న్యూస్):** దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు ఇకపై ఆధార్ తరహాలో అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ - అపార్) గుర్తింపు కార్డు తప్పనిసరి అని ధర్మారం మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ అన్నారు. ధర్మారం మండలం నందిమేడారంలో గల బాలురు మరియు బాలికల గురుకుల పాఠశాలల్లో అపార్ జనరేషన్ కు సంబందించి నమోదుకు ప్రత్యేక క్యాంప్ఏర్పాటుచేసి అపార్ ఐ.డిజనరేషన్‌లో ఎదురయ్యే సమస్యలను ఎలా ఆదిగమించాలో సూచనలు ఇస్తూ అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రవేటు విద్యాసంస్థలు తమ తమ విద్యార్థులకు అపార్ ఐ.డి లను త్వరిత గతిన జనరేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని పిలుపునిచ్చారు.'వన్ నేషన్- వన్ ఐడీ' పేరుతో పన్నెండు అంకెలుండే ఈ కార్డులు ప్రతీ విద్యార్థికి అవసరమని అన్నారు. ఈకార్యక్రమంలోఆయాగురుకులాల ప్రిన్సిపల్స్ యుగేంద్ర లక్ష్మి,విద్యాసాగర్, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ కుమార స్వామి బోధన, భోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం జోన్ క్రీడాకారులకు ట్రాక్ సూట్స్ పంపిణీ

**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ పోటీలు కోసం కాళేశ్వరం జోన్ తరపున ప్రాతినిధ్యం వహించడం కోసం ఎంపికైన క్రీడాకారులకు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ట్రాక్ సూట్స్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రీడల్లో పాల్గొనే ప్రతి క్రీడాకారులు తప్పకుండా నేను మెడల్ సాధిస్తాననే అనే బలమైన నమ్మకం, పట్టుదలతో పోటీలలో పాల్గొనాలని సూచించారు. కాళేశ్వరం జోన్ తరుపున రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని అక్కడ కూడా కాళేశ్వరం జోన్‌కు అత్యధిక పతకాలు సాధించి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఎఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్ రావు, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, మల్లేశం, సంపత్ తదితరులున్నారు.



# ఈ ఒక్క పండులో తిరుగులేనన్ని లాభాలు..

## పోషకాల పవర్‌హౌస్.. తింటే ఆ వ్యాధులన్నీ పరార్..



అవకాడో ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది.. ఈ పండులో ఎన్నో ఔషధ గుణాలు, పోషకాలు దాగున్నాయి. అవకాడోలు సాధారణంగా సూపర్ మార్కెట్‌లలోనే ఎక్కువగా లభ్యమవుతాయి. అవకాడో తీపి, చేదు, వగరు రుచి కలిగి ఉంటుంది. దీనిని జ్యూస్‌లా చేసుకోని తాగడంతోపాటు.. కూరగాయలాగా వివిధ వంటకాల్లో ఉపయోగిస్తారు. ముఖ్యంగా సలాడ్‌లు,



శాండ్‌విచ్‌లు, టోస్ట్, స్మూతీస్, డిప్స్, డెజర్ట్‌లకు జోడిస్తారు. అంతేకాకుండా, అవకాడోలు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. అందుకే వీటిని తినాలని వైద్య నిపుణులు చెబుతుంటారు. అవకాడో తినడం వల్ల కలిగే ఆరు ఆరోగ్య ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు తెలుసుకోండి.. అవకాడో ప్రయోజనాలు.. గుండెను ఆరోగ్యవంతంగా ఉంచుతుంది.. అవకాడోలు మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులతో నిండి ఉన్నాయి. అదే రకమైన కొవ్వులు ఆలివ్ ఆయిల్‌లో ఉంటాయి. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడుతుంది. ఇది గుండె జబ్బులు, స్ట్రోక్, ఇతర దీర్ఘకాలిక పరిస్థితుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఫైబర్‌కు మంచి మూలం.. జీర్ణక్రియ ఆరోగ్యానికి ఫైబర్ చాలా అవసరం.. బరువు నిర్వహణకు తోడ్పడేలా ఎక్కువ కాలం నిండుగా అనుభూతి చెందడంలో మీకు సహాయపడుతుంది. అవోకాడోలు కరిగే, కరగని ఫైబర్ రెండింటికి అద్భుతమైన మూలం. ఇవి మీ జీర్ణవ్యవస్థను బాగా అమలు చేయడానికి కలిసి పని చేస్తాయి. విటమిన్లు-ఖనిజాలు అవోకాడోలు విటమిన్ సి, ఇ, కె, బి6, పొటాషియం, మెగ్నీషియం, ఫోలేట్‌తో సహా ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాల పవర్‌హౌస్. ఈ పోషకాలు గాయాలు నయం చేయడంలో, రోగనిరోధక వ్యవస్థ పనితీరు, ఎముకల ఆరోగ్యం వంటి విభిన్న శారీరక విధుల్లో కీలక పాత్ర పోషిస్తాయి. కంటి ఆరోగ్యాన్ని పెంచుతుంది. అవకాడోలు లుటిన్, జియాక్సంతిన్‌లను కలిగి ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యానికి ముఖ్యమైన రెండు కెరోటినాయిడ్లు. ఈ పోషకాలు వయస్సు-సంబంధిత మచ్చల క్షీణత, కంటిశుక్లం నుండి రక్షించడంలో సహాయపడతాయి. పేగు ఆరోగ్యానికి తోడ్పడుతుంది.. అవకాడోస్‌లోని ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు మొత్తం ఆరోగ్యానికి ముఖ్యమైన మంచి గట్ బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. ఒక ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్ ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు వంటి అనేక దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి పనిచేస్తుంది.. జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. అవకాడోలు అభిజ్ఞా పనితీరు, జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. మెదడు ఆరోగ్యానికి కీలకమైన ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు అధికంగా ఉండటం దీనికి కారణం కావచ్చు..

## మానవాళిపై పగబట్టిన వైరస్‌లు ..

### కరోనా కంటే వేగంగా విస్తరిస్తోన్న బర్డ్ ఫ్లూ.. ప్రమాదకరం అంటూ ఆందోళన



ప్రపంచవ్యాప్తంగా వివిధ రకాల వ్యాధులపై పరిశోధనలు కొనసాగు తున్నాయి. ఈ క్రమంలో తాజాగా బర్డ్ ఫ్లూపై కూడా ఓ పరిశోధన జరిగింది. పిట్స్‌బర్గ్‌లో బర్డ్ ఫ్లూపై పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు ఈ వ్యాధిని పెద్ద ముప్పుగా అభివర్ణించారు. రాబోయే కాలంలో ఈ వ్యాధి భారీ సంఖ్యలో ప్రజలకు సోకే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. బర్డ్ ఫ్లూ వైరస్ హెచ్5ఎన్1 చాలా వేగంగా విస్తరిస్తున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. దీంతో ఇప్పుడు పక్షులు, జంతువులకు కూడా వ్యాధి సోకుతోంది. ఈ వైరస్ ఇలాగే పెరుగుతూ ఉంటే రాబోయే కాలంలో కరోనా కంటే ప్రమాదకరమైన మహమ్మారి రూపం దాల్చవచ్చు. కోవిడ్ కంటే బర్డ్ ఫ్లూ 100 రెట్లు ఎక్కువ ప్రమాదకరం అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బర్డ్ ఫ్లూ గతంలో కంటే ఇప్పుడు చాలా వేగంగా విస్తరిస్తున్నందున శాస్త్రవేత్తలు ఈ భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలో కోళ్లలో మాత్రమే ఈ వ్యాధి ఎక్కువగా ఉండేది. అయితే ఇప్పుడు ఆవులు, పిల్లులు, మనుషులు కూడా దీని బారిన పడుతున్నారు. బర్డ్ ఫ్లూ ఇన్ఫెక్షన్ అమెరికాలో కోళ్లు, 337,000 కోడిపిల్లల్లో ఉన్నట్లు కనుగొన్నారు. దీంతో భారీ సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. తాజాగా అమెరికాలోని టెక్సాస్‌లోని ఓ డెయిరీ ఫామ్‌లో పనిచేస్తున్న వ్యక్తికి హెచ్5ఎన్1 వైరస్ సోకినట్లు తేలింది. ఈ కారణంగానే శాస్త్రవేత్తలు దీనిపై పరిశోధనలు చేయగా.. బర్డ్ ఫ్లూ వైరస్ లో అనేక రకాల మ్యుటేషన్లు జరుగుతున్నట్లు గుర్తించారు. ఇంతలో బర్డ్ ఫ్లూ కోవిడ్ కంటే పెను ముప్పుగా మారుతుందా.. భారతదేశంలో కొత్త అంటువ్యాధి రూపాన్ని తీసుకుంటుందా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. బర్డ్ ఫ్లూ అంటే ఏమిటి? రాజస్థాన్ వెటర్నరీ అండ్ యానిమల్ సైన్సెస్ యూనివర్శిటీకి చెందిన డాక్టర్ ఎన్ఆర్ రావత్ హెచ్5ఎన్1 ఇన్ఫ్లుఎంజా వైరస్ వల్ల బర్డ్ ఫ్లూ వస్తుందని వివరించారు. ఈ వైరస్ పక్షుల మధ్య వ్యాపిస్తుంది. వాటి శ్వాసనాళాలపై దాడి చేస్తుంది. ఈ కారణంగా పక్షులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతాయి. సరైన సమయంలో చికిత్సను అందించకపోతే అవి చనిపోతాయి. ఈ వైరస్ పక్షుల మలం, లాలాజలం ద్వారా ఒకదానికొకటి వ్యాపిస్తుంది. దీని ఇన్ఫెక్షన్ రేటు చాలా ఎక్కువగా ఉంది. కొద్ది రోజుల్లోనే ఈ వైరస్ లక్షలాది పక్షులకు సోకుతుంది. వాటి మరణానికి కారణమవుతుంది. బర్డ్ ఫ్లూ మనుషులకు ఎలా వ్యాపిస్తుంది? బర్డ్ ఫ్లూ సోకిన పక్షుల నుంచి మనుషులకు వ్యాపిస్తుందని డాక్టర్ రావత్ వివరించారు. పక్షుల చుట్టూ నివసించే, పౌల్ట్రీ ఫామ్‌లలో పనిచేసే వ్యక్తులు ఈ వ్యాధి బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. బర్డ్ ఫ్లూ పక్షి మలం పడిన ప్రాంతాల్లో తిరిగే మానవులకు వ్యాపిస్తుంది. దీని వల్ల దగ్గు, జలుబు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. కొన్ని సందర్భాల్లో ఇది న్యుమోనియాకు కూడా కారణం అవుతుంది. సకాలంలో చికిత్స చేయకపోతే, మరణం సంభవించవచ్చు. ఇది కోవిడ్ కంటే ప్రమాదకరమా? కోవిడ్ కంటే బర్డ్ ఫ్లూ చాలా ప్రమాదకరమని ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌లోని కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ హెచ్‌ఓడి డాక్టర్ జుగల్ కిషోర్ చెప్పారు. దీని కారణంగా మరణాల రేటు కోవిడ్ కంటే చాలా రెట్లు ఎక్కువ. అయితే బర్డ్ ఫ్లూ మానవ సంక్రమణ తక్కువగా ఉంటుంది. అంటే ఈ వైరస్ పక్షి నుంచి మనిషికి వ్యాపించినప్పటికీ.. ఇది ఒకరి నుంచి మరొకరికి సులభంగా వ్యాపించదు. అయితే కోవిడ్ చాలా త్వరగా సోకుతుంది. ఒక వ్యక్తికి బర్డ్ ఫ్లూ సోకినా అది మరొకరికి వ్యాపించే అవకాశాలు తక్కువ. అటువంటి పరిస్థితిలో, కోవిడ్ కంటే బర్డ్ ఫ్లూ పెద్ద అంటువ్యాధిగా మారే ప్రమాదం తక్కువ. డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ భారతదేశంలో బర్డ్ ఫ్లూ కేసులు నమోదు అవుతూనే ఉన్నాయి. ప్రతిసారీ ఈ వ్యాధి అదుపులోకి వస్తుంది. అటువంటి పరిస్థితిలో భయపడాల్సిన అవసరం లేదు. బర్డ్ ఫ్లూ చరిత్రలో మానవులలో దాని సంక్రమణ కేసులు చాలా తక్కువ. అటువంటి పరిస్థితిలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కానీ ప్రజలు ఈ వ్యాధి లక్షణాల గురించి తెలుసుకోవడం, దానిని నివారించడం చాలా ముఖ్యం. మానవుల్లో కనిపించే లక్షణాలు తలనొప్పిజి రివర్స్ కండరాల నొప్పి జ్వరం శ్వాసకోస ఇబ్బంది. బర్డ్ ఫ్లూకి ఏదైనా నివారణ ఉందా? బర్డ్ ఫ్లూకు తగిన మందు లేదని, కేవలం లక్షణాల ఆధారంగానే రోగికి చికిత్స అందిస్తున్నామని డాక్టర్ కిషోర్ చెప్పారు. అయితే బర్డ్ ఫ్లూ నివారణ సులభంగా చేయవచ్చు. దీని కోసం బర్డ్ ఫ్లూ సోకిన పక్షితో సంబంధం లేకుండా ఉండటం ముఖ్యం. పక్షి దగ్గరికి వెళ్లినా అతను కిట్ ధరించాలి. చికెన్ తింటుంటే బాగా ఉడికించాలి. క్రమం తప్పకుండా చేతులు కడుక్కోండి. ఫ్లూ లక్షణాలు కనిపిస్తే చికిత్స పొందండి.

## మధుమేహ వ్యాధిగ్రస్తులకు బెస్ట్ డ్రిక్స్ ఇవే.. ఆరోగ్యంతోపాటు హైడ్రేటెడ్‌గా ఉంచుతాయ్



ఏప్రిల్ నెల ప్రారంభం నుంచే ఎండ వేడిమి ప్రారంభమైంది. ఎండ వేడి నుంచి ఉపశమనం పొందడానికి వేసవిలో చల్లని పానియాల వైపు అందరూ మొగ్గు చూపుతారు. అందుకే శీతల పానీయాలు, పండ్ల రసాలను దుకాణాల్లో కొని తాగుతుంటారు. అయితే మధుమేహం వ్యాధిగ్రస్తులు మాత్రం వీటి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. వేసవిలో ద్రవపదార్థాలు ఎంత ఎక్కువగా తీసుకుంటే ఆరోగ్యానికి అంత మంచిది. కానీ మధుమేహ వ్యాధిగ్రస్తులు అన్ని రకాల పానీయాలు తీసుకోలేరు. ప్యాక్ చేసిన పండ్ల రసాలు, శీతల పానీయాలలో కృత్రిమ చక్కెర అధికంగా ఉంటుంది. ఇది చాలా హానికరం. మధుమేహ వ్యాధిగ్రస్తులు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచని పానీయాలు తీసుకోవాలి. వేడి రోజులలో శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచేందుకు మధుమేహ వ్యాధిగ్రస్తులు చక్కెర రహిత పానీయాలు తీసుకోవాలి. వేసవిలో శరీరాన్ని హైడ్రేట్ చేయడానికి, రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి తగినంత నీరు తాగాలి. మధుమేహ వ్యాధిగ్రస్తులు నిమ్మరసం తాగవచ్చు. నిమ్మరసంలో విటమిన్ సి ఉంటుంది. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులలో ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అయితే నిమ్మరసం మర్చిపోయి కూడా పంచదార కలపకూడదు. వేసవిలో క్యాన్ వాటర్ తాగాలి. డబ్ వాటర్‌లో ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. ఇవి శరీరంలో మినరల్ బ్యాలెన్స్‌ను నిర్వహించడానికి సహాయపడతాయి. బాటిల్ వాటర్ తాగడం వల్ల షుగర్ పెరిగే అవకాశం తక్కువ. మధుమేహ వ్యాధిగ్రస్తులు పుల్లని పెరుగు తినవచ్చు. ప్రోబయోటిక్స్‌తో లోడ్ చేయబడిన ఈ పానీయం ప్రేగుల సంరక్షణను ఉపయోగపడుతుంది. అలాగే షుగర్, ప్రెజర్, కొలెస్ట్రాల్‌ని అదుపులో ఉంచుతుంది. వేసవిలో ఉదయాన్నే కాకరకాయ రసాన్ని తాగాలి. ఈ కూరగాయల రసాలు రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడమే కాకుండా, బరువు తగ్గడానికి సహాయపడతాయి. అంతేకాకుండా ఈ డ్రింక్ శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచుతుంది.

## వెల్లుల్లి తింటే మగవారికి సూపర్ బెనిఫిట్స్

వెల్లుల్లి అందరి వంటిళ్లలో ఎప్పుడూ కనిపించేదే. అది లేకుండా ఏ కర్రీ చేయరు. వెల్లుల్లిలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని మనం తరచుగా వింటూ ఉంటాం. శరీరంలో కొలెస్ట్రాల్ క్లియర్ చేయడంలో వెల్లుల్లి బెస్ట్ అని చెబుతుంటారు. పచ్చి వెల్లుల్లిలో అల్లిసిన్ మన బాడీకి చాలా మేలు చేస్తుంది. మన పేగులో ఉండే మంచి బ్యాక్టీరియా పోషణకు ఇది చాలా అవసరమైనది. ఫాస్ఫరస్, జింక్, పొటాషియం, సల్ఫర్ కూడా వెల్లుల్లిలో లభిస్తాయి. అలానే వెల్లుల్లిలో యాంటీమైక్రోబయల్, యాంటీవైరల్, యాంటీఫంగల్ లక్షణాలు ఉంటాయి. పురీషనాళం, రొమ్ము, పెద్దపేగు, ప్రొస్టేట్ వంటి క్యాన్సర్లకు చెక్ పెట్టడంతో ఇది సాయపడుతుంది. అందుకే మీ ఆహారంలో వెల్లుల్లి ఉండేలా చూసుకోవడం కీలకం. వెల్లుల్లి జలుబుని నివారిస్తుందని చాలా అధ్యయనాల్లో స్పష్టమైంది. ఇన్ఫెక్షన్ల నివారణకు వెల్లుల్లి ఉపయోగపడుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో పచ్చి వెల్లుల్లి తిని, నీళుతాగితే హైబీపీ లక్షణాలు తగ్గుతాయట వెల్లుల్లిలోని సమ్మేళనాలు కాలేయంలోని చెడు పదార్థాలను బయటకు పంపుతాయి. వెల్లుల్లి మీ ఒత్తిడి స్థాయిలను తగ్గించడంలో ఉపయోగపడుతుంది. రక్తంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో వెల్లుల్లి సాయపడుతుంది. ఇమ్యూనిటీ పెరగడాలంటే ఉదయాన్నే పచ్చి వెల్లుల్లిని నమలడం మంచిది వెల్లుల్లి పురుషులలో శక్తిని పెంచుతుంది. వీర్యంలోని నాణ్యతను కూడా రక్షిస్తుంది. వెల్లుల్లిలోని అల్లిసిన్ లైంగిక అవయవాలకు రక్త ప్రవాహాన్ని మెరుగుపరచడంలో ఉపకరిస్తుంది.

## మిట్టపల్లి కిరణ్ కుమార్‌కు సన్మానం..!

**- ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించిన వైరా బి ఆర్ఎస్ శ్రేణులు..**



**ఖమ్మం ఉమ్మడి జిల్లా, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) జనవరి 27:** వైరా ఆర్యవైశ్య మండల అధ్యక్షులు మిట్టపల్లి కిరణ్ కుమార్‌కు వైరా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. వైరా వాసవి కళ్యాణ మండపంలో బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు పదవి కాలం పూర్తవటంతో వారిని ఘనంగా సన్మానించుకున్నారు.. ఈ సందర్భంగా ఇటీవల ఆర్యవైశ్య ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన యువకుడు మిట్టపల్లి కిరణ్ కుమార్‌కు ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించారు.. ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆర్యవైశ్య పెద్దలు వనమ విశ్వేశ్వరరావు ఆశీస్సులతో అత్యధిక మెజార్టీతో విజయం సాధించానని పేర్కొన్నారు.. నన్ను గుర్తించి నాపై నమ్మకంతో నా వెంటే ఉంటూ నన్ను సన్మానించడం ద్వారా నా బాధ్యతను మరింత గుర్తుచేసిన బి ఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైరా పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మద్దెల రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైరా పట్టణ, మండల బి ఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు..

## ఘోర రోడ్డు ప్రమాదం ఆర్టీసీ బస్సు, టాటా ట్రాలీ ఢీ

**- ప్రమాదంలో 11 మందికి తీవ్ర గాయాలు**



**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్ ):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని గూడూర్ అంబాల మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు టాటా ఏసీ ఢీకొట్టడంతో వాహనంలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు అందరూ హసన్‌పర్తి మండలంలోని మునిపల్లి, చింతగట్టు వాసులు కూలీ పనుల నిమిత్తం వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రమాదం జరిగింది.కమలాపూర్ మండలం వంగపల్లి గ్రామానికి కూలి పనుల కోసం వచ్చిన హసన్ పర్తి మండలం మునిపల్లి గ్రామానికి చెందిన 20 మంది కూలీలు పనిని ముగించుకుని వారి స్వగ్రామమైన మునిపల్లికి గ్రామానికి చెందిన టాటా ఏస్ 24 9122 నెంబర్ గల వాహనంలో వెళ్తుండగా గూడూరు - అంబాల గ్రామాల మార్గం మధ్యలో హనుమకొండ నుండి కమలాపూర్ వెళ్తున్న 29 1508 నెంబర్ గల ఆర్టీసీ బస్సును కూలీలతో వెళ్తున్న టాటా ఏసి ఎదురుగా వెళ్లి బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో మొత్తం 20 మంది కూలీలు ఉండగా 10 మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన జరిగిన ప్రదేశానికి సమీపంలో ఉన్న గూడూరు గ్రామానికి చెందిన కొంతమంది యువకులు యాక్సిడెంట్ జరిగిన విషయం తెలియడంతో వెంటనే అక్కడికి చేరుకొని గాయపడిన కూలీలను పైకి లేపి వారిని అంబులెన్స్ లో ఎక్కించి సామాజిక బాధ్యతతో వ్యవహరించారు. గాయపడిన వారందరినీ అంబులెన్స్ లో ఎంజిఎం ఆసుపత్రికి తరలించినట్లు కమలాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు.ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ హరికృష్ణ తెలిపారు.

## పరిహారం చెల్లిస్తే సంతోషంగా వెళ్తాం

**- ఎన్నో ఏండ్ల నిరీక్షణతో భాదితుల ఆవేదన**

**- తాము కోల్పోయిన నష్టపరిహారాన్ని తిరిగి చెల్లించండి**

**- మా భూములు కోల్పోయాం సింగరేణి అధికారులు సహకరించండి- మాజీ సర్పంచ్, పలువురు భాదితుల ఆవేదన**



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 27:** సింగరేణి యొక్క రామగుండం-త్రీ ఏరియాలోని లద్నాపూర్ గ్రామాన్ని బొగ్గు గనుల విస్తరణ ప్రాజెక్టు కోసం తమ భూములను త్యాగం చేసినప్పటికీ, పునరావాసం, (ఆర్ ఆర్) ప్యాకేజీ ప్రయోజనాలను తమకు ఇవ్వకుండా తమను బలవంతంగా గ్రామాల నుండి ఖాళీ చేయిస్తున్నారని బాధిత భూ నిర్వాసితులు లద్నాపూర్ మాజీ సర్పంచ్ బడికెల విజయ- బడికేల శ్రీనివాస్ లు ఆరోపించారు. లద్నాపూర్ గ్రామంలో తమ గృహాలకు నష్ట పరిహారం ఇవ్వడం లేదని సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్-టు ప్రాజెక్ట్ విస్తరణ కొరకు రామగిరి మండలం లద్నాపూర్ గ్రామాన్ని 2015 సంవత్సరంలో ఇచ్చిన అవార్డు లో సంబంధిత భూనిర్వాసితుల లిస్టులో చూడగా తన ఇల్లు మిస్ అయిందని తెలుసుకుని సింగరేణి అధికారులకు కూడా ఎన్నోసార్లు కలసి వివరించగా ఐదు సంవత్సరాలు మీరు సర్పంచ్ కదా మీ ఇల్లు ఏదో విధంగా చేద్దామని సింగరేణి మభ్య పెట్టడం జరిగిందని ఇప్పటివరకు కూడా వేచి చూసిన అయినా కూడా ఎవరు కూడా స్పందించలేదు. అప్పటినుండి ఇప్పటివరకు అధికారుల దగ్గరికి, ఆర్డిఓ, జెసి, కలెక్టర్ ని సింగరేణి అధికారులకు కూడా ఎన్నోసార్లు అప్లికేషన్ పెట్టిన ఎవరూ పట్టించుకోలేదన్నారు.ఈ క్రమంలో తన గృహంతో పాటు మరో ఎనిమిది మంది గృహాలకు నష్టపరిహారం చెల్లించకుండా, డోజర్లతో కూలగొట్టడనికి జీఎం నరేంద్ర.సుధాకర్ రావు ప్రయత్నాలు చేస్తున్నాడని వారు ఆరోపించారు. బ్లాస్టింగ్ 100 మీటర్ల దూరంలో ఉందని హెవీ బ్లాస్టింగ్ పెట్టడం వల్ల నా ఇంటి పై నుండి బండలు, డస్టు ఇవన్నీ రావడం జరుగుతుందని క్వారీ దగ్గరకు వచ్చిందని, సింగరేణి బ్లాస్టింగ్ తో తమకు ప్రాణా హాని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మా ఇండ్ల చుట్టూ డోజర్లు తిరగడం, మరోపక్క బ్లాస్టింగ్ లు , రాత్రి వేళలో పాములు, క్రిమి కీటకాలతో తాము పోరాడుతున్నామని బాధితులందరూ ఆరోపించారు. భూ సేకరణలో డీ.డీ, డీ.ఎన్ సమయంలో తమ గృహాలు ఉన్నట్లు వీడియోలు ఉన్నాయని వాటిని పరిగణలోకి తీసుకోమని నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.మాకు న్యాయం జరిగేలా మరలా వెరిఫికేషన్ చేసి నష్టపరిహారం ఇచ్చినట్లయితే మేము వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్నాం అన్నారు.సింగరేణి ఆర్.జి-త్రీ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నామని వారు తెలిపారు. తమగోడు వినేవారు లేరని ఆరోపించారు. తమకు నష్టపరిహారం చెల్లించే వరకు పోరాటం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీలు రొడ్డ శ్రీనివాస్, మెడగొని ఉమా రాజన్న, రామిల్ల దుర్గయ్య, మాజీ సర్పంచ్ పెద్దపల్లి శ్రీనివాస్, పుల్లెల సంజీవ్, పర్శవేన శంకర్, చిప్ప సతీష్, గొల్లపల్లి నరేష్ పాల్గొన్నారు.

# రైల్వే శాఖ షాకింగ్ నిర్ణయం..

## రూ. 30వేల కోట్ల వందేభారత్ రైళ్ల టెండర్ రద్దు..



దేశంలో ప్రముఖ రవాణా సాధనమైన రైల్వేను మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దానిలో భాగంగా నూతనంగా వందేభారత్ రైళ్లను నడుపుతోంది. వీటిని మరింత గా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది. దీనిలో భాగంగా వంద వందే భారత్ రైళ్ల తయారీకి ఆల్‌స్టోమ్ ఇండియా కంపెనీతో గతంలో ఒప్పదం కుదుర్చుకుంది. కానీ ఈ 30 వేల కోట్ల టెండర్ ను ఇటీవల భారతీయ రైల్వే రద్దు చేసుకుంది. ఈ నిర్ణయం వెనుక అనేక కారణాలు ఉన్నాయి. ఒక్కో రైలుకు రూ.150.9 కోట్ల బిడ్.. వందే భారత్ రైళ్ల కోసం 2023 మే 30వ తేదీన తెరిచిన టెండర్లలో ఆల్‌స్టోమ్ కంపెనీ అత్యల్ప బిడ్డర్ గా నిలిచింది. ఈ కంపెనీ ఒక్కో రైలు తయారీకి రూ.150.9 కోట్ల బిడ్ వేసింది. అయితే ఈ ధర ఎక్కువగా ఉందని రూ.140 కోట్లకు తగ్గించుకోవాలని రైల్వే కోరింది. కానీ రూ.145 కోట్లకు ఒప్పందం కుదుర్చుకోవాలని ఆ కంపెనీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ధర ఎక్కువగా ఉండడంతో రైల్వే ఈ రూ. 30 వేల కోట్ల టెండర్ ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. వంద వందే భారత్ అల్యూమినియం బాడీ రైళ్ల తయారీతో పాటు నిర్వహణ కోసం ఈ టెండర్ ను వేశారు. రద్దు విషయం నిజమే.. భారతీయ రైల్వే టెండర్ ను రద్దు చేసుకున్న విషయాన్ని ఆల్‌స్టోమ్ ఎండీ ఒలివియర్ లోయిసన్ ధ్రువీకరించారు. ఆర్డర్‌ను రద్దు చేసినప్పటికీ భవిష్యత్తులో అవసరమైతే మద్దతు ఇవ్వడానికి తమ కంపెనీ సిద్ధంగా ఉందని తెలిపారు. ఒక్కో రైలుకు ఈ కంపెనీ వేసిన రూ.150.9 కోట్ల ధర ఎక్కువగా ఉందని రైల్వే టెండర్ ప్యానెల్ గుర్తించింది. దాన్ని రూ. 140 కోట్లకు పరిమితం చేయాలని కోరింది. అయితే ఒక్కో రైలు సెట్‌కు రూ.145 కోట్లతో ఒప్పందం కుదుర్చుకోవాలని ఆల్ స్టోమ్ భావించింది. రైల్వే తెరిచిన రూ. 30వేల కోట్ల టెండర్‌కు వీరిదే అత్యల్ప బిడ్. మరో బిడ్ అయిన స్విస్ తయారీదారు స్టాడ్లర్ రైల్, హైదరాబాద్‌కు చెందిన మేధా సర్వో డ్రైవ్‌లతో కూడిన కన్సార్టియం ఒక్కో రైలు సెట్‌కు రూ. 170 కోట్ల బిడ్ వేసింది. గతంలో ఇలా.. గతంలో 200 వందే భారత్ స్లీపర్ ట్రైన్ సెట్‌ల తయారీకి ఒక రేక్‌కు రూ. 120 చొప్పున గతంలో కాంట్రాక్ట్ మంజూరు చేసినట్లు రైల్వే అధికారి తెలిపారు. ప్రస్తుతం ఉన్న బిడ్ లో ఈ ధర ఎక్కువగా ఉందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరోసారి టెండర్ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. దీని కోసం కొన్ని నిబంధనలను సవరించనున్నారు. గతంలో మాదిరిగా కేవలం రెండు కంపెనీలే కాకుండా ఈసారి ఎక్కువ కంపెనీలు పాల్గొనేలా చర్యలు తీసుకుంటారని సమాచారం. అర్హతలు.. టెండర్ కు వచ్చే కంపెనీలకు కొన్ని అర్హతలు ఉండాలి. అవి ఏడాదికి కనీసం ఐదు రైలుసెట్లను తయారు చేయగలిగే సామర్థ్యం కలిగి ఉండాలి. ఇందుకోసం వాటికి పరిశోధన మరియు అభివృద్ధి సౌకర్యం అవసరం. రైల్వే క్లాంట్రాక్ట్ ప్రకారం.. ఏడు సంవత్సరాలలోపు వంద రైలు సెట్టు డెలివరీ చేయాలి. గెలిచిన బిడ్డర్ డెలివరీ తర్వాత రూ.13 వేల కోట్లు అందుకుంటారు. ఆ తర్వాత 35 ఏళ్ల పాటు నిర్వహణ కోసం అదనపు రూ.17 వేల కోట్లు అందిస్తారు. హర్యానాలోని సోనేపట్ లో ఈ రైళ్లను తయారు చేయాలి.

# ఆ బ్యాంకుల్లో లోన్లు తీసుకున్న వారికి షాక్!



మరింత భారం కానున్న ఈఎంఐ.. పూర్తి వివరాలు.. మన దేశంలో వివిధ రుణాలపై వడ్డీ రేట్లు పెరగనున్నాయి. బ్యాంకులు ఈ మేరకు తమ రేట్లను సవరించాయి. దేశంలోని ప్రముఖ బ్యాంకులు అయిన బ్యాంక్ ఆఫ్ బరోడా, యూకో బ్యాక్, కెనరా బ్యాంక్ వంటివి ఇప్పటికే తమ బ్యాంకుల్లో మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లు(ఎంసీఎల్‌ఆర్)ను పెంచుతున్నట్లు ప్రకటించాయి. ఆగస్టు 12 నుంచి ఈ సవరించిన రేట్లు అమలులోకి వచ్చాయి. ఇప్పటికే ప్రముఖ బ్యాంకింగ్ దిగ్గజమైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)తో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు ఎంసీఎల్‌ఆర్ ను పెంచాయి. ఈ క్రమంలో రుణ గ్రహీతలపై భారం ఎలా ఉంటుంది? ఏ బ్యాంకు ఎంత మేర ఎంసీఎల్‌ఆర్‌ను పెంచింది? తెలుసుకుందాం రండి.. కారణం ఇదే.. ఆగస్టు 8న జరిగిన సమావేశంలో ఆర్‌బీఐ మానిటరీ పాలసీ నేపథ్యంలో రెపో రేటును 6.50 శాతం వద్ద కొనసాగించింది. దానిలో ఎటువంటి మార్పు చేయలేదు. దీంతో బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) , కెనరా బ్యాంక్, యూకో బ్యాంక్లు ఎంసీఎల్‌ఆర్ ను పెంచుతున్నట్లు గత శుక్రవారం ప్రకటించాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా.. ఆగస్టు 12 నుంచి అమలులోకి వచ్చేటటువంటి నిర్దిష్ట అవధులపై 5 బేసిస్ పాయింట్ల మేర ఎంసీఎల్‌ఆర్ పెంచాలని బీఓబీ నిర్ణయించింది. ఈ పెరుగుదల తర్వాత ఎంసీఎల్‌ఆర్ రేటు ఆరునెలలకు 8.75 శాతం, ఒక సంవత్సరానికి 8.95 శాతం ఉంటుంది. కెనరా బ్యాంక్.. ఈ బ్యాంక్ కూడా తన ఎంసీఎల్‌ఆర్ ను ఆగస్టు 12 నుంచి 5 బేసిస్ పాయింట్లు పెంచాలని నిర్ణయించింది. ఈ పెరుగుదల తరువాత.. ఆరు నెలల ఎంసీఎల్‌ఆర్ 8.80, ఒక సంవత్సరానికి 9 శాతం అవుతుంది. యూకో బ్యాంక్.. దీనిలో కొత్త రేట్లు ఆగస్టు 10 నుంచి అమలులోకి వచ్చాయి. నిర్దిష్ట కాలపరిమితిపై 5 బేసిస్ పాయింట్ల మేర ఎంసీఎల్‌ఆర్ ను పెంచాలని బ్యాంక్ నిర్ణయించింది. సవరించిన ఆరు నెలల, ఒక సంవత్సరం ఎంసీఎల్‌ఆర్ వరుసగా 8.80 శాతం, 8.95 శాతంగా ఉంది. ఫ్లోటింగ్ రేట్ ఉన్న వారికి.. ఇప్పటికే రుణాలు కలిగి ఉన్న వారిపై ఈ చర్య కారణంగా ఈఎంఐ భారం పెరగనుంది. అయితే ఫిక్స్ డ్ వడ్డీ ఉంటే ఎలాంటి ఇబ్బంది లేదు. అయితే ఫ్లోటింగ్ రేట్ ఆఫ్ ఇంటరెస్ట్ పై లోన్ తీసుకున్న వారిపై ఈ భారం పడనుంది. ఈ బ్యాంకులు ఇప్పటికే.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గత నెలలోనే ఎంసీఎల్‌ఆర్ రేటును 5-10 బేసిస్ పాయింట్లు పెంచింది. దీనిలో ప్రస్తుతం ఆరు నెలల ఎంసీఎల్‌ఆర్ 8.75 శాతం, ఏడాదికి 8.85 శాతం వద్ద ఉన్నాయి. ఈ నెల ప్రారంభంలో, పంజాబ్ నేషనల్ బ్యాంక్ కూడా తన ఎంసీఎల్‌ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెంచింది. ప్రస్తుతం ఆరు నెలల ఎంసీఎల్‌ఆర్ 8.75 శాతం, ఏడాదికి 8.90 శాతంగా ఉంది. అలాగే బ్యాంక్ ఆఫ్ ఇండియా తన ఒక సంవత్సరం ఎంసీఎల్‌ఆర్ ని ఆగస్టు 1 నుంచి 5 బేసిస్ పాయింట్లు పెంచి 8.95 శాతానికి పెంచింది. ఇండియన్ బ్యాంక్ తన ఓవర్‌నైట్ తో పాటు ఒక నెల ఎంసీఎల్‌ఆర్ ని ఒక్కొక్కటి 5 బేసిస్ పాయింట్లు పెంచి వరుసగా 8.20 శాతం, 8.45 శాతానికి పెంచింది. ఇవి ఆగస్ట్ 3 నుంచి అమలులోకి వచ్చాయి.

# నెలకు రూ. 1లక్ష పెన్షన్ కావాలా? ఇలా చేస్తే.. సాధ్యమే..



మన దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన పెన్షన్ పథకాలలో నేషనల్ పెన్షన్ సిస్టమ్(ఎన్‌పీఎస్) ఒకటి. దీనిలోని ఫీచర్లు, ప్రయోజనాలు అందరినీ ఆకర్షిస్తాయి. వాస్తవానికి ఇది ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రారంభించిన పథకం. అయితే ఆ తర్వాత ఇది వేగంగా అప్ డేట్ అవుతూ విస్తరించింది. ఈ పథకాన్ని 2004లో ప్రవేశపెట్టారు. ఎస్పీఎస్ సాయిధ దళాల్లోని వారిని మినహాయించి, మిగిలిన ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. ఆ తర్వాత 2009 మేలో భారత పౌరులందరికీ అందుబాటులోకి వచ్చింది. ఈ పథకంలో 18ఏళ్లు నిండి 70 ఏళ్ల మధ్య ఉన్న వారు ఎవరైనా పెట్టుబడులు పెట్టొచ్చు. భవిష్యత్తును సురక్షితంగా ఉంచుకునేందుకు ఇది విలువైన ఎంపికగా పనిచేస్తుంది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్డీఏ) నియంత్రణలో ఈ ఎన్‌పీఎస్ పనిచేస్తుంది. ఇది మార్కెట్-లింక్డ్ డిఫైన్డ్ కాంట్రిబ్యూషన్ స్కీమ్. పదవీ విరమణ తర్వాత సాధారణ ఆదాయాన్ని అందించే కార్పస్ ను నిర్మిస్తుంది. ఇప్పుడు ఈ పథకంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా రూ. లక్ష నెలవారీ పెన్షన్ పొందే అవకాశం కూడా ఉంది. అది సాధ్యమా అంటే.. అవుననే చెబుతున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో ఎన్‌పీఎస్ ద్వారా నెలకు రూ. లక్ష పెన్షన్ రావాలంటే ఎంత పెట్టుబడి పెట్టాలి? ఎన్ని సంవత్సరాలు పెట్టాలి? వంటి పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.. రూ. 1 లక్ష నెలవారీ పెన్షన్ రావాలంటే.. మీరు పదవీ విరమణ చేసిన తర్వాత మీ ఎన్‌పీఎస్ పెట్టుబడుల నుంచి నెలవారీ రూ. 1 లక్ష పెన్షన్ పొందాలనుకుంటే కొన్ని అంశాలు ప్రాథమికంగా గుర్తుంచుకోవాలి. అవేంటంటే.. మీరు పెట్టుబడి ప్రారంభించే వయసు, ప్రతి ఏటా పెట్టుబడి పెంచుకుంటూ వెళ్లే ప్రణాళిక ఉండాలి. అప్పుడే మీకు అంది సాధ్యమవుతుంది. ఉదాహరణకు 35 ఏళ్ల వయస్సులో ఎన్‌పీఎస్ ప్రారంభించి, 60 ఏళ్ల వయసులో పదవీ విరమణ పొందుతారు అనుకుందాం.. ఆ సమయానికి మీకు రూ. లక్ష పెన్షన్ రావాలంటే.. మీ పెట్టుబడులు వార్షికంగా 10 శాతం పెంచుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. అప్పుడే మీ లక్ష్యాలను చేరుకోగలుగుతారు. మీరు 6 శాతం వార్షిక రాబడితో యాన్యుటీని కొనుగోలు చేయడానికి మీ మొత్తం కార్పస్లో 60 శాతాన్ని ఉపయోగిస్తే, మీరు నెలకు రూ. 17,000 కంట్రీబ్యూషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అదే సమయంలో మీరు యాన్యుటీ కోసం మీ కార్పస్లో 40 శాతాన్ని ఉపయోగిస్తే, మీరు నెలకు రూ. 34,000 విరాళంగా ఇవ్వాలి. ఈ రెండు రెండు సందర్భాల్లోనూ మీరు పదవీ విరమణ తర్వాత నెలవారీ రూ. 1 లక్ష పెన్షన్ పొందుతారు. నేషనల్ పెన్షన్ సిస్టమ్ వల్ల ప్రయోజనాలు.. నేషనల్ పెన్షన్ సిస్టమ్(ఎన్‌పీఎస్) అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో ప్రధానమైనది పన్ను ప్రయోజనాలు. అలాగే పదవీ విరమణ కోసం క్రమపద్ధతిలో ఆదా చేసే సామర్థ్యం. క్రమశిక్షణతో కూడిన పొదుపులను ప్రోత్సహించడం ద్వారా, ఇది వ్యక్తులు ఆర్థికంగా సురక్షితమైన పదవీ విరమణ కోసం ప్లాన్ చేయడంలో సహాయపడుతుంది.

## పదిన్నర నిమిషాల్లోనే 80శాతం చార్జింగ్.. టెస్లాను బీట్ చేసిన చైనా ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ..



విద్యుత్ శ్రేణి వాహనాల వల్ల వినియోగదారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య చార్జింగ్ సమయం. ఇదే చాలా మందిని వాటివైపు చూడకుండా చేస్తోంది. సాధారణ పెట్రోల్, డీజిల్ ఇంజిన్ కార్లు ఎక్కడైనా నిమిషాల్లో రీఫ్యూలింగ్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే ఎలక్ట్రిక్ వాహనాలకు మాత్రం కొన్ని గంటల సమయం రీచార్జ్ కోసం తీసుకుంటాయి. దీనివల్ల వాటిని ఎక్కువ దూరాలకు వినియోగించలేని పరిస్థితి ఏర్పడుతోంది. దీనిపైనే ఫోకస్ పెట్టిన ప్రధాన ఎలక్ట్రిక్ వాహన తయారీ దారులు పలు వినూత్న ఆవిష్కరణలను పరిచయం చేస్తున్నాయి. వీటిల్లో ప్రపంచ ఎలక్ట్రిక్ వాహన దిగ్గజం టెస్లాతో పాటు చైనాకు చెందిన బీవైడీ కూడా ఉన్నాయి. ఇప్పుడు ఈ రెండింటినీ కూడా తలదన్నే రీతిలో ఓ కొత్త బ్యాటరీని ఆవిష్కరించింది చైనాకు చెందిన జీక్ర్ సంస్థ. తాము తీసుకొచ్చిన ఈ బ్యాటరీలు 10శాతం నుంచి 80శాతం చార్జింగ్ కావడానికి కేవలం పదిన్నర నిమిషాలే తీసుకుంటుందని వెల్లడించింది. ఇదే సమయంలో ప్రపంచ ఎలక్ట్రిక్ వాహన దిగ్గజం టెస్లాకు చెందిన లేటెస్ట్ ఇన్వెన్షన్ మోడల్-3లో వినియోగంచే బ్యాటరీ ఇదే చార్జింగ్ చేయడానికి 15 నిమిషాలు పడుతుందని వివరించింది. ఈ బ్యాటరీ రేంజ్ 282 కిలోమీటర్లు ఉంటుందని పేర్కొంది. మైనస్ 10 డిగ్రీల ఉష్ణోగ్రతలోనూ ఈ బ్యాటరీలు మంచి పనితీరును అందిస్తాయని వివరించింది. దీనిని బట్టి తమ బ్యాటరీని ఎలాన్ మస్క్ టెస్లా కన్నా మెరుగైనదిగా కంపెనీ క్లయిమ్ చేసుకుందది. వచ్చే వారం కొత్త కారు.. చైనాకు చెందిన జీక్ర్ నుంచి కొత్త సెడాన్ వచ్చే వారం లాంచ్ కానుంది. 2025 జీక్ర్ 007 పేరుతో అందుబాటులోకి రానుంది. ఈ సెడాన్ లోనే జీక్ర్ రూపొందించిన అడ్వాన్స్ డ్ బ్యాటరీని అమర్చినట్లు చెబుతున్నారు. ఈ సందర్భంగా సినో ఆటో ఇన్ సైట్స్ డైరెక్టర్ టూ లీ మాట్లాడుతూ విద్యుత్ శ్రేణి వాహనాల మార్కెట్లో ఇక టెస్లా చార్జింగ్ టెక్నాలజీ బీట్ చేస్తూ కొత్త సాంకేతికతను జీక్ర్ రూపొందించిందన్నారు. జీక్ర్ క్లయిమ్ చేస్తున్న విషయాలు అద్భుతమనే చెప్పాలి. ఇది తప్పనిసరిగా ప్రపంచంలోనే వేగవంతమైన చార్జింగ్ టెక్నాలజీల్లో ఒకటిగా నిలుస్తుందని చెప్పుకొచ్చారు. జీక్ర్ సంస్థ ప్రస్థానం.. చైనా కార్ల తయారీలో దిగ్గజంగా పేరున్న గీలీకి చెందిన సంస్థే ఈ జీక్ర్ ఇంటెలిజెంట్ టెక్నాలజీ హోల్డింగ్ లిమిటెడ్, యూకేకు చెందిన లోటస్, స్వీడన్ కుచెందిన వోల్వో కూడా ఈ గ్రూపులోని సంస్థలే. దీనిని బట్టి జీక్ర్ రేంజ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ జీక్ర్ సంస్థకు చైనాలోనే 500 అల్ట్రా ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ సంఖ్యను ఏడాది చివరి నాటికి రెట్టింపు చేసే లక్ష్యంతో జీక్ర్ పనిచేస్తోంది. 2026 నాటికి చైనా మొత్తంలో 10,000 చార్జింగ్ స్టేషన్లు అందుబబాటులో ఉంచుకునేలా కార్యాచరణను రూపొందించింది.

# వ్యాపారం

## ఒక్క రూపాయి కట్టకుండానే రూ.7 లక్షల వరకు ఇన్సూరెన్స్ ..



భారతదేశంలోని ప్రతి ఉద్యోగికి ఉద్యోగుల భవిష్య నిధి పథకం కింద నెలవారీ జీతం నుండి కొంత మొత్తం తీసివేయబడుతుంది. నెలవారీ తగ్గింపులు ఉద్యోగి పీఎఫ్ ఖాతాకు జమ అవుతుంది. ఈ డబ్బును ఉద్యోగులు తమ అవసరాలకు వినియోగించుకోవచ్చు. బహుశా ఉద్యోగి తన పని జీవితమంతా పీఎఫ్ ఖాతా నుండి డబ్బు తీసుకోకపోతే అతను పదవీ విరమణ తర్వాత కూడా పెన్షన్ పొందవచ్చు. ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో అత్యంత ముఖ్యమైన పథకం ఎంప్లాయిస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్. ఎంత బీమా కవరేజీ అందించబడింది. ఈ ప్లాన్ ప్రత్యేకతలు ఏమిటి? పూర్తి వివరాలు తెలుసుకుందాం. ఈపీఎఫ్‌వో ఈడీఎల్ఐ బీమా పథకం ప్రత్యేకతలు: ఉద్యోగుల భవిష్య నిధి పథకంలో సభ్యులకు రూ.7 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. దీని ప్రకారం, ఈ పథకం కింద సభ్యులు బీమాను పొందేందుకు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రాథమిక వేతనం రూ.15,000 కంటే ఎక్కువ ఉన్న వారికి గరిష్టంగా రూ.6 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. గత 12 నెలల ఈపీఎఫ్ సభ్యుల సగటు నెలసరి జీతం కంటే బీమా మొత్తం 35 రెట్లు ఎక్కువ. అంటే గరిష్టంగా రూ.7 లక్షల వరకు బీమా అందుతుంది. ఈ పథకంలో రూ.1,15,000గా ఉన్న బోనస్ మొత్తాన్ని గత ఏప్రిల్ నుంచి రూ.1,75,000కు పెంచడం గమనార్హం. బీమాను ఎలా క్లెయిమ్ చేయాలి? సభ్యుడు అకాల మరణం సంభవించినట్లయితే, అతని నామినీ లేదా చట్టపరమైన వారసుడు బీమా మొత్తాన్ని క్లెయిమ్ చేయవచ్చు. దీని ప్రకారం, సభ్యుని నామినీ వయస్సు తప్పనిసరిగా 18 సంవత్సరాలు. బహుశా నామినీ వయస్సు 18 కంటే తక్కువ ఉంటే, అతని తల్లిదండ్రులు డబ్బును క్లెయిమ్ చేయవచ్చు. ఈ మొత్తాన్ని పొందడానికి డెత్ సర్టిఫికేట్, వారసత్వ ధృవీకరణ పత్రం వంటి పత్రాలు తప్పనిసరి.

## విజయ్ సేల్స్ ఫ్రీడమ్ సేల్‌లో కళ్లుచెదిరే ఆఫర్లు.. ఆ ఫోన్లపై భారీ డిస్కౌంట్లు



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చాలా కంపెనీలు ఫ్రీడమ్ సేల్స్ ద్వారా వినియోగదారులకు ప్రత్యేక తగ్గింపులను అందిస్తున్నాయి. ఇప్పటికే ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ఈ-కామర్స్ సైట్స్‌లో ఫ్రీడమ్ సేల్స్ ముగియగా ప్రస్తుతం ఆఫ్‌లైన్ స్టోర్స్‌లో ఫ్రీడమ్ సేల్స్ ఊపందుకున్నాయి. తాజాగా ప్రముఖ కంపెనీ విజయ్ సేల్స్ తన మెగా ఫ్రీడమ్ సేల్‌ను ప్రారంభించింది, ఆడియో పెరిఫెరల్స్, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు, టాబ్లెట్‌లపై డిస్కౌంట్లను అందిస్తోంది. విజయ్ సేల్స్‌లో ఉన్న ప్రతి ఉత్పత్తిపై ప్రత్యేక తగ్గింపు అందిస్తామని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. ముఖ్యంగా స్మార్ట్ ఫోన్స్ ప్రత్యేక ఆఫర్లను విజయ్ సేల్స్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో విజయ్ సేల్స్ ఫీడమ్ సేల్ గురించి వివరాలను తెలుసుకుందాం. సీఎంఎఫ్ ఫోన్ 1 లండన్ ఆధారిత ఫోన్ తయారీ సంస్థ నథింగ్ ఇటీవల సీఎంఎఫ్ ఫోన్ 1 పేరుతో కొత్త ఫోన్‌ను విడుదల చేసింది. మీడియా టెక్ డైమెన్సిటీ 2500 చిప్‌సెట్ ద్వారా పని చేసే ఈ ఫోన్‌పై ఫ్రీడమ్ సేల్ ప్రత్యేక తగ్గింపులను అందిస్తుంది. సీఎంఎఫ్ ఫోన్ 1 6.7-అంగుళాల 120 హెచ్‌జెడ్ ఎమోఎల్‌ఈడీ స్క్రీన్‌తో వస్తుంది. ఆండ్రాయిడ్ 14 ఆధారంగా పనిచేసే ఈ ఫోన్ ప్రస్తుతం విజయ్ సేల్స్‌లో రూ. 15,999కి అందుబాటులో ఉంది. అయితే మీరు వన్ కార్డు ఈఎంఐ ద్వారా కొనుగోలు చేస్తే రూ. 1,000 తగ్గింపును పొందవచ్చు. అలాగే యస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్, ఫెడరల్ కార్డ్ హోల్డర్‌లు 5 శాతం వరకు తగ్గింపు పొందవచ్చు. ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్ ఆర్‌బీ కార్డ్ హోల్డర్‌లకు 7.5 శాతం తగ్గింపును కూడా అందిస్తుంది. వన్ ప్లస్ 12 ఆర్ ఈ ఫోన్‌ను 2024 జనవరిలో వన్ ప్లస్ ప్రారంభించింది. స్నాప్ డ్రాగ్ జెన్ 2 చిప్‌సెట్ ఆధారంగా పని చేసే ఈ ఫోన్ 6.78-అంగుళాల ఫుల్ హెచ్‌డీ ఎమోఎల్‌ఈడీ స్క్రీన్‌తో పని చేస్తుంది. ఈ ఫోన్ 8 జీబీ ం 256 జీబీ వేరియంట్‌ను రూ. 41,999కి కొనుగోలు చేయవచ్చు. అయితే ఐసీఐసీ కార్డ్ హోల్డర్లు ఈఎంఐ లావాదేవీలపై రూ. 2,000 తగ్గింపును పొందవచ్చు. విజయ్ సేల్స్ కూడా వన్ ప్లస్ ఈఎంఐ, హెచ్‌ఎస్‌బీసీ క్రెడిట్ కార్డ్ ఈఎంఐ లావాదేవీలపై 5 శాతం మరియు 7.5 శాతం తగ్గింపును అందిస్తోంది. ఐఫోన్15 ఫ్లిప్ కార్ట్ మాదిరిగానే విజయ్ సేల్స్ కూడా ఐఫోన్ 15ని తగ్గింపు ధరకు అందిస్తోంది. ఐఫోన్ 15 బేస్ వేరియంట్ 128 జీబీ ర్యామ్‌తో వచ్చే 6.1-అంగుళాల ఓఎల్‌ఈడీ స్క్రీన్‌తో వస్తుంది. 48 ఎంపీ ప్రైమరీ కెమెరాతో వచ్చే ఈ ఫోన్‌ను ఐసీఐసీఐ బ్యాంక్, క్రెడిట్ కార్డ్‌తో కొనుగోలు చేస్తే రూ. 4,000 తగ్గింపు పొందవచ్చు. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌ఎస్‌బీసీ బ్యాంక్, ఆర్‌బీఎల్ కార్డ్ వినియోగదారులు ఈఎంఐ లావాదేవీలపై 7.5 శాతం తగ్గింపును పొందవచ్చు. అలాగే వన్ కార్డు, యస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్, ఫెడరల్ కార్డ్ హోల్డర్‌లు 5 శాతం తగ్గింపును పొందవచ్చు.



# గోపీచంద్ సినిమా కోసం నలుగురు డైరెక్టర్లు

టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వస్తున్న చిత్రం జాట్. బాలీవుడ్ స్టార్ యాక్టర్ సన్నీడియోల్ హీరోగా నటిస్తున్నాడు. ఎస్‌డీజీఎం ప్రాజెక్టుగా వస్తోన్న ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. రెజీనా కసాండ్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. ఈ సినిమాలో హైఆక్టేన్ యాక్షన్ స్టంట్స్ థ్రిల్ అందించబోతున్నాయట. అంతేకాదు తాజా టాక్ ప్రకారం ఈ సినిమా కోసం ఏకంగా నలుగురు యాక్షన్ డైరెక్టర్లు పనిచేస్తున్నారు. అనల్ అరసు, రామ్-లక్ష్మణ్, నాగవెంకట్, పీటర్ హెయిన్స్ టీం జాట్ కోసం ఇంటెన్స్ ఫైట్ సీక్వెన్స్, యాక్షన్ సీన్లను రెడీ చేస్తుందని ఇన్‌సైడ్ టాక్. గోపీచంద్ మలినేని నుంచి ఎలాంటి యాక్షన్ మూవీ వస్తుందో చెప్పేందుకు ఈ ఒక్క అప్‌డేట్ చాలు. ఇటీవలే విడుదలైన ట్రైలర్ సినిమా ఎలా ఉండబోతుందో హింట్ ఇచ్చేస్తుంది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ యాక్టర్ రణ్‌దీప్ హుడా విలన్‌గా నటిస్తున్నాడు. ఈ మూవీకి టాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రానికి రిషి పంజాబి సినిమాటోగ్రాఫర్. అవినాష్ కొల్ల ప్రొడక్షన్ డిజైనర్.గోపీచంద్ మలినేని బీటౌన్ జాట్ సినిమాతో డెబ్యూ ఇస్తుండటంతో అంచనాలు పెరిగిపోతున్నాయి.



# ఏసుబాయిగా రష్మిక

## ఆకట్టుకుంటున్న న్యూగెటప్

పుష్ప ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్‌తో నేషనల్ క్రష్‌గా మారిపోయింది కన్నడ సోయగం రష్మిక మందన్నా. గ్లామరస్ పాత్రలతో నటనకు ఆస్కారమున్న రోల్స్‌లో నటిస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తుంటుంది రష్మిక. ఈ భామ ఖాతాలో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు లైన్‌లో ఉన్నాయి. ఈ భామ నటిస్తోన్న సినిమాల్లో ఒకటి. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జీవిత కథ ఆధారంగా వస్తోన్న ఈ మూవీకి లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో విక్కీ కౌశల్ టైటిల్ రోల్‌లో నటిస్తుండగా.. ఇందులో రష్మిక ఛత్రపతి శివాజి సతీమణి మహారాణి ఏసుబాయిగా నటిస్తోంది. ఈ మూవీని ఫిబ్రవరి 14న విడుదల చేయబోతున్నారు. ప్రతి గొప్ప రాజు వెనుక అసమానమైన బలం కలిగిన రాణి ఉంటుంది. స్వరాజ్యం గర్వపడే మహారాణి యేసుబాయి.. అని ట్వీట్ చేస్తూ తన పాత్ర లుక్‌ను షేర్ చేసింది రష్మిక మందన్నా. ఈ మూవీ ట్రైలర్ రేపు లాంచ్ చేయనున్నట్టు ప్రకటించింది. ఇందులో రష్మిక పాత్ర చాలా పవర్ ఫుల్‌గా ఉండబోతుందని తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. కథానుగుణంగా సినిమా పూర్తిగా మరాఠి భాషలో సాగనుందని బీటౌన్ సర్కిల్ టాక్. ఈ నేపథ్యంలో రష్మిక మరాఠి భాష నేర్చుకుందని ఇప్పటికే వార్తలు కూడా వచ్చాయి. మ్యాడ్‌డాక్ ఫిలిమ్స్ బ్యానర్‌పై వస్తోన్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు.



# విజయ్ సినిమా టీజర్ రెడీ

ఫ్యామిలీ స్టార్ సినిమా తర్వాత విజయ్ దేవరకొండ కాంపౌండ్ నుంచి వరుస సినిమాలు రాబోతున్న విషయం తెలిసిందే. వీటిలో ఒకటి జెర్సీ ఫేం గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తున్న వీడీ12. మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాను మే 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారని ఇప్పటికే వార్తలు రాగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కాగా ప్రస్తుతం ఈ సినిమా టీజర్ ఎప్పుడనే వార్త బయటకు వచ్చింది. ఈ మూవీ టీజర్ రెడీ అయింది. ఫిబ్రవరి 7న టీజర్ విడుదల చేసే ప్లాన్‌లో ఉన్నారు. టీజర్‌లో విడుదల తేదీ చెప్పబోతున్నారంటూ.. మే 30 డేట్‌ను మరోసారి గుర్తు చేసింది పీఆర్ టీం. ఇంకేంటి మరి త్వరలోనే వీడీ12 టీజర్ రాబోతుందన్నమాట. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్-శ్రీకర స్టూడియోస్ బ్యానర్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. వీడీ 12లో విజయ్ దేవరకొండ తొలిసారి ఖాకీ డ్రెస్ వేసుకోబోతున్నాడు. ఇందులో విజయ్ దేవరకొండ పవర్ ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నాడని సమాచారం. విజయ్ దేవరకొండ ఈ ప్రాజెక్టుతోపాటు రాజావారు రాణిగారు ఫేం రవికిరణ్ కోలా దర్శకత్వంలో సినిమా కూడా చేస్తున్నాడు. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ తెరకెక్కిస్తోంది.

# ఖైరతాబాద్ ఆర్టీవో కార్యాలయానికి వచ్చిన సినీహీరో నాగచైతన్య

టాలీవుడ్ యాక్టర్ నాగచైతన్య ఖైరతాబాద్ ఆర్టీవో కార్యాలయంలో సందడి చేశాడు. తన డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ చేయించుకోవడానికి ఆర్టీవో కార్యాలయానికి వచ్చాడు. నాగచైతన్య రెన్యూవల్ కోసం ఆర్టీఏ జాయింట్ కమిషనర్ రమేశ్‌ను కలిశాడు. ఈ మేరకు రవాణా శాఖ అధికారులు నాగచైతన్యను డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు తెలుసుకుని రెన్యూవల్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా చైతూను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో ఆర్టీవో కార్యాలయానికి తరలివచ్చారు. నాగచైతన్య ప్రస్తుతం తండేల్ సినిమాలో నటిస్తున్నాడు. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో ప్రాజెక్టుగా వస్తోన్న ఈ మూవీకి చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నాడు. సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్ షురూ చేసేందుకు రెడీ అవుతున్నారు.





# ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన సైఫ్

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. గత వారం సైఫ్ ఇంటికి చోరీకి వచ్చిన దుండగుడు నటుడిపై కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. దాడి అనంతరం తీవ్ర గాయాలతో లీలావతి ఆసుపత్రిలో చేరారు. అక్కడ ఆయనకు వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ఆరు రోజుల చికిత్స అనంతరం ఇవాళ డిశ్చార్జ్ అయ్యారు. వారం పాటు పూర్తి బెడ్ రెస్ట్ తీసుకోవాలని సైఫ్‌కు వైద్యులు సూచించారు. అదేవిధంగా ఇన్ఫెక్షన్ అవ్వకుండా ఉండేందుకు ఎక్కువమంది ఆయన వద్దకు రాకుండా చూసుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఈనెల 16న సైఫ్ ఇంటికి చోరీకి వెళ్లిన దుండగులు ఆయనపై కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఆరుసార్లు సైఫ్‌ను దుండగుడు కత్తితో పొడిచాడు. గురువారం తెల్లవారుజామున 2:30 ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు వెంటనే సైఫ్‌ను ముంబైలోని లీలావతి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ నటుడికి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. మరోవైపు సైఫ్‌పై దాడి కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్‌ను శనివారం అర్ధరాత్రి 2.50గంటలకు థానేలోని హిరానంది ప్రాంతంలో అరెస్టు చేసి విచారిస్తున్నారు. విచారణలో భాగంగా క్రైమ్‌సీన్ రీక్రియేషన్ కోసం నిందితుడిని సైఫ్ ఇంటి వద్దకు తీసుకెళ్లారు. నిందితుడి వేలిముద్రలను కూడా తీసుకున్నారు.

# బ్యాంకు లాకర్స్ ఓపెన్ చేసి చూపించాం : దిల్‌రాజ్ భార్య

ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు నివాసాలు, ఆఫీసుల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారని తెలిసిందే. హైదరాబాద్‌లోని 8 చోట్ల ఏకకాలంలో 55 బృందాలు దాడులు చేపట్టాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కొండాపూర్, గచ్చిబౌలి సహా పలు ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా దిల్ రాజు భార్య తేజస్వినిని అధికారులు బ్యాంక్‌కు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో తేజస్విని మీడియాతో మాట్లాడుతూ.. ఇవాళ ఉదయం నుంచి ఐటీ సోదాలు జరుగుతున్నాయన్నారు. బ్యాంకు వివరాలు కావాలని అధికారులు అడిగారు. బ్యాంకు లాకర్స్ ఓపెన్ చేసి చూపించామని చెప్పారు. దిల్ రాజు నివాసాలతోపాటు ఆయన సోదరుడు శిరీశ్, కుమార్తె హన్సితరెడ్డి ఇండ్లలోనూ ఐటీ అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. దిల్ రాజు వ్యాపార భాగస్వాముల నివాసాలతోపాటు పుష్ప 2 సినిమా నిర్మాత నవీన్ ఎర్నేని, మైత్రి మూవీస్ కార్యాలయాల్లో కూడా ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి



# హైదరాబాద్ సీపీ మళ్లీ ఫిర్యాదు చేసిన మాధవీలత

బీజేపీ నేత, సినీ నటి మాధవీలత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మధ్య నెలకొన్న వివాదం మరింత ముదురుతోంది. తనను ప్రాస్టిట్యూట్ అంటూ పరుష పదజాలంతో దూషించిన జేసీ ప్రభాకర్ రెడ్డిపై ఇప్పటికే మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా), తెలుగు ఫిలిం ఛాంబర్‌కు మాధవీలత ఇప్పటికే ఫిర్యాదు చేశారు. తాజాగా జేసీ ప్రభాకర్ రెడ్డిపై సైబరాబాద్ సీపీకి కూడా ఫిర్యాదు చేశారు. జేసీపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జేసీ మాటలతో తాను, తన కుటుంబం ఎంతగానో ఇబ్బంది పడిందని ఈ సందర్భంగా మాధవీలత అన్నారు. క్షమాపణ చెప్పానంటే సరిపోతుందా అని ప్రశ్నించారు. నాయకులు ఇలాంటి భాష మాట్లాడితే ఎలా అని నిలదీశారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలోని జేసీ పార్క్‌లో మహిళల కోసం ప్రత్యేకంగా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. అయితే ఆ వేడుకలకు వెళ్లవద్దని.. అక్కడ మహిళలకు రక్షణ ఉండదని మాధవీలత ఒక వీడియో రిలీజ్ చేశారు. దీనిపై జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మాధవీలత ఒక సినిమా యాక్టర్ అని.. యాక్టర్స్ అంతా ప్రాస్టిట్యూట్స్‌నే అని పరుష పదజాలంతో విమర్శించారు. జేసీ చేసిన ఈ వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపాయి. దీనిపై బీజేపీ నాయకులు మండిపడ్డారు. దీంతో వెనక్కి తగ్గిన జేసీ ప్రభాకర్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. తన వయసు 72 సంవత్సరాలు అని.. ఆవేశంలో అలా మాట్లాడానే తప్ప ఎవరినీ కించపరచాలనే ఉద్దేశంతో మాట్లాడలేదని వివరించారు. ఎవరి బతుకుదెరువు వారిదేనని అన్నారు. మాధవీలతపై తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని తెలిపారు. మాధవీలతను క్షమాపణలు కోరారు. జేసీ ప్రభాకర్ రెడ్డి క్షమాపణలు చెప్పడంతో ఈ వివాదం ముగిసిపోతుందని అంతా అనుకున్నారు. కానీ మాధవీలత మాత్రం జేసీని క్షమించలేదు. ఆ విషయాన్ని ఎంతలా మరిచిపోదామన్న తన వల్ల కావడం లేదని అప్పట్లోనే ఒక వీడియోను కూడా రిలీజ్ చేశారు. ' చాలా ప్రయత్నం చేశా.. కానీ నేను మనిషినే.. నా ఆత్మ గౌరవం మీద జరిగిన దాడి.. నాకున్న బాధను వర్ణించే పదాలు లేవు. ప్రతిక్షణం వేదనతో నిండి ఉంది.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com